ఆంధ్రసచిత్రవార

పత్రిక

విలాసంగా విశేషం



19-3-65

30పైసలు



"తేనె మనసులు"లో సుకన్య



దురాశ దుర్మార్గులను
ఎలా పెంచుతుందో
వాళ్ల నాశనానికి కూడా
అదే కారణమవుతుంది.
SUCCESS
చందమామ వారి
దొరికితే దొంగలు
దర్శకత్వం... పి.సుబ్రహ్మణ్యం
సంగీతం... ఎస్.రాజేశ్వరరావు
నవయుగ



అందరి కొరకూ ఆహారము కాని వృథా చేయడానికి మాత్రం కాదు

'వృథాకానీయక పోవడం మంచిదే. కాని నే ననుకునేదేమి టంటే, ఉత్పత్తి ఎక్కువ కావడం అవసరం.

నిజమే, కాని మన ఆహారోత్పత్తి 1950–51లో 50 83 మిలియన్ టన్నుల నుండి 1963–64లో 79.43 మిలియన్ టన్నులవరకూ పెరిగింది. అంతేకాక 1964లో మనం ఆరు మిలియన్ల టన్నులకు పైగా గోధుమలు, బియ్యము దిగుమతి చేసుకున్నాము. ఇది అందరికీ ఆహారము సమకూర్చగలగాలి.

అంటే నీవనేది, ఆహారం పంచడంలో లోపమున్నదనా?


అవును. అదే, నిలువ చేయడము, వృథాచేయడము.

అయితే పంటలు, బాగున్నాయి కాబట్టి మనం భయపడాల్సిందేమీలేదు.

నీవు వృథాచేయక, నీకు నిజంగా ఎంత అవసరమో అంతే కొనుక్కుంటే భయపడాల్సిందేమీలేదు.

మనం కొంత క్రమశిక్షణని, సహనాన్ని పాటించాలి. ఎందుకంటే ఉత్పత్తి మిగులు రాష్ట్రాలు, తరుగు రాష్ట్రాలని తమలో భాగం పంచుకోనివ్వాలి.

క్రమశిక్షణ, సహనము పాటించి
ఆహార సమస్యా పరిష్కారానికి తోడ్పండి.



స్టుడియో శ్రీసారథీ
శ్రీశైలింస్ విడుదల
BM
ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మించిన తొలి తెలుగు సాంఘిక చిత్రం
అంతా క్రొత్తవారితే నటించిన సంచలన చిత్రం
బాబూ మూవీస్ వారు సగర్వంగా సమర్పించు
తేనె మనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత సి. సుందరం సంగీతం మహదేవన్
కోడైరెక్టర్ కె. విశ్వనాథ్
రామ్మోహన్
వెంకటేశ్వరరావు
పుష్పకుమారి
కన్నబిడ్డ కన్నా అపురూపంగా
పెంచి పెద్ద చేసిన తమ్ముడు
చిట్టిబాబు ఆ అనుబంధాన్ని
ఇట్టే తుంచిపారేశాడు
తప్పు అతనిదా! బిడ్డతోబాటు
ఆశల్ని పెంచుకున్న
అన్నా వదినలదా! ఆశపడబట్టే
నిరాశ కలిగించేమో!
NIKR

న్యూఢిల్లీ లేఖ

ఈమధ్య 'న్యూఢిల్లీలేఖ' చదువుతుంటే ఏదో ఢిల్లీ స్థానిక పత్రిక చదువుతున్నట్లుంటుంది. దేశపాలన, మరియు దేశాభివృద్ధికి సంబంధించిన విషయములకంటె ఢిల్లీ నగర వార్తలే ఎక్కువ ప్రాముఖ్యత వహిస్తున్నవి. ఢిల్లీ నగరమునుండి వందలాది మైళ్ళ దూరమున ఉంటున్న ఆంధ్రులను, ఆచటి కోతుల బెడద, నగరపాలనలోని అవకతవకలు మరిటువంటి సంగతులు ఎంతవరకు ఆకర్షించగలవు?

జి. యస్. కుమారస్వామిరాజ (మద్రాసు)

వైజ్ఞానిక గాథాశతి

"వైజ్ఞానిక గాథాశతి—3" లో 'డాక్టరు' వ్రాసినట్లు చంద్రుడు తనచుట్టూతాను తిరగడము లేదని" వ్రాసిన కె. అప్పారావు (బొంబాయి) గారి తోడ్పాటుకి అభినందనాలు. వారుచెప్పినది మాత్రం అభినందించలేము! చంద్రుడు తన చుట్టూతాను తిరుగుతునే వున్నాడు! చంద్రుడి ఆత్మభ్రమణకాలమూ చంద్రుడు భూమిచుట్టూ చేసే ప్రదక్షిణకాలమూ సమము. అందువల్ల, భూమినుంచి చూస్తే చంద్రుడిది అపార్శ్వమే కనబడుతుంది. టేబిలు మీద మధ్యలో ఒక పేపర్ వెయిట్ పెట్టి, మీ వాచీని పేపర్‌వేయిట్‌కి డైము కనబడుతూనే వుండేటట్టు తిప్పండి. చుట్టూ తిరగడములో వాచీ తనచుట్టూ తాను ఒకసారి తిరుగుతుంది. "ఒప్పులకుప్పా వయ్యారిభామా" అంటూ తిరిగే బాలికల చేతులు కలిసే చోటు భూమి. ఒక బాలిక తలను చూడండి. చుట్టూ ఒక ప్రదక్షిణము చేసేలోగా ఆ తల తన చుట్టూ తాను ఒకసారి తిరుగుతుంది. రంగుల రాట్నములో మధ్యస్తంభమువైపు తిరిగి కూర్చునే కుర్రవాణ్ణి మీరు 'దూరమునుంచి చూడండి. వాడు రాట్నము చుట్టూ తిరుగుతూ, అన్ని దిక్కులూ చూసి మొదటి స్థితికి వస్తాడు. అంటే ఒక ఆత్మప్రదక్షిణము చేశాడన్నమాటకాదూ? చంద్రుడూ అంతే. ఈసంగతి గెలీలియో కనుక్కున్నాడని కాదు సూచన. సూర్యుడు తనచుట్టూ తాను తిరుగుతూన్నట్టు కనుక్కున్నాడని మాత్రమే.

'డాక్టర్'

* * *

"29—1—65 వారపత్రికలో వెలువడిన "వైజ్ఞానిక గాథాశతి—3" లో డాక్టరుగారు చెప్పినది తప్పని బొంబాయినుండి కె. అప్పారావుగారు చేసిన సూచన (తే 26—2—65) లో తప్పు. డాక్టరుగారు చెప్పినట్టు చంద్రుడు కూడా తనలో తాను తిరుగుతున్నాడు. ఐతే చంద్రుడు తనలో తాను తిరుగుటకు పట్టుకాలములోనే భూమి చుట్టు తిరుగుటవలన మనం చంద్రుని వెనుక భాగం చూడలేం. ఒక వృత్త కేంద్రమువద్ద వస్తువు నుంచి, ఆ వృత్త పరిధిపై ఎప్పుడూ ఆ వస్తువును చూస్తూ తిరిగితే ఏమవుతుంది? ఒక పూర్తి చుట్టులో మనం కూడ మనలో ఒక చుట్టు తిరిగాం—కాని ఎప్పుడూ మన వెనుకభాగం (వీపు) కేంద్రంవద్ద నుంచిన వస్తువు వైపు తిరగదుగా.

ఉత్తరాలు

అలాగే చంద్రుడు కూడ భూమిచుట్టు తిరుగుట వలన మనం చంద్రుని వెనుకభాగం చూడలేం.

సరోజ (చీపురుపల్లి)

ఇంటింటి పజ్యాలు

ఇంటింటి పజ్యాలు ఆఖరైనందుకు విచారిస్తూ, త్వరలో మరేదయినా క్రొత్త శీర్షిక ప్రవేశపెట్టి పాఠకులకు సంతృప్తిని కలగచేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

శ్రీ రామోజు లక్ష్మీనరసయ్య (ఆసిఫ్‌నగర్)

సత్యమూర్తి

సత్యమూర్తిగారు వివాహితులు అయినందుకు నాలాంటి పాఠకులకు చాల సంతోషం. ఇకనుంచి ఆయన వెయ్యబోయే కార్టూనులలో ఏమన్నా మార్పు వస్తుందేమోనని భయంగా ఉంది. (వనితలకు సంబంధించినంతవరకు)

కె. గోపాలరావు (భీమడోలు)

ఫిలిం బాలెట్

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఏలూరు పాఠకుడు వ్రాసిన లేఖ చదివి చాలా ఆశ్చర్యపోయాను. 'మూగ మనసులు' చిత్రం 1963 డిశంబరు 30 లేక 31 న విడుదలయిందని ఆ పాఠకుడు పేర్కొనటం శోచనీయం. ఆ చిత్రం 1964 జనవరి 31 న విడుదలయింది. ఈ విషయాన్ని పత్రికాధిపతులు గమనించి బ్యాలెట్ ఫలితాలను ప్రకటించగలరని ఆశిస్తున్నాను.

మిక్కిలినేని జగదీష్‌బాబు (విజయవాడ)

కథలు

"ఓడిపోయాను" కథానికలో పాత్రల వ్యక్తిత్వాలను చిత్రీకరించటంలోనూ, సన్నివేశాలకు బిగువు తేవటంలోనూ, రచయిత్రి ఇంకొద్దిగా శ్రమ తీసికొనిఉంటే కథ ఇంకా రాణించేది.

'ఫిలిం ఫెస్టివల్'— గురించి మీరు ప్రచురించిన సమీక్షలు— తలమానికంగా ఉన్నాయి. మన దేశ గౌరవానికీ, ప్రభుత్వ గౌరవానికీ సంబంధించిన ఇంత ముఖ్యమైన ప్రదర్శనల ఏర్పాట్ల విషయంలో అవకతవకలుండటం చాలా విచారకరం.

తెన్నేటి రామారావ్, రాజారావ్, కె. దామోదరం. (రూర్కేలా)

* * *

'ఓడిపోయాను' కథ చాలా బాగుంది. చదివి ఎంతో సంతోషించాను

కుమారి లత (చేబ్రోలు)

* * *

మీరు ప్రచురించిన యద్దనపూడి సులోచనరాణిగారి "ఓడిపోయాను" 19—2—65 పత్రికలో కథ చదవేక ఈ ఉత్తరము రాయాలని అనిపించింది. ఈవిడకథే లోగడ "ఐ లవ్ యూ" చదివేను. కథ చాల పెద్దదైనప్పటికిన్నీ మొత్తము మీద కథ క్రొత్త పోకడలతోను, మంచి ఉత్తమంగా ఉంది. ఈసారి చదివేక చాల నిరాశ పొందినది. కథలో పటుత్వములేదు. ఉద్దేశ్యము అంత కన్నా లేదు. ఎక్కువ వూకదంపుడు పదాలు, కథను పెంచాలనే అనవసరంగా పేజీలకు పేజీలు వ్రాసేరు. పాత్రలలో ఎక్కడా మానవునిలోఉండే ఉద్దేశ్యములు లేక, వూహాపార్శ్యములు నిర్మించి వ్రాసేరు.

బొప్పల్లి బాలకృష్ణమూర్తి (సీలేరు ప్రాజెక్టు)

* * *

26—2—1965 వ సంచికలోని రామలక్ష్మి వ్రాసిన "అవ్యక్తరాగం" కథ చిన్నదిగా యున్నా చాలా బాగుగా యున్నది.

ఎ. నాగసుబ్బారెడ్డి (బసవాపురం)

భాషా సమస్య

అణ్వస్త్రాల గురించి పట్టించుకున్నట్లుగా హిందీ వాదం గురించి పాఠకులు పట్టించుకోటంలేదని మీరు సందేహిస్తున్నారని తెలిసింది. వ్రాయవలసినవారు పత్రికలకు వ్రాయటం అవి ప్రభుత్వం పట్టించుకోకపోటం అన్నీ అయిపోయాయి. అందుకనే విద్యార్థులు ఆందోళన మొదలు పెట్టారు. అయితే పట్టించుకున్నవారు లేకపోయారు. (విద్యార్థులు వినోబాభావేలు కారుగా!) అందుకని కొంత దౌర్జన్యం చెయ్యక తప్పలేదు, విద్యార్థులకి. అప్పటికిగాని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక కేవలం మద్రాసు రాష్ట్రంవారు మాత్రమే వ్యతిరేకులని ప్రధాని, అసలు విద్యార్థుల వెనకాతల రాజకీయపక్షాలు ఉన్నాయని ముఖ్యమంత్రులు తమకు తామే సమాధానం చెప్పుకుని మురిసిపోతున్నారు. ఏదైతేనేం ప్రధానమంత్రి ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేసారు. అయితే ప్రస్తుత సమస్య ముఖ్యమంత్రులు ప్రజాభిప్రాయానికి ప్రతినిధులా అన్న అనుమానం కలుగుతోంది. కారణం విద్యార్థులు ఎన్నిసార్లు చెప్పినా వారు తమ ధోరణి మార్చుకోలేదు.

మా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ విద్యార్థులలో చాలమందికి ఈ సమస్యే ఎదురైంది. అందుకనే మేము అంచెలంచెలుగా నిరాహారదీక్ష జరిపాము. మా ఉద్దేశంలో :

1. కేంద్రములో ద్విభాషా విధానం పనికిరాదు.
2. రాజ్యాంగము సవరించాలి.
3. ముఖ్యమంత్రులు ప్రజాభిప్రాయాన్ని వెల్లడించటంలేదు.

అయితే విద్యార్థులు క్లాసులకి, రిసెర్చి స్కాలర్సు లాబ్స్‌కి వెళ్తున్నారు. ఎక్కడా (ఈ వూరి తెలుగులో) గలాటాలేదు. అంతా శాంతియుతంగా జరిగిపోతోంది.మా వెనుకరాజకీయపక్షాలు ఉన్నాయో ముఖ్యమంత్రులకే తెలియాలి.

ఉత్తరాల కాలం మించిపోవడంవల్ల తీరుబడి లేక మీకు బహుశ ఎవరూ వ్రాయలేదనుకుంటాను. దానివల్ల వ్యతిరేకతను మీరు తక్కువ అంచనా వెయ్యకండి.

అయితే మేము హిందీ భాషకు, హిందీవారికి వ్యతిరేకులంకాము. అది అధికార భాషగా మాత్రం ఒప్పుకోము.

కె. వి. యస్. శర్మ (బెంగుళూరు) ★

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 19—3—'65
(క్రోధినామ సం॥ ఫాల్గుణ మాస బ॥ విదియ
సంపుటము : 57 సంచిక 29

స్థాపితము:
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*


ఒక సంవత్సరం
చందా వివరాలు

ఇండియా రూ. 15.60. ఇతర దేశాలు ఓడమీద (Sea Mail) రూ. 28.60. విమానం ద్వారా (Air Mail) బ్రిటన్, జర్మనీ, ఇతర యూరోప్, ఆఫ్రికా దేశాలు రూ. 120.00. అమెరికా రూ. 176.80. ఆస్ట్రేలియా రూ. 148.20

విడిప్రతి 30 పై.
సంవత్సర చందా 15.60 పై.
6 మాసాల చందా 7.80 పై.

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1



అప్పాయ్: నువ్వుమాత్రం నా హిందీ వ్యతిరేకోపన్యాసాలను అనుసరించవద్దు, తెల్సిందా?

మనలో మాట

ఇటీవలే మద్రాసులో ఒక సమావేశంలో మాట్లాడుతూ ఒక బ్రిటిషు గణిత శాస్త్రజ్ఞుడు ఒకదేశంలో కొన్నిరోజులు మాత్రమే ఉంటే చాలా తెలిసినట్లనిపిస్తుందనీ, ఇంకా కొన్ని రోజులు ఉంటే తెలియవలసినది చాలా ఉంటుందనిపిస్తుందనీ అన్నాడు; కాని, శ్రీ చిత్తరంజన్ ఆరితేరిన పత్రికా రచయిత కాబట్టి, క్యూబామీద ఆయన అభిప్రాయాలలో కొంత నిజం ఉండకపోదని ఊహించవచ్చు! శ్రీ చిత్తరంజన్ 'మెయిన్ స్ట్రీమ్' లోనే కాక మరొక సుప్రసిద్ధ ఆంగ్ల దినపత్రికలో కూడా పని చేస్తున్నారు...

* * *


'మానసంరక్షణకోసం' అనే శీర్షిక పైవారమే ప్రారంభం అవుతుంది. ఈ శీర్షిక క్రింద అయిదు వ్యాసాలు వరుసగా ప్రచురిస్తాము...

* * *

2-4-1965 తేదీ ఆంధ్రసచిత్ర వారపత్రిక 'ఉగాది ప్రత్యేక సంచిక'గా వెలువడుతుంది. ఈ ప్రత్యేక సంచికలో రాబోయే ప్రత్యేక ఆకర్షణలు కొన్ని వచ్చేవారం వివరిస్తాము...

విషయానుక్రమణిక

ముఖచిత్రం: 'తేనెమనసులు' చిత్రంలో కొత్తనటి సంధ్యారాణి.


ఇదిగో టోపీ!
ఇప్పుడు నేను దీంట్లోనుంచి కాంగ్రెస్ విజయం అనే కుందేలును తేస్తాను చూడండి!
ఇందులోది ఇప్పుడేం లేదు!
ఆ! .... చచ్చిన ఎలుక!?
టి.టి.కె త్రాటి గారడీ!
చైనా-పాకిస్తాన్ ముచ్చట్లు

న్యూఢిల్లీ లేఖ

హిందీ తీవ్రవాదుల భేదోపాయాలు

ఇది నా స్వీయచరిత్రకి సంబంధించిన లేఖ కాదు.

ఐక్య భారతదేశం ముక్కలయి విడిపోవటానికి కారణమయిన మంటలు రాజయ్యటం మీ విలేఖరి చూశాడు. కాంగ్రెసు 'స్వాతంత్ర్య తీర్మానం' ముస్లిం లీగ్ చేసిన 'పాకిస్తాన్ తీర్మానం' లాహోరులోనే అయినప్పటికీ అసలు పాకిస్తాన్ పునాదులు లక్నోలో అంతకుముందే కాంగ్రెస్ నాయకులు కొందరు వేశారు. 1947 ఆగస్టు దాకా కూడా కొంతమంది, పాకిస్తాన్ నిర్మాణం తమ మృతదేహాల

కామరాజ్ పై కుతంత్రాలు

మీద జరగాలని అరుస్తూ వచ్చారు. కాని 15 ఆగస్టు, 1947 నాడు భారతదేశం రెండు ముక్కలయిపోయింది. అంతకుముందు, ఇది వీలులేదని కేకలు వేసినవారే దానివల్ల బాగుపడ్డారు.

ఇదంతా ఎందుకు చెప్తున్నాను ? పాకిస్తాన్ రాకమునుపు కాంగ్రెసు నాయకులు ముస్లింల కోరికల పట్ల చూపిన వైఖరిని తెలుపటానికి. ఐక్య భారతదేశంలోని మహమ్మదీయులు హిందూ నాయకులని నమ్మి లాభం లేదనుకున్నారు. ముందు తమ సంస్కృతి, భాష— వాటిని సంరక్షించుకోవాలనుకుని కొన్ని హామీలు అడిగారు. వాద వివాదాలన్నీ భాష, ఉద్యోగాలు, వీటిమీదనే జరిగాయి. ముస్లింలు ఉర్దూ కావాలన్నారు. హైందవులు హిందీ కావాలన్నారు. లిపి గురించి కూడా పోట్లాటలు జరిగాయి. మహమ్మదీయులు ఆరబిక్ లిపి కావాలన్నారు. హైందవులు దేవనాగరి కోసం వాదించారు.

హైందవులు కాని, ముస్లింలు కాని మనుష్యుల సంగతి పట్టించుకోలేదు. ముస్లింలు మసీదుల ముందు సంగీతం విని తలలు పగులకొడితే హైందవులు గోవధ విషయంలో అదే తీవ్ర ధోరణి ప్రదర్శించారు.

కాంగ్రెసు ప్రజాస్వామ్యం గురించి చెప్పేది. ముస్లింలీగ్‌కి ఈరకం ప్రజాస్వామ్యం మీద విశ్వాసము లేదు. రాజకీయ పక్షాలమీద కాక మత వర్గాల మెజారిటీల మీద ఆధారపడే పద్ధతిమీద వారికి నమ్మకం కుదరలేదు. కాంగ్రెసువారు, తమ పార్టీలో ఎందరో ముస్లింలు ఉన్నారని చెప్పేవారు. వారంతా కీలుబొమ్మలని ముస్లింలీగ్‌వారనేవారు.

'హైందవుల ధోరణి' ఎటువంటి ఫలితాలకి దారితీసిందో చెప్పాను. చివరికి మహాత్మాగాంధి సూచించిన 'హిందుస్తానీ' కూడా ఈ సమస్యని పరిష్కరించలేకపోయింది. లిపి సమస్య అలాగే ఉండిపోయింది. కాంగ్రెసు, దేవనాగరిలో హిందుస్తానీ కావాలంది. 'హైందవ' దుష్పరిపాలన, అనే భయమే పాకిస్తాన్ సృష్టికి కారణం.

స్వాతంత్ర్యం వచ్చి 17 సంవత్సరాలు దాటింది. కాని గంగా నదీ ప్రాంతాల వారి వైఖరిలో మాత్రం మార్పు రాలేదు. ఆ నాడు ముస్లింలకు కలిగినటువంటి భయాలే నేడు దక్షిణ భారతీయులకి కలుగుతున్నాయి. అదే అధికారం చలాయించే తీరు నేటికీ కనిపిస్తోంది. అప్పుడు వాడిన 'భేదోపాయా'లే నేడూ వాడి, దక్షిణప్రాంతాల వారి మనస్సులలో అపనమ్మకపు బీజాలు నాటుతున్నారు. భాష, లిపి ఉద్యోగాలు అనే సమస్యలమీద వాదోపవాదాలు లేవదీస్తున్నారు.


శ్రీ కామరాజ్

కొన్ని చరిత్రాంశాలని మీకు గుర్తు చేస్తాను. ఈనాడు అలజడికి కారణాలు ఇవే అని నా అభిప్రాయం. 1950 లో కొత్త రాజ్యాంగం వచ్చింది. దాని ప్రకారం—

1. దేశాధికార భాష హిందీ అవుతుంది. లిపిగా దేవనాగరి, అంకెలు అంతర్జాతీయంగా వాడుకలో ఉన్నవి స్వీకరించాలి

2. కేంద్రం రాష్ట్రాలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేట్లయితే 26—1—1965 దాకా ఇంగ్లీషు, ఆ తర్వాత హిందీ వాడాలి.

అయితే, ఈ మార్పులకి కావలసిన సన్నాహాలు ఏవయినా ప్రభుత్వం చేసిందా ? 15 సంవత్సరాలలో జరిగిన కృషి ఏమిటి ? అసలు అందరికీ అర్థమయ్యే హిందీభాష అంటూ ఒకటి ఉందా ? మొదట్లోనే హిందీ బోధించని పాఠశాలలకి ప్రభుత్వ సహాయం లేదనే విధానం అమలుపరచి ఉంటే నేడు హిందీ రానివారి సంఖ్య చాలా తక్కువగా ఉండేదికదా ? ఇంత రభస జరిగిన తర్వాత ఇటువంటి విధానం అమలుపరచే అవకాశం చాలా తక్కువ.

ఈమధ్యనే ఒక మహారాష్ట్ర సభ్యుని హిందీ ఉపన్యాసం విన్నాను. నాకూ హిందీ వచ్చు కానీ, ఈ హిందీ మహాపండితుని ఉపన్యాసం నాకు అర్థం కాలేదు.

మహారాష్ట్ర భాషకీ హిందీకి లిపి ఒకటే అయినా భాషలు వేరు. మహారాష్ట్ర భాషకి మంచి సాహిత్యం ఉంది. హిందీ సంగతి చెప్పనక్కరలేదు.

భారతదేశపు మాజీ రాష్ట్రపతి మనుమలూ, మనుమరాళ్లూ హిందీ నేర్పని పాఠశాలలకి వెళ్లారు. నేడు ఎందరో మంత్రుల, ధనవంతుల

ORWO

ఆర్ వో
రోల్ ఫిల్మ్
కలర్ మరియు బ్లాక్ అండ్ వైట్

సులభమైనది : ఆర్ వో కలర్ ఫిల్మ్‌తో ఫొటోలు తీయడం బ్లాక్ అండ్ వైట్ వలె చాల సులభమైనది.

40 ఏండ్ల నుండి మీరు వాడుతూ వచ్చిన యీ ఫిల్మ్ ఇప్పుడు 'ఆర్ వో' అను కొత్త పేరుతో విక్రయింపబడుచున్నది.

55 ఏండ్ల అనుభవము గల వేబ్ ఫిల్మ్‌ఫాబ్రిక్ వుల్ ఫన్ వారు తయారుచేసినది.



VEB FILMFABRIK WOLFEN
German Democratic Republic

ఆర్ వో ఫిల్మ్స్ ఈస్టర్న్ యూనిట్
మద్రాసు-2 కలకత్తా-13

SCS/3/65

లోహియా, భావేల దొంగచాటు ప్రయత్నాలు!

పిల్లలు ఇంగ్లీషు స్కూళ్లకి వెడుతున్నారు. అంటే, కాంగ్రెసు అభిజాత్యవర్గాల పిల్లలకి హిందీవల్ల తక్కినవారి పిల్లలకి లభించని అవకాశాలు ఇంగ్లీషు విద్య ద్వారా లభించేట్లు చేస్తున్నారనేగా అర్థం?


హిందీవాదుల వత్తిడిమీద ప్రభుత్వంలో 'అనువాదకు' ల ఉద్యోగాలు ఎన్నో సృష్టించారు. ఇవన్నీ హిందీ రానివారి అందుబాటులో లేనివే కదా!

మరొక సంఘటన గమనించాలి, బాబూ రాజేంద్రప్రసాద్ బ్రతికి ఉన్నప్పుడు 26—1—50 నుంచి 26—1—1965 కాలంలో హిందీ అంకెలు వాడవచ్చుననే శాసనం అమలులోకి వచ్చింది.

ఇక మద్రాసులో జరిగిన హిందీ అల్లర్లకి వద్దాము. హిందీ దేవతకి పెద్ద పూజారి అనతగిన సేట్ గోవిందదాస్ కాని, బాబూ హరేకృష్ణ మెహతాబ్ గాని ఒకసారి మద్రాసు వెళ్లి 'తప్పుదారి తొక్కుతున్న' తమిళులని హిందీ నేర్చుకొనకుండా దానిని స్వీకరించమని చెప్పే ప్రయత్నం చేశారా? సేటుగారు హిందీ ప్రచారం కోసం దక్షిణదేశం ఎన్నిసార్లు పర్యటించారు?

రామమనోహర్ లోహియా, వినోబా భావేలు ఇంగ్లీషు రద్దుచేసి హిందీని దొంగతనంగా అమలులోకి తెచ్చే ప్రతిపాదనలు చేస్తున్నారు. ప్రాంతీయభాషల విషయంలో చిక్కులేనే లేదు. కేంద్రంలో అధికారభాషగా ఏది ఉండాలనే సమస్య. వినోబా హిందీ వారిమీద ఇంగ్లీషు, ఇంగ్లీషువారిమీద హిందీ రుద్దరాదంటారు. లోహియా ఇంగ్లీషుని రూపుమాపాలంటారు. భావే ప్రణాళిక స్వీకరిస్తే ఏమవుతుంది? కేంద్రం హిందీ ప్రాంతాలతో హిందీ వాడుతుంది. అంటే, నేడు కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్న హిందీ. ఇతర ఉద్యోగులంతా హిందీ నేర్చుకొనవలసివస్తుంది. లేదా హిందీ ప్రాంతాలతో వ్యవహరించేందుకు హిందీ జ్ఞానం కలవారిని పెట్టుకొనవలసి వస్తుంది. హిందీరాని ఒకపెద్ద అధికారి ఉన్నాడనుకోండి; అతను హిందీ వచ్చిన చిన్న గుమాస్తా మీద ఆధారపడవలసిందే కదా? ఇక రహస్యం అంటూవాడాగదు. ప్రతి ఇంగ్లీషు దస్తావేజుకీ హిందీ అనువాదం కావాలికదా? ఇవన్నీ హిందీని తీసుకు రావటానికి పన్నే కుతంత్రాలు.

మహాత్మాగాంధీ 'క్విట్ ఇండియా' ఉద్యమం ప్రారంభించినప్పుడు, శ్రీ జిన్నా ఆ ఉద్యమాన్ని నిజంగా ఎదిరించలేదనవచ్చు. అయితే, బ్రిటిషువారు భారతదేశం 'క్విట్' చేసేముందు రెండుగా భాగించిపెడితే చాలన్నారు. మహాత్మాగాంధీ, 'ముందు బ్రిటిషువారు వెళ్లిన తర్వాత మన సంగతి ఆలోచించుకోవచ్చు' న్నారు. శ్రీ జిన్నాకి ఇటువంటి విధానంమీద నమ్మకం కుదరలేదు. ఇకముందు రాబోయే నెలలలో నేటి భాషా సమస్య పరిణామాలు శ్రీ జిన్నా వైఖరి సరయినదో కాదో తెలుపగలవు.



శ్రీ శాస్త్రి

పోయిన నెల వర్కింగ్ కమిటీ, ముఖ్యమంత్రుల సమావేశాలు జరిగాయి. వాటిలో శ్రీ నెహ్రూ హామీలని శాసనాలుగా మార్చాలనే నిర్ణయం ఘనీభవించింది. కొందరు ముఖ్యమంత్రులు 'కోటా' పద్ధతి కావాలన్నారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు ప్రాంతీయ భాషలలో జరగాలనే ప్రతిపాదన కూడా బయటపడింది.

ఈ సమావేశాల ఫలితంగా, శ్రీ మొరార్జీదేశాయి హిందీ అధికార భాషగా వచ్చేందుకు ఒక గడువు పెట్టాలన్నారు. ఆ తర్వాత హిందీ తప్ప వేరే అధికార భాష ఉండటానికి వీలు లేదన్నారు. 'కోటా' పద్ధతి దేశ సమైక్యతని నాశనం చేస్తుందని శ్రీ మహావీర్‌త్యాగి అన్నారు. శ్రీ అశోక్‌సేన్ హిందీ—ఇతర ప్రాంతాల వారిలో ముప్పాతిక మంది అక్కర్లేదంటే ఇంగ్లీషు పోవచ్చుననే సూచన చేశారు—ఈ సూచన ప్రకారం గుజరాత్, మహారాష్ట్రలు కూడా హిందీ రాష్ట్రాలు కావు.

ఈ సూచనల తర్వాత మైసూరు పార్లమెంటు సభ్యులలో ఒకరయిన శ్రీ అజిత్‌ప్రసాద్ జయిన్ ఒక సంతకాల ఉద్యమం లేవదీశారు. ప్రధాన మంత్రిని తొందరపడి ఏదీ చెయ్యవద్దని 105 మంది సభ్యులు కోరారు.

జనసంఘ పక్షం సభ్యులు నల్లరంగు, కుంచెలతో ఢిల్లీలోని ఇంగ్లీషు గుర్తులమీదికి దండెత్తారు.


బెంగాల్, మద్రాసులలో తప్ప హిందీకి వ్యతిరేకం లేదనే కొత్త వాదం ఒకటి బయలుదేరింది. ఆంధ్ర, కేరళ, మైసూరు, అస్సాం రాష్ట్రాలలో ఇంగ్లీషు ఉండిపోవాలనే అభిప్రాయం ప్రజాబాహుళ్యానికి లేదని ఈవిధంగా వాదించేవారు చెప్పారు. వర్కింగ్‌కమిటీ తీర్మానం ప్రకారం శ్రీ నెహ్రూ, శ్రీ శాస్త్రి హామీలకి శాసన స్వరూపం ఇవ్వాలని మరికొందరు అంటున్నారు. శ్రీ కామరాజ్‌ని ఏదోవిధంగా అపకీర్తి పాలు చేయటమే హిందీ వర్గంవారి ఉద్దేశం. ఇటువంటి పరిస్థితులలో వట్టి హామీలు ఎలా సరిపోతాయి? ఎవరికి నమ్మకం కుదిరిస్తాయి?

నేను ఇందాక చెప్పిన ఉపాయమే ఇక్కడ వాడాలనే ప్రయత్నం హిందీ వర్గంవారు చేస్తున్నారు— దక్షిణ రాష్ట్రాలమధ్య విరోధాలు పెంచి హిందీని ప్రవేశ పెట్టటం. 'దక్షిణరాష్ట్రాల మధ్య విరోధాలు వచ్చి పెరుగుతాయా?' అని కొందరి సందేహం. 'ఇంతదాకా ఇక్కడి వారంతా కలిసి కట్టుగా నడుచుకుంటున్నారుకదా?' అంటారు.

శ్రీ కామరాజ్ సంగతి ఆయన విరోధులకి తెలియదు. అధికారం అనే అనుభవంవల్ల చెడిపోని కొద్ది మందిలో ఆయన ఒకరు. ఎప్పుడు కావలిస్తే అప్పుడు ఢిల్లీ వదిలి తన ఊరికి తిరిగి వెళ్లిపోయి మహారాజుగా బ్రతకగలడు.

—శ్రీకృష్ణ ★

In a man's world



J.K. Helene Curtis

Sole Distributors in India: SPENCER & CO. LTD. 153 Mount Rd., Madras 2 □ Spencers Building,
Forjett Street, Bombay 36 □ 70 Diamond Harbour Rd., Kidderpore, Calcutta 23 □ 19 A Alipore Rd., Delhi 1

మహేష్

వేల్పులకైనా పొరపాట్లు తప్పవు



కల్క్యవతారం

విష్ణువు

(గత సంచిక తరువాయి)

రామతాపన్యుపనిషత్

పరబ్రహ్మయే రాముడు పరబ్రహ్మ అశరీరుడైనప్పటికీ ఉపాసకుల సౌలభ్యము కొరకు రూప కల్పన చేయబడుచున్నది. రాముని వల్లనే జగత్తు ఉత్పత్తిని పొందుచున్నది. రామ పూజాక్రమం మంత్రం ఇందులో వివరింపబడినాయి. శ్రీరామ మంత్ర మహాత్మ్యం విశేషంగా వర్ణింపబడింది. కాశీనగరంలో సకల జీవులకు అవసానకాలమందు శివుడు తారక మంత్రమును ఉపదేశించును.

నృసింహతాపన్యుపనిషత్

నృసింహద్వాత్రింశాక్షరీ మంత్ర మహాత్మ్యం నృసింహ అనే పదముయొక్క అర్థం మొదలైనవి విపులంగా యిందులో వివరించబడినాయి

గోపాలతాపన్యుపనిషత్

కృష్ణతత్వము, కృష్ణుని బ్రహ్మచారిత్వము సప్తగోపాలపురీ వర్ణనము మొదలైనవి యిందులో వివరింపబడినాయి. ఈ ఉపనిషత్తువల్ల భమతాన్ని ప్రతిపాదిస్తున్నదని చాలామంది పండితుల అభిప్రాయం.

విష్ణుపురాణం

కృష్ణుడు నారదుని అహంకారమును పోగొట్టుట, ధృవచరిత్రము, విష్ణువుయొక్క అంశ వలన వేనుని బాహువుల నుండి పృథు మహారాజు జన్మించుట, కృష్ణుడు నరకాసురునితో యుద్ధము చేయుట మొదలైనవి యిందు వర్ణింపబడినవి.

బ్రహ్మవైవర్తపురాణం

గోలోక వర్ణనము, శివకేశవులకు భేదము లేకపోవుట, విష్ణువు మాలావతికి ఆయుర్వేదమును బోధించుట, తులసి వృత్తాంతము, సాలగ్రామ మహాత్మ్యం, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు గోలోకమున శ్రీకృష్ణుడు దర్శన మిచ్చుట, దేవకీ వసుదేవుల వివాహం, కారాగృహమందు దేవకీ తనయుడై శ్రీకృష్ణుడు జన్మించుట, నందుని యింట శ్రీకృష్ణుడు పెరుగుట పూతన, శకటాసురుడు మొదలైన రాక్షసులను శ్రీకృష్ణుడు సంహరించుట, కృష్ణుడు గోపాలకుల ఇండ్లలో వెన్నను దొంగిలించుట, కాళీయ గర్వభంగము, కృష్ణుడు బ్రహ్మయొక్క అహంకారమును నశింపజేయుట, కృష్ణుడు గోవర్ధన పర్వతమును ఎత్తి గోపాలకులను యింద్రుని ఆగ్రహము నుండి రక్షించుట, అంబరీషోపాఖ్యానము, రాసలీలలు, కంసవధ, రుక్మిణీ కల్యాణము, శిశుపాల వధ, బాణాసురుని శ్రీకృష్ణుడు జయించుట, శమంతకోపాఖ్యానం, శ్రీకృష్ణ నిర్యాణం మొదలైనవి యిందులో వర్ణించబడినవి.

శివపురాణం

విష్ణువు ఈశ్వరుని కమలములతో పూజించి మెప్పించుట, అర్జునునికి ఆంజనేయునకు కలిగిన వివాదములో విష్ణువు కూర్మరూపియై అర్జునుడు నిర్మించిన శరవారధిని కాపాడుట, పరశురాముడు ఈశ్వరుని మెప్పించి పాశుపతాస్త్రమును పొంది కార్తవీర్యార్జునాదులను సంహరించుట, కృష్ణుడు బాణాసురునితో యుద్ధము చేయుట మొదలైనవి యిందులో వర్ణింపబడినవి.

పద్మపురాణం

నారాయణుని నాభి కమలమునుండి బ్రహ్మ జన్మించుట, నారాయణుడు మధు కైటభులను రాక్షసులను శక్తి సహాయమున సంహరించుట వైష్ణవుల లక్షణము. అశ్వత్థ వృక్ష మహిమ, రామనామ మహాత్మ్యం, ఏకాదశీ మహాత్మ్యం, విష్ణువు గయాక్షేత్రమున వసించుట, బుద్ధావతార మెత్తి మహావిష్ణువు రాక్షసులను వేదబాహ్యులను చేయుట మొదలైనవి వర్ణింపబడినవి.

లింగపురాణం

నలీదేవి రాముని పరీక్ష చేయుట, భృగు మహర్షి త్రిమూర్తులను పరీక్షించి విష్ణువే సత్వగుణ ప్రధానుడని గ్రహించుట, శివభక్తుడైన నాగార్జునుడు, తండ్రియైన అర్జునుని చంపగా కృష్ణుడు శివునితో యుద్ధము చేయుట మొదలైనవి యిందులో వర్ణింపబడినవి.

దేవీభాగవతం

విష్ణువుయొక్క నాభి కమలమునుండి బ్రహ్మ జనించుట, విష్ణువు శక్తి సహాయముతో మధు కైటభులను రాక్షసులను సంహరించుట, విష్ణువు కూర్మరూపము ధరించి క్షీరసాగర మధనమునకు తోడ్పడుట, విష్ణువు మోహినీరూపము ధరించి రాక్షసులను వంచించి దేవతలకు అమృతమును ప్రసాదించుట, మొదలైనవి వర్ణింపబడినవి.

శ్రీమద్భాగవతం

విష్ణువుయొక్క అవతారములు, విష్ణువు గోరూపము ధరించి రాక్షసులవద్ద నున్న అమృతమును పానము చేయుట. గజేంద్రమోక్షం, కుచేలోపాఖ్యానం, శ్రీకృష్ణ చరిత్ర నిర్యాణ పర్యంతము యిందులో వర్ణింపబడినది. భాగవత కథ సుప్రసిద్ధం.

మత్స్యపురాణం


విష్ణువు బ్రహ్మకు వేదములను ప్రసాదించుట, బ్రహ్మవద్ద నుండి వేదములను సోమకాసురుడు అపహరించగా విష్ణువు మత్స్యావతార మెత్తి సోమకాసురుని సంహరించి వేదములను తిరిగి బ్రహ్మకు ప్రసాదించుట, ప్రళయకాలమందు విష్ణువు మత్స్యావతార మెత్తి సత్యవ్రతుని సంరక్షించుట మొదలైనవి వర్ణింపబడినవి

భూమి భారము కలిగినదై నీటియందు మునిగిపోవుచుండగా, విష్ణువు కూర్మరూపమున భూమిని ఉద్ధరించుట, క్షీరసాగర మధన సమయమున విష్ణువు కూర్మరూపమున మందరగిరిని యెత్తుట, క్షీరసాగరమందు ఉద్భవించిన లక్ష్మీదేవుని విష్ణువు పరిణయ మాడుట, విష్ణువు మోహినీ రూపమున రాక్షసులను వంచించి దేవతలకు అమృతమును పంచుట మొదలైనవి యిందులో వర్ణింపబడినవావి.

౩౨ వ పేజీ చూడండి

ఆ పుస్తకం...

పసుపులేటి సుధాకర్



లచ్చి ఆ పుస్తకానికి రెండు వైపుల వున్న రంగు రంగుల అట్టల్ని చింపివేసింది కసిగా ఎదురుగా కిరసనాయలుదీపం వుండుతోంది మగతగా. ఆ వుస్తకంలోని ఒక్కొక్క పేజి చించి అగ్నికి ఆహుతి చేస్తోంది. అన్ని పేజీలు పూర్తిగా మసిబుగ్గయి వాయి. ఇంతకుక్రితం చింపివేసిన అట్టల్ని ముక్కలు చేసి దీపంముందు పెట్టింది— ఎందుకో అవి అంటుకోలేదు సరిగ్గా. వాటిని చిన్న చిన్న ముక్కలుగా చింపి విసిరివేసింది అవి సరిగ్గా ఇంటి ముంగిట పడ్డాయి.

*　　*　　*

లచ్చికి పదిహేనేళ్ళు ఉంటాయి. లచ్చి పోలయ్యకు ఒక్కగా నొక్క కూతురు. పోలయ్య ఆ పల్లెలో గొర్రెలు, మేకలు మేపుతుంటాడు. లచ్చిఅంటే పోలయ్యకు ప్రాణం. మీనాల్లాంటి కళ్ళు, సంపెంగ పువ్వుల్లాంటి ముక్కు గట్రా లేకపోయినా, అమాయకమైన ముఖంలో ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ ఉంటుంది. ఉదయం ఏడు గంటలకే పోలయ్య గొర్రెల్ని, మేకల్ని మందకు తోలుకొని వెళ్ళింతర్వాత లచ్చితల్లి గౌరమ్మ వంటా అదీ చేసి తను కూలికి పోతుంది. సూర్యుడు నడి నెత్తికి రాకమునుపె తల్లికి, తండ్రికి భోజనం తీసుకొని బయలుదేరుతుంది. తర్వాత రాగానే తనతోటి అమ్మాయిల్తో ఏదో కబుర్లు చెప్పుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతుంది.

ఆరోజు, ఆ పల్లెలో చాల హడావిడిగా ఉంది. వూరి మధ్యభాగంలో ఇన్ని రోజులు చావిడిలావున్న ఇంటికి మామిడాకులు, రంగు కాగితాలు అవి కట్టారు రెండు జీపులు అక్కడ నిలబడి ఉన్నాయి. ఎవరెవరో సూటు బూటు వేసుకొన్న మనుషులు ఏదో ఇంగ్లీషులో మాట్లాడేస్తున్నారు ఎవరో తీగలా నాజూగ్గా ఉన్న ఓ అమ్మాయి చావిడిలోపల కరణంతో మాట్లాడుతోంది. తల్లికి, తండ్రికి భోజనం ఇచ్చి రాగానే లచ్చి చూసింది. ఏదో బోర్డు తెచ్చి కట్టారు, ఆ ఇంటిముందు. లచ్చి ప్రక్కనే ఉన్న రామితో 'రామి? ఏమిటే ఆ సంబరం? ఎవరు వాళ్ళు?' అని అడిగింది 'మరి, మనవూళ్ళో బడి పెడుతున్నారట. ఈరోజునుంచే మొదలుట. అదో సన్నగాఉండే అమ్మాయిగారే మేష్టరమ్మట' అంది రామి. కాస్సేపటికి కరణం, మునసబు, ఆ సూటు బూటు వేసుకొన్న ఆయన ఏవో మాట్లాడారు. ఆతర్వాత మేష్టరమ్మ పిల్లలందరికి మిఠాయిలు పంచింది. కాస్సేపు తర్వాత అందరు జీపుల్లో ఎక్కి, మేష్టరమ్మను అక్కడే వదలి వెళ్ళిపోయారు. లచ్చికి సాయంత్రం తల్లి తండ్రి వచ్చేవేళ అయింది. ఇంటికి వెళ్ళిపోయింది. ఇంట్లో నులకమంచంమీద కూర్చొంది. ఏదో ఆలోచిస్తోంది. తనెందుకు ఇలా ఉంది? ఆ పరితు లమ్మ ఎంత అందంగా చలాకీగా ఉంది. ఆమె ముఖం చూస్తుంటే ఎంత అందంగా ఉంది. మరి చదువుకున్న వాళ్ళందరు అలాగే ఉంటారేమో? మరి తను చదువు నేర్చుకొంటే? ఊహూ? మరి ఇంత వయస్సులో బడి కెళితే నవ్వరూ? ఇంతముందు తను ఎన్నో మార్లు చూసింది, కరణంగారి అమ్మాయి పట్నంలో చదువుతోంది. అప్పుడప్పుడు సెలవులకని వూరు వస్తుంటుంది. మరి ఎంత నాజుగ్గా అచ్చం పంతులమ్మలాగే ఉంది ఒకసారి ఆ అమ్మాయి తను ఆరోజు కసువు చెక్కను వెళ్ళితే అక్కడ చెట్టునీడన కూర్చొని ఏదో రంగు రంగుల అట్టవున్న ఓ లావుపాటి పుస్తకం చదువుతోంది. తను కూడా ఆ బొమ్మల పుస్తకం చూసింది. ఎంత బావుందని? చదువుతూ ఎంత బావుంటుందో? మరి తనకు చదువు రాదుగా? మరి వచ్చిఉంటే, అడిగితే ఆ అమ్మాయి ఇచ్చిఉండేదేమో? ఆలోచిస్తూవుంటే చిన్నగా కునుకు వచ్చేసింది లచ్చికి! గౌరమ్మ అప్పుడే వచ్చింది కూలినుంచి లచ్చి పడుకొని ఉండటం చూచి 'ఏమ్? లచ్చీ! ఏమిటూ నిద్ర సాయంత్ర పూట?' అంది. కళ్ళు నులుముకుంటూ లేచింది లచ్చి.

*　　*　　*

లచ్చికి చదువుకోవాలన్న ఆకాంక్ష ఎక్కువైపోయింది. కట్ట కడపటికి ఓ నిర్ణయానికి వచ్చింది. పంతులమ్మని అడగాలి, ఇంటికివెళ్ళి వీలుంటే తనకు సాయంత్రంపూట ఇంట్లో చదువు నేర్ప

మని మధ్యాహ్నం అమ్మకు, నాన్నకు భోజనం ఇచ్చి బయలుదేరింది పంతులమ్మ ఇంటికి. మునసబుగారి పెంకుటింట్లో ఉంది పంతులమ్మ. మళ్ళీ మధ్యాహ్నం రెండు గంటలకు బడి. అప్పుడే భోజనంచేసి పంతులమ్మ విజయలక్ష్మి తీరిగ్గా ఏదో నవల చదువుకొంటోంది. లచ్చి మెల్లగా వెళ్ళి తలుపు తట్టింది. ఎవరూ? అంటూ తలుపు తెరిచింది. లచ్చి తడబడుతూ 'అమ్మగారూ? నేను లచ్చిని' అంది. 'ఏమిటి? ఏమి కావాలి' అంది పంతులమ్మ. లచ్చి బెరుకు బెరుగ్గా 'అమ్మగారూ? నాకు చదువు నేర్చుకోవాలని ఉంది. ఇంత పెద్దదాన్ని బడికి వెళితే నవ్వరూ? మీకు తీరికుంటే సాయంత్రంపూట ఇంటిలో చెబుతారా?' అంది. విజయలక్ష్మి లచ్చి వైపు చూసి 'అయ్యోపాపం' అనుకొంది మనసులో. లచ్చి అమాయకమైన ముఖంలోకి చూస్తే ఆ పెద్ద పెద్ద కళ్ళలో ఎంతో విజ్ఞానం గోచరిస్తోంది. పాపం! ఎన్ని రోజులనుంచి ఉందో చదువుకోవాలని. ఈరోజు ధైర్యం చేసుకొని వచ్చిందేమో? అని అనుకొందివిజయలక్ష్మి. 'లచ్చీ! రోజూ సాయంత్రం పూట రా చదువు నేర్పిస్తాగాని' అంది లచ్చితో. లచ్చికి సంతోషమయింది. పరిగెత్తుకుంటూ ఇంటికి వెళ్ళింది. ఇంట్లో నులకమంచంమీద పడుకొని ఆలోచిస్తోంది. అమ్మకు నాన్నకు చెప్పాలి రాగానే అనుకొంటూ.

* * *

మర్నాడే లచ్చి చిన్న పలక తీసుకొని సాయంత్రం వెళ్ళింది పంతులమ్మ ఇంటికి. విజయలక్ష్మి మొట్ట మొదట ఓ నా మలు వ్రాయించింది. దిద్దించింది. లచ్చికి మహా సంతోషం అయింది, దిద్దుతుంటే. తను ఇప్పుడు చదువుకొంటోంది. తను పంతులమ్మలా చక్కని పుస్తకాలు చదువుకోవచ్చు తను కరణంగారి కూతురులా స్వచ్ఛంగా మాట్లాడవచ్చు. ఆరోజునుంచి శ్రద్ధగా చదువు నేర్చుకోసాగింది. చిన్న చిన్న పదాలతో చదవడం నేర్చుకొని లచ్చి వాక్యాలు కూడా చదవడం నేర్చుకొంది. కొన్ని కొన్ని పదాలు లచ్చికి అర్థం అయ్యేవికావు. కాని విజయలక్ష్మి విసుక్కోకుండా శ్రద్ధగా అర్థాలు చెప్పేది. లచ్చి ఇప్పుడు చిన్న చిన్న బాలల కథల పుస్తకాలు కూడా చదవగలదు. విజయలక్ష్మి తరచు ఇస్తుండేది లచ్చికి చిన్న చిన్న పుస్తకాలు చదవడానికి. లచ్చి తీరిగ్గా రాత్రిపూట కిరసనాయలు బుడ్డి దీపంముందు కూర్చొని చదివేది.

* * *

మామూలు ప్రకారం సాయంత్రం వెళ్ళింది లచ్చి పంతులమ్మ ఇంటికి. వెళ్లేసరికి మేష్టరమ్మ సామాన్లన్ని సర్దుకొంటోంది. ఎక్కడికైన వెళుతోందేమో ఇదివరకు దశరా సెలవులకు వెళ్ళినట్టుగా అనుకొంది లచ్చి. 'అమ్మగారూ? ఎన్ని రోజులండి సెలవులు? మళ్ళీ ఎప్పుడొస్తారు?' అని అడిగింది లచ్చి. విజయలక్ష్మి దండెంమీది చీరను మడత బెట్టుకుంటూ, 'లేదే లచ్చి! బదిలీ అయింది. రేపు ఉదయం వెళ్ళాలి. రేపు వేరే క్రొత్త మేష్టరు వస్తారు' అంది. లచ్చికి నోట మాట రాలేదు. మేష్టరమ్మ నిజంగా వెళ్ళిపోతోందా? తనకు నిజంగా నమ్మకంలేదు. 'నిజంగానేనా అమ్మగారూ?' అంది సందేహ నివృత్తికి. 'ఔనే లచ్చి? వెళ్ళాలి బదిలీ ఆర్డర్లు వచ్చాయిగా' అంది విజయలక్ష్మి. పంతులమ్మ వెళ్ళిపోతోంది అంటే లచ్చి మనస్సదోలా అయిపోయింది. తను ఇంక చదువు నేర్చుకోలేదు. అసలుకు ఈ పంతులమ్మ కాబట్టి తనకు ప్రత్యేకంగా సాయంత్రంపూట చదువు నేర్పుతోంది. మరి ఇక వచ్చే ఆమె ఏలాంటిదో—ఊహూ! ఇక రాబోయ్యేది మేష్టరట. తన ఇంట్లో ఒప్పుకుంటారా? మేష్టరు దగ్గర చదువు కొనేందుకు? ఆలోచింపసాగింది. లచ్చి కళ్ళలో నీళ్ళు చూచి విజయలక్ష్మి కళ్ళు కూడా చెమర్చాయి. లచ్చికి తనపైగల ఆవ్యాజానురాగం చూచి 'లచ్చీ! నేను వెళుతున్నానని బాధ పడకు. నీ చదువును నీవు వృద్ధి చేసుకోవాలి. శ్రద్ధగా రోజు చదువుకుంటే ఇక ఏ పంతులమ్మ సహాయమువద్దు. ఎప్పుడైనా బస్తీకొస్తే మా ఇంటికిరా? ఏం మరచిపోకు' అంది విజయలక్ష్మి. ఆరోజు లచ్చి పంతులమ్మకు సామాన్లు అవీ సర్దడంలో సాయపడింది. మర్నాడు ఉదయం విజయలక్ష్మి వూరెళ్లిపోయింది. వెళ్లేప్పుడు వూర్లో అందరు కన్నీటితో వీడ్కోలు ఇచ్చారు. బండి కదలగానే లచ్చి దుఃఖం నిలువలేక బావురుమంది. ఆరోజు తర్వాత ఓ నెలకుగాని లచ్చి మామూలు మనిషి కాలేదు.

* * *

కాలప్రవాహంలో రెండేళ్ళు కొట్టుకపోయాయి. లచ్చికి పెళ్ళయింది. లచ్చి భర్త రాజయ్య లచ్చికి స్వయాన మేనమామ. రాజయ్యకు లచ్చి అంటే ప్రాణం రాజయ్యకు తండ్రీ తల్లి ఎవరులేరు. ఉన్నది ఒక్క అక్క గౌరమ్మ మాత్రమే. చిన్నప్పటినుండి కష్టపడి ఓ మూడెకరాల మాగాణి నాలుగెకరాల చేను సంపాదించాడు. అక్క కూతురు లచ్చిని మనువాడితను కీలపట్లలో క్రొత్త సంసారం పెట్టాడు. రాజయ్య నల్లగా, లావుగా ఎత్తుగా ఉంటాడు. కష్టపడి కండలు తేరిన శరీరం. మనిషి కాస్త మోటుగా ఉండినా హృదయం మాత్రం నవనీతం. రాజయ్య ఏమి చదువుకోలేదు. కాని రాజయ్య చదువుకున్నవాళ్ళంటే చాల గౌరవిస్తాడు. పెళ్ళయిన క్రొత్తలో లచ్చి తనకు మేష్టరమ్మ ఇచ్చిన పుస్తకాల్ని అప్పుడప్పుడు చదువుతుంటే రాజయ్య తెగ మురిసిపోయేవాడు. తనకు చదువు రాకపోయినా తన భార్యకు వచ్చని. కీలపట్లకు దగ్గరగావున్న బస్తి పలమనేరు. ఓ నాలుగు మైళ్ళుంటుంది. రాజయ్య ఏదైనా పనిమీద పలమనేరు వెళ్ళినప్పుడల్లా తన భార్యకు చదవడం ఇష్టం అని ఏ వార పత్రికో, మాసపత్రికో తీసుకెళ్లి ఇచ్చేవాడు. ఆరోజు నిజంగా లచ్చికి పండుగ రోజే. త్వర త్వరగా పనులన్నీ ముగించుకొని రాత్రి దీపంముందు కూర్చొని చదివేది. రాజయ్యకు తను చదివిన కథలేవైనా చెప్తుండేది. ఆ సంవత్సరం పంటలు బాగా పండాయి. ధాన్యం మంచి ధరకు అమ్మాడు రాజయ్య. తనకు, లచ్చికి బట్టలు కొనాలని పలమనేరుకు బయలుదేరాడు. వెళుతూ లచ్చిని అడిగాడు 'లచ్చీ! పలమనేరు వెళుతున్నా? నీకేమైనా కావాలా?' లచ్చికి ఎన్నాళ్ళనుండో ఉంది. తను తల్లిగారింట్లో ఉన్నప్పుడు మునసబుగారి కూతురు, కరణంగారి కూతురు మొదలైనవారు చదువుతుండే ఆ రంగు రంగుల అట్టలున్న పుస్తకాలు చదవాలని. లచ్చి రాజయ్యతో 'ఏదైనా మంచి పుస్తకం ఒకటి తీసుకురా మామా మరి తప్పకుండా తీసుకురావాలి' అంది. రాజయ్య సరేనని వెళ్ళిపోయాడు.

* * *

రాజయ్య లచ్చికి, తనకు బట్టలు తీసుకొని బయలుదేరాడు. తీరా బస్టాండుకు బయలుదేరే సరికి లచ్చి చెప్పిన పుస్తకం సంగతి జ్ఞాపకం వచ్చింది. లచ్చి 'మంచి పుస్తకం' తీసుక రమ్మంది. అసలు తనకేం చదువా? చట్టుబండలా? ఏది మంచి పుస్తకమో తెలుసుకొనేందుకు! ఏమైనా మంచి పుస్తకం తీసుకెళ్ళాలి. మరి పుస్తకాలషాపు ఆయన్నే అడుగుతే పోదో, మంచి పుస్తకం చూసి ఇవ్వడూ? అనుకొని పుస్తకాల షాపు కెళ్ళాడు. షాపతనితో రాజయ్య 'ఏదైనా మంచి పుస్తకం ఒకటి ఇవ్వండి' అని అడిగాడు. ఆ షాపులో రంగు రంగుల అట్టలున్న పెద్ద, చిన్న అన్నీ పుస్తకాలు అందంగా పేర్చబడి ఉన్నాయి. షాపతను రాజయ్యకు ఒక లావుపాటి పుస్తకాన్నిచ్చి 'ఇది చాల మంచి పుస్తకమండి— చాల మంచినవల వెల నాలుగున్నర రూపాయలు' అన్నాడు. అట్టమీద చక్కటి బొమ్మ ఉంది. లోపల కూడ ఏవేవో బొమ్మలున్నాయి. సరేనని రాజయ్య నాలుగున్నర రూపాయలు చెల్లించి పుస్తకం తీసుకొని బయలుదేరాడు కీలపట్లకు.

* * *

రాజయ్య ఇంటికి రాగానే లచ్చి చేతులోవున్న సంచి తీసుకొని పుస్తకం తెచ్చాడో లేదో చూసింది. పుస్తకం చూడగానే చాల సంతోషమయింది అదీగాక తన కెన్నాళ్ళనుంచో ఇష్టమైన మబ్బు రంగుచీర, నెమలిరంగు రవికగుడ్డ తీసుకొచ్చినందుకు చాల ఆనందించింది. పుస్తకం గబగబ త్రిప్పిచూసింది లోపల రక రకాలైన బొమ్మలు చూడగానే ఇంకా సంతోషమయింది. ఇదివరకెప్పుడు తనిలాంటి పుస్తకం చదువలేదు. త్వర త్వరగా ఇంట్లో పనులు ముగించి రాత్రికి చదవాలనుకొంది. అనుకొన్నట్లే అన్ని పనులు ముగించి ఎద్దులగాట్లో కసువేసేసి తీరిగ్గా దీపంముందు కూర్చొంది. రాజయ్య మంచంమీద పడుకొని లచ్చివైపు చూస్తున్నాడు. లచ్చి పుస్తకాన్ని తీసుకొని చదవసాగింది. అది ఒక ప్రణయ కథ. అందులో శేఖర్, లత కథా నాయకీ నాయకులు. అందులో రచయిత శేఖర్ను చాల అందంగా ఉంటాడని వర్ణించాడు. పొడుగ్గా, నిమ్మపండు రంగుతో నొక్కుల నొక్కుల జుట్టు, కోటేరులాంటి ముక్కు ఎప్పుడూ చలాకీగా ఉంటాడని వర్ణించాడు. లత అచ్చం అప్సరసలా ఉంటుందని సంపంగిలాంటి నాశిక, ఆ విశాల నేత్రాలు, గులాబీల్లాంటి బుగ్గలు ఎంతో అందంగా ఉంటుందని రచయిత వర్ణించాడు. కథలో ఎన్నో ప్రణయ సన్నివేశాలు ఉన్నాయి. చదువుతున్నవారిని మైమరపించేలా ఉన్నాయి. అందుకు తగ్గట్టుగా బొమ్మలు ఉన్నాయి. లచ్చికి ఆ పుస్తకం చదువుతుంటే ఏదో లోకాలలో తేలిపోయినట్లయింది. ఇంకా ఆసక్తిగా చదవసాగింది. ఉన్నట్లుండి తన భర్త రాజయ్య, తన సంసారం ఆమె కళ్ళముందు మెదిలాయి, లచ్చికి. ఉన్నట్లుండి ఉలిక్కిపడ్డట్లయింది. శేఖరుకు తన భర్తకు ఎక్కడి పోలిక? అందంగా నిమ్మపండు రంగుతో,

నొక్కుల నొక్కుల జుట్టుతో, చలాకీగాఉండే శేఖర్ ఎక్కడ? నల్లటి మొద్దు శరీరం, ఒక్క అక్షరం ముక్కరాని, నొక్కుల నొక్కుల జుట్టు లేక పోయె కనీసం క్రాపు అయినా లేక గంటు వేసుకొనే తన భర్త రాజయ్య ఎక్కడ? నక్కెక్కడ నాగ లోక మెక్కడ? అసలుకు ఎప్పుడైనా శేఖర్ లతతో మాట్లాడినట్టు ఇష్టంగా తనతో రాజయ్య మాట్లా డాడా? తనకేమి? తను ఎంతో అందంగా ఉంది. ఈ పల్లెలో ఈ రాజయ్య పెళ్ళాం అయిందికాని అదే పట్నంలో ఉంటే ఎంత అందంగా అలంకరణ చేసుకొంటే ఆ లతకు తనకు భేదముంటుందా? తన తల్లి కూడా అప్పుడప్పుడు అంటుండేది 'లచ్చి? నీవు నిజంగా ఏదో కర్మ చాలక నా కడుపున పుట్టావు. నీవు ఏ మహారాజుల ఇంట్లోనో పుట్టాల్సింది నీ అందానికి' అని ఔను తను పలమనేరుకు ఎప్పు డైనా సినిమాకు వెళ్ళినప్పుడు వూర్లోవున్న అబ్బా యిలు తనను ఎంత ఇదిగా చూసేవారు? తన అందంచూసి కాబోలు వాళ్ళు అలా చూసి ఉంటారు. ఉన్నట్లుండి మళ్ళీ రాజయ్యమీద పోయింది ఆలో చన. రాజయ్యమీద విపరీతమైన ద్వేషం పుట్టింది. ఎంతో జుగుప్స కలిగింది అతనంటే. రాజయ్య తనకు ఏవిధంగానైనా భర్తగా సరిపోడు. ఒక

ఆపస్తకం

అందమా? చదువా? ఒక ఇష్టమైన మాట మాట్లాడుతాడా? నిజంగా రాజయ్య తన భర్తగా అనర్హుడు. ఈ ఆలోచనలతో ఇక చదవలేకపోయింది. దీపంముందునుంచి లేచి రాజయ్య మంచంవైపు చూసింది. నిద్ర పోతున్నాడు. దీపం ఆర్పి తన మంచంమీద పడుకొంది. పడుకొన్నా ఇదే ఆలోచ నలే! మనస్సంతా కలతబారిపోయింది. రాజయ్య తన భర్తగా సరిపోడు అని తన అంతరాత్మ అరచి చెబుతున్నట్లుంది. శేఖర్‌లాంటి భర్త కావాలి. ఈ ఆలోచనలతో నిద్ర రాలేదు పైగా దుఃఖం వస్తోంది. తలగడంతా కన్నీటితో తడిచిపోయింది. ఏ తెల్లవారిజామునో నిద్ర పట్టింది. అందులో కూడా కలలే. తను శేఖర్ కారులో షికారు వెడు తున్నట్లు, దోవలో రాజయ్య తన నల్లటి మొరటు శరీరంతో తమ వైపు చూస్తుంటే తను అసహ్యంగా అతనివైపు చూసి కారు ఇంకా స్పీడుగా వదలినట్లు. ఇంకా ఏవేవో కలలు వచ్చాయి.

* * *

ఉదయం లచ్చి లేచేసరికి బారెడు ప్రొద్దు ఎక్కిపోయింది. రాజయ్య ఎప్పుడో పొలానికి వెళ్ళి పోయాడు. పన్నెండు గంటల కంతా తను భోజనం తీసుకొని వెళ్ళాలి పొలానికి. అయిష్టంగానే వంట ప్రారంభించింది. నిన్నటిరోజు రాజయ్య సరదాగా గారెలు చెయ్యమంటే, రేపు చేద్దామంది. కాని ఈరోజు చెయ్యడానికి ఇష్టంలేదు. రాజయ్యను తల్చుకొంటే తన గుండెల్లో ఎవరో బలమైన కమ్మీతో పొడిచినట్లవుతుంది. రాజయ్య తనకు తగిన భర్త కాదు అని వేయి కంఠాలు తన చుట్టూ మూగి అరుస్తున్నట్లు అవుతుంది. అన్నం, చారు చేసి, గంపలో పెట్టుకొని పొలానికి బయలు దేరింది. చెట్టుక్రింద గంప పెట్టి కునుకు తీయ సాగింది. ఇంతక్రితం వెళ్ళినప్పుడల్లా రాజయ్య ఏంపని చేస్తున్నా దాన్ని అప్పటికి విడిచిపెట్టేట్లు చేసి భోజనానికి రమ్మనేది. ప్రక్కలో కూర్చుని కంచంలో అన్నం కూరలు వడ్డించి కబుర్లు చెబుతూ కొసరి కొసరి తినిపించేది. కాని, ఆరోజు అసలు మొఖం చూడ్డానికే ఇష్టంలేదు. రాజయ్యే కాస్సేపటికి వచ్చి అన్నం తిని ఏదో పని ఎక్కువ ఉన్నందువల్ల వెళ్ళిపోయాడు మళ్ళీ పొలంలోకి. లచ్చి భర్తతో ఒకమాటైనా మాట్లాడకుండ గంప తీసుకొని ఇంటికి వెళ్ళిపోయింది. ఇంటి కొస్తే మరే ఆలోచన లేదు. ఒకటే ఆలోచన, రాజయ్య తనకు తగిన భర్త కాదు అనే. ఆలోచించి ఆలోచించి విపరీతమైన తలనొప్పి వచ్చే సింది లచ్చికి. తల పగిలిపోయేలా ఉంది. వేయి సమ్మెటలతో ఒక్కసారి తలమీద మోదినట్లుంది. మంచంమీద పడుకునేసింది. మగతగా నిద్ర కూడా పట్టేసింది. సాయంకాలం అయింది. ఎవరివో చేతులు తన నొసటిమీద పడినట్లయింది లచ్చికి. కళ్ళు తెరచి చూస్తే రాజయ్య. పురుగును విది లించినట్లు విదిల్చేసింది రాజయ్య చేతిని. రాజయ్య 'లచ్చీ! అరే వేడిగా ఉందే? జ్వరం వచ్చిందా ?' అని అడిగాడు. లచ్చి ఏమి సమాధానం చెప్ప లేదు. నిద్రనుండి మేల్కొనగానే తలనొప్పి మరీ ఎక్కువైంది. తలనొప్పికి తాళలేక అమ్మా! అబ్బా! అంటూ మూలగసాగింది. ఇక రాజయ్య ఉండలేకపోయాడు. లచ్చి పడుతున్న బాధ చూసి అతని హృదయం కత్తులతో కోస్తున్నట్లుంది. వెంటనే రామారావుగారి దగ్గరకు పరుగెత్తాడు. రామారావు ఆ వూర్లో ఉన్న రూరల్ డిస్పెన్స రీలో డాక్టరు. యువకుడు. వైద్యవిద్య నభ్యసించి అమాయక గ్రామీణులకు సేవ చేయాలని పల్లె ప్రాంతానికే వేయించుకొన్నాడు. రాజయ్య, రామా రావును వెంటబెట్టుకొచ్చాడు. రామారావు లచ్చిని పరీక్షించి తన మెడికల్ బ్యాగ్ నుండి మూడు మాత్రలిచ్చి ఇప్పు డొకటి రేపు తెల్లవారి, మళ్ళీ మధ్యాహ్నానికి రెండు అని చెప్పాడు. జావ మాత్రం ఇవ్వమన్నాడు. రాజయ్యకు మనస్సు తృప్తి కాలేదు. 'అయ్యగారూ ? ఈ జ్వరం ఇక్కడే తగ్గుతుందంటారా ? లేక పలమనేరు తీసుకెళ దామా ? చెప్పండి ? అది మూలుగుతుంటే నాకు చాలా భయంగా ఉంది' అన్నాడు రాజయ్య. రామారావు నవ్వుతూ 'రాజయ్యా ? ఏం ప్రేమాయ్ నీకు పెళ్ళాంమీద ? ఏదో కాస్త వొళ్ళు అలా వెచ్చ బడేసరికి పలమనేరు తీసుకెళుతానా, వేలూరు తీసుకెళుతునా అంటున్నావ్ ? నిజంగా నీ భార్య



యజమాని : ఏమయ్యా! నిన్న పోసిన పాలు చేదుగా ఉన్నవేమిటి ?
పాలాయన : ఒకవేళ ఆవు వేపాకు ఏమైనా తినిందేమో! అందుకని చేదుగా ఉండొచ్చును.

లచ్చి అదృష్టవంతురాలు. నీలాంటి ప్రేమ గల భర్త దొరికినందుకు. మరి, ఏం భయపడవద్దు. తెల్లవారికి హాస్పిటలుకు రా, మందు ఇస్తాను. అన్నట్లు, రేపంతా జావే ఇవ్వు, అన్నం అదీ తిన నివ్వకు, సరేనా ?' అంటూ 'ఇక వెళతాను' అంటూ లేచాడు. రాజయ్య మెడికల్ బ్యాగ్ తీసుకొని రామారావును ఇంట్లో విడచి రావడానికి డాక్టరుతో వెళ్లాడు.

లచ్చి డాక్టరు చెప్పిన మాటలన్నీ విన్నది. ఒక్కసారి తెలివొచ్చినట్లయింది. మళ్ళీ గతాన్నంతా ఆలోచించసాగింది. ఔను డాక్టరుగారు చెప్పినట్లు తన భర్త ఎంత మంచివాడు. తన భర్త తనను ఎంత ఆప్యాయంగా చూసుకొనేవాడో జ్ఞాపకం వచ్చింది. తను ఏమి అడిగినా నిమిషాలమీద తెచ్చి ఇచ్చేవాడే తన భర్త — అసలుకు ఈరోజు ఏదో ఒళ్ళు అలా వెచ్చబడేసరికి ఎంత ఆదుర్దా పడిపోయాడు. అలాంటి తన భర్తనా తను ద్వేషించింది. అలాంటి తన భర్తనా తను అసహ్యించుకొన్నది. తల్చుకొంటే తనకే సిగ్గవుతోంది. తన భర్త నిజంగా దేవుడులాంటివాడు. అంతలో రాజయ్య వచ్చాడు. వచ్చి 'ఎలా వుంది లచ్చి' అని అడిగాడు. లచ్చి గొంతు గాద్గదికం అయింది. ఏమి జవాబు చెప్పలేకపోయింది. రాజయ్య జావ కాచడానికి పొయ్యి రగిలించసాగాడు. పొగ కండ్లలో పోయి కళ్ళలో నీళ్ళు కారుతున్నాయి రాజయ్యకు. అప్పుడప్పుడు తనవైపు చూస్తున్నాడు. జావ కాచి లచ్చికి ఇచ్చాడు. ఏమి అనకుండా తాగేసింది. రాజయ్య లచ్చి మంచంప్రక్కన కూర్చున్నాడు. రాజయ్య అన్నం తినలేదు. అసలుకు భోజనం వండుకోలేదు.

లచ్చి 'మావా ! ఇంకా అన్నం చేసుకోలేదా?' అంది. రాజయ్య బాధగా 'లచ్చి ! నీవిలా జ్వరంతో తలనొప్పితో బాధపడుతుంటే నా కెలా సహిస్తుంది అన్నం ?' అన్నాడు. లచ్చి బలవంతంమీద అన్నం చేసుకొని గుజ్జు కలుపుకొని భోజనంచేసి మళ్ళీ లచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

'లచ్చి ! నీకు జ్వరం బాగ కాగానే ఓ నాలుగైదు రోజులు పొలం దగ్గర కొచ్చి ఒళ్ళు అలుసుకోకు. అన్నీ నేనే చేస్తాను సరేనా ?' అన్నాడు రాజయ్య. రాజయ్య మాటలు విని లచ్చి పొంగిపోయింది. ప్రాణానికి ప్రాణమిచ్చే భర్త తనకున్నాడు. లచ్చికి హృదయమంతా రాజయ్యమీద అనురాగంతో నిండిపోయింది. లచ్చి రాజయ్యతో కాస్సేపటికి 'మావా తలనొప్పి తగ్గిందిలే నీవు పడుకో' అంది. రాజయ్య తన మంచంమీద పడుకొన్నాడు. కాస్సేపటికి రాజయ్య నిద్రలో కూడా లచ్చికి త్వరగా జ్వరం బాగ్గ కావాలని కోరుకుంటున్నాడేమో. మెల్లగా లేచింది లచ్చి. పుస్తకాన్ని చింపి ఒక్కొక్క పేజీ కాల్చివేసింది. అన్ని పేజీలు కాల్చి, అట్టలు కాలకుండా ఉంటే చింపి ఇంటి ముంగిట పారవేసింది.

తెల్లవారి రాజయ్య లేచి బయట పడిఉన్న అట్ట ముక్కలు, కాగితాల బూడిద చూశాడు. ఏవీ అర్థంకాలేదు. లచ్చి మంచంవైపు చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతోంది. చూసి తృప్తిగా నిట్టూర్చాడు. పొయ్యి రాజెయ్యసాగాడు త్వరత్వరగా, నిద్రనుండి లేవగానే లచ్చికి జావకాచి ఇవ్వాలని. ★

19—8—65.

19-3-1965 శుక్రవారం మొదలు 25-3-1965 గురువారం వరకు.

మీ	మే	వృ	మి
ర బు	గు	రా	
శ శు	వారఫలం		
	మహేష్		కు
	కే		చం

మేషం :

(అశ్విని, భరణి, కృత్తిక 1 పా.)

ఈ వారం అన్ని వ్యవహారాల్లోను చాలా జాగ్రత్తగా వ్యవహరించడం అవసరం. వృత్తి వ్యాపారాల్లో మీకు యింతవరకు అనుకూలంగా ఉన్న వారే మిమ్మల్ని వ్యతిరేకించడం వలన మీవారెవరో పైవారెవరో తెలియని పరిస్థితి యేర్పడుతుంది ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలివేయడం మంచిది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రావచ్చును. ఉద్యోగంలో మీరు యిదివరకు చేసిన నిర్ణయాలవల్ల మానసికాందోళన కలుగుతుంది. మీరు యెంత జాగ్రత్తగా ఉన్నా కొన్ని వ్యవహారాల్లో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా యిబ్బంది కలుగుతుంది. అనారోగ్య సూచనలు ఉన్నాయి.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరుతాయి ఎవరితోను వాదప్రతివాదాలకు దిగడం మంచిదికాదు. విలాస వస్తువులు కొంటారు.

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి మృగ 1, 2 పా)

గ్రహబలం అనుకూలంగా ఉంది. దీర్ఘకాలానికి ఫలితాన్ని యిచ్చే భారీ వ్యవహారాల్లో అనుకూలమైన సంఘటనలు జరుగుతాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలకంటే మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో మీరు యిదివరకు యెంత ప్రయత్నం చేసినా నెరవేరని వ్యవహారాలు కూడా యిప్పుడు సానుకూలం పడతాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి బాగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాల సంచలనం అధికం కావచ్చును. కాని దాని వల్ల మీకార్యక్రమాలకు భంగం కలగదు. వారాంతంలో మాత్రం కొంచెం జాగ్రత్తగా ఉండడం అవసరం.

స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉన్నా కొంచెం బలహీనత కన్పిస్తుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు. పుణ్య కార్యాలు చేస్తారు.

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆరుద్ర, పునర్వసు, 1, 2, 3 పా)

వృత్తి వ్యాపారాల్లో ఆదాయం కంటే హడావుడి అధికంగా ఉంటుంది మీరు ప్రయత్నించిన ప్రతి పనీ నెరవేరుతున్నట్లే కన్పిస్తుంది కాని వారాంతానికి మాత్రం మీరు సాధించిన అభివృద్ధి యేమీ ఉండకపోవచ్చును. వృత్తిలో మీయెదుట స్తోత్రం చేస్తూ, చాటున ద్రోహం తలపెట్టే వ్యక్తులతో వ్యవహరించ వలసి వస్తుంది. రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన కొన్ని ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా పడతాయి. ఉద్యోగంలో వారం మధ్యలో ముఖ్యమైన కాగితాలు గాని వస్తువులుగాని పోయే ప్రమాదం ఉంది. వారం ప్రారంభంలో చేసే ప్రయాణాలు లాభించవచ్చును.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉంటాయి. సాంఘిక వ్యవహారాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది.

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష.)

వృత్తివ్యాపారాల్లో మీకార్యక్రమాలు సామాన్యంగా ఉన్నా, కొన్ని వ్యవహారాల్లో యిదివరకు యేర్పడిన అనిశ్చిత పరిస్థితి తొలగి పోవడం వలన యీ వారం సంతృప్తి కరంగానే ఉంటుంది. అధికారుల వలన జరుగవలసిన వ్యవహారాల్లో మీకు కొంత మంది మిత్రుల సహకారం లభించడం వలన అనుకూలతను పొందగలరు. వృత్తిలో నూతననావకాశాలు లభించక పోయినా ప్రస్తుతం ఉన్న వ్యవహారాల్లో కొంచెం ఆదాయం పెరుగుతుంది ఆర్థిక వ్యవహారాలు మాత్రం యింకా అంత బాగా ఉండక పోవచ్చును. సాంఘిక కార్యక్రమాల్లో మీకు ఉపయోగించగల పరిచయాలు యేర్పడతాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. పొటి వారితో మాట పట్టింపులు రావచ్చును. బంధువులకు సహాయం చేస్తారు.

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఈ వారం చిత్రంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో మీస్వంత వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి గాని మీరు యితరుల మొగమాటాలకు లొంగి పోవడం వలన మీకు అంతగా సంబంధం లేని వ్యవహారాల్లో శ్రమ పొందవలసి వస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలల్లో మీశ్రమకు తగిన ప్రతిఫలం లభించక పోవచ్చును. వృత్తిలో మీరు యిదివరకు చేసిన ప్రయత్నాలు యిప్పుడు ఫలిస్తాయి. ఉద్యోగంలో మార్పులు కోసం ప్రయత్నం చేయడానికి యిది సమయం కాదు. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కంట్రాక్టర్లకు, న్యాయవాదులకు యోగవంతమైన సమయం.

స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. సంతానానికి మాత్రం కించిదనారోగ్యం చేయవచ్చును.

ఈవారం ధరలు

ఈవారం ధరలు:— అపరాల ధరలు కొంచెం పెరిగే సూచనలు ఉన్నాయి. పసుపు ధర నిలకడగా ఉంటుంది. బెల్లం ధర క్రమంగా పెరగవచ్చును. నూనె నువ్వుల ధరలు మొదట పెరిగి తరువాత తగ్గుముఖం పడతాయి. బట్టల ధరలు కొంచెం పెరుగుతాయి.

కన్య :

(ఉత్తర 2, 3, 4 పా, హస్త, చిత్త 1 2 పా)

వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాల వల్ల వెంటనే మీకు విశేషమైన ప్రయోజనం లేక పోయినా భవిష్యత్తులో తగిన ప్రతిఫలాన్ని పొందగలరు. మీకు తెలియకుండానే కొంతమంది మిత్రులు మీకు లాభించగల వ్యవహారాల్లో కృషి చేస్తారు. వృత్తి రీత్యా చేసే ప్రయాణాలు కొంత శ్రమ మీద ఫలించవచ్చును. ఆర్థిక వ్యవహారాలు బాగానే ఉన్నా రావలసిన డబ్బు మీద ఆధారపడి భారీ వ్యవహారాలకు పూనుకోవడం వలన యిబ్బంది కలుగుతుంది. ఉద్యోగంలో మీపరిస్థితి బాగానే ఉంటుంది. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. హస్త నక్షత్ర జాతకులకు వారాంతంలో చాలా బాగుంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం యిదివరకటి కంటే బాగా ఉంటుంది. అలంకార వస్తువులు కొంటారు. సంఘ సేవికలకు అనుకూలమైన సమయం.

తుల :

(చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ, 1,2,3 పా)

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగానే ఉన్నా, కార్యసాధన కోసం మీకు అంతగా యిష్టం కాని వ్యక్తులతో సన్నిహితంగా ప్రవర్తించ వలసిన పరిస్థితి యేర్పడడం వలన యీ వారం అంత సంతృప్తికరంగా ఉండదు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల కంటే మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. వృత్తిలో మీకంటె పెద్దలు కూడా మీ అభిప్రాయాలను గౌరవిస్తారు. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొంద గలరు. కోర్టు వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్తడం వలన ఆందోళన కలుగుతుంది దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

స్త్రీలకు—కుటుంబకార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. అధిక వ్యయం జరుగుతుంది.

వృశ్చికం :

(విశాఖ 4—వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ)

వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో అనవసరమైన వ్యయ ప్రయాసలకు గురికావడం వలన తరువాత అనుకూలంగా ఉన్నా, యీ వారం మీరు సాధించినది యేమీ ఉండక పోవచ్చును,

వారఫలం

దీర్ఘకాలానికి ఫలితాన్ని యిచ్చే భారీ వ్యవహారాల్లో అనుకూలమైన వార్తలను వింటారు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగానే ఉంటాయి గాని మొగమాటాలకు లోంగిపోయి వాగ్దానాలు చేయడం వలన మున్ముందు యిబ్బంది కలుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రతిపక్షాలు బలహీన పడే సంఘటనలు జరుగుతాయి. పారిశ్రామిక వేత్తలకు అనుకూలమైన సమయం.

స్త్రీలకు—ఆరోగ్యం ప్రస్తుతం బాగా ఉన్నా నిర్లక్ష్యం చేయతగదు. సాంఘిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి.

ధనుస్సు :

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)

ఈ వారం శుభా శుభమిశ్రమంగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో వారం ప్రారంభంలో జరిగే వ్యవహారాలు అనుకూలంగా ఉన్నా వారాంతానికి ఆకస్మికంగా చికాకులు యేర్పడవచ్చును. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలి వేయడం మంచిది. వృత్తిలో మీరు యిది వరకు కొన్ని వ్యవహారాలను నిర్లక్ష్యం చేయడం వలన మీరు పొందవలసిన లాభాన్ని పొందలేని పరిస్థితి యేర్పడుతుంది. వారాంతంలో అధిక వ్యయం జరగడం వలన ఆర్థికంగా ఒత్తిడి వస్తుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషికి ఆటంకాలు వస్తాయి. దైవకార్యాలు నిరాటంకంగా నెరవేరుతాయి.

స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరగవచ్చు. శుభమూలంగా వ్యయం జరుగుతుంది. వినోదకాలక్షేపాల్లో పాల్గొంటారు.

మకరం :

(ఉషా 2, 3, 4 పా, శ్రవణం, ధనిష్ఠ 1,2 పా.)

ఈ వారం గతవారం కంటే బాగా ఉంటుంది. వృత్తి వ్యాపారాల్లో కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వ్యాపారంలో మీ అభిప్రాయాలకు తగిన అవకాశాలు లభిస్తాయి. నూతన వ్యవహారాల్లో వెంటనే విశేషమైన ప్రయోజనం లేకపోయినా మీ కృషిమాత్రం వ్యర్థం కాదు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో మాత్రం స్వల్పమైన యిబ్బందులు కలుగుతాయి. ఉద్యోగంలో మీ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. రాజకీయ వ్యవహారాల్లో నూతన పరిచయాల వలన మీకార్యక్రమాలను మార్చుకో వలసివస్తుంది. ఆరోగ్యం గతవారంలో కంటే బాగా ఉంటుంది.

స్త్రీలకు—ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. కుటుంబ కార్యక్రమాలకు ఆకస్మికంగా మార్పులు వస్తాయి. సాహిత్య కళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

కుంభం :

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భా. 1, 2, 3పా)

ఆదాయం బాగానే ఉన్నా రావలసిన డబ్బు సమయానికి అందక పోవడం వలన వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలకు ఆటంకాలు వస్తాయి. భారీ యెత్తున చేసే వ్యాపారాల్లో మీకు కలిగే సందేహాల వలన కొన్ని చేజిక్కిన అవకాశాలను కూడా పోగొట్టుకొనే పరిస్థితి యేర్పడుతుంది. వారాంతంలో ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలమైన మార్పులు రావచ్చును. వృత్తిరీత్యా చేసే ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. శుభకార్యాల విషయంలో మీ ఆలోచనలకు మీ బంధువుల వల్లనే ఆటంకాలు రావచ్చును. సాంఘిక కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి.

స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

మీనం :

(పూ. భాద్ర, 4 పా, ఉ. భా. రేవతి.)

వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో కొన్ని వ్యవహారాలు ఆందోళన కలిగించినా, వారాంతానికి అనుకూల పరిస్థితి యేర్పడడమే కాకుండా తగిన అభివృద్ధిని సాధించడానికి అవకాశం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలు వారం రెండవ భాగంలో పూర్తి చేయడం మంచిది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు యిదివరకటి కంటే బాగా ఉంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభించవచ్చును. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. ఉద్యోగంలో కార్యభారం పెరగవచ్చును. కాని మీ శక్తి సామర్థ్యాలు అధికారుల చేత గుర్తింపబడతాయి. ఆరోగ్యం అంత బాగా ఉండక పోవచ్చును.

స్త్రీలకు— కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి. విలాసవస్తువులు కొంటారు. దైవకార్యాలు నెరవేరుతాయి. ★

జన్మదినఫలం

మార్చి-19

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు చురుకుగా సాగడంవలన ఆదాయం పెరగడానికి అవకాశం ఉంది. కాని సంవత్సరం ఆఖరున ఏర్పడే చికాకుల వలన మీరు అనవసరమైన వ్యయప్రయాసలకు గురి కాగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో పోటీవారితో పోటీ కొంచెం పెరిగినా, మీ కార్యక్రమాలకు ఆటంకాలు కలుగవు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల్లో నూతనావకాశాలు లభించవచ్చును. వృత్తిలో మీ కార్యక్రమాలు అనుకొన్నట్లుగానే నెరవేరతాయి గాని ఫలితం అంత సంతృప్తికరంగా ఉండకపోవచ్చును. ఉద్యోగంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. ఆర్థిక వ్యవహారాల్లో ఇదివరకు ఏర్పడిన చికాకులు తొలగిపోతాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కావచ్చును.

మార్చి-20

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగానే ఉంటాయి కాని, కొంతమంది సన్నిహితులతోనే భేదాభిప్రాయాలు కలుగగల సూచనలు ఉన్నాయి. అధికారులవలన జరగవలసిన పనుల్లో మీకు కొంతమంది మిత్రుల సహకారం లభిస్తుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగానే ఉంటాయి. వృత్తిరీత్యా దూర ప్రయాణాలు చేసి కార్యసాధన చేయగలరు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు సంవత్సరాంతంలో లాభించవచ్చును. డబ్బుకు సంబంధించిన వాగ్దానాలు ఇప్పుడు చేయడంవలన మున్ముందు యిబ్బంది కలుగుతుంది. సాహిత్య కళారంగాల్లో మీ కృషికి ఆటంకాలు రావచ్చును. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. తీర్థయాత్రలు చేస్తారు. విద్యార్థులు మొదటినుంచి శ్రద్ధగా చదవడం మంచిది.

మార్చి-21

వృత్తి వ్యాపారాల్లో అప్పుడప్పుడు అనుకోని చికాకులు వచ్చినా, మీ చాకచక్యం వలన వాటిని అధిగమించడమే కాకుండా, తగినంత అభివృద్ధిని కూడా సాధించడంవలన ఈ సంవత్సరం సంతృప్తికరంగానే ఉంటుంది. వ్యాపారంలో మీరు ఇదివరకు ఎంత ప్రయత్నించినా, నెరవేరని వ్యవహారాలు ఈ సంవత్సరం మధ్యలో ఫలించగల సూచనలు ఉన్నాయి. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాల కంటే మీరు స్వంతంగా చేసే వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వృత్తిలో పోటీవారితో పోటీ తీవ్రం కావడంవలన మీరు పొందవలసినంత లాభాన్ని పొందలేక పోవచ్చును. ఉద్యోగంలో మార్పుల కోసం మీరు చేసే ప్రయత్నాలు ఫలించవు. ఆర్థిక వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. విలువైన వస్తువులు కొంటారు. విద్యార్థులు సాధారణంగా కృతార్థులు కాగలరు.

మార్చి-22

ఈ సంవత్సరం గడచిన సంవత్సరం కంటే బాగా ఉంటుంది. వ్యాపారంలో నూతనావకాశాలు లభించగల సూచనలు ఉన్నాయి. భారీఎత్తున చేసే వ్యాపారాల్లో ఇదివరకు ఏర్పడిన అవరోధాలు తొలగిపోతాయి. వ్యాపారస్థులకు సంవత్సరాంతంలో ఆకస్మిక ధనలాభం కలగవచ్చును. వృత్తిలో పోటీవారితో పోటీ కొంచెం తగ్గుతుంది. ఉద్యోగంలో మీరు యిదివరకు నిర్లక్ష్యం చేసిన వ్యవహారాలకు యిప్పుడు ప్రాముఖ్యత రావడంవలన కొంత యిబ్బంది కలుగవచ్చును. కాని సంవత్సరాంతంలో అనుకూలమైన మార్పులు వస్తాయి. సాహసముతో కూడిన వ్యవహారాలు కూడా కొంతవరకు లాభిస్తాయి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. బంధువుల వ్యవహారాల్లో చికాకులు రావచ్చును. రాజకీయ వ్యవహారాల్లో క్రమాభివృద్ధి ఉంటుంది. విద్యార్థులు కొంచెం శ్రమమీద కృతార్థులు కాగలరు.

మార్చి-23

ఈ సంవత్సరం మీరు ఘన విజయాల్ని ఏమీ సాధించలేకపోయినా, వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు ఒడుదుడుకులు లేకుండా సాగిపోగల సూచనలు ఉన్నాయి. వ్యాపారంలో కొన్ని అవకాశాలు ఇంద్రధనుస్సువలె ఆకర్షణీయంగా కన్పిస్తాయి కాని వాటిని గురించి ప్రయత్నించడం వలన ప్రయాస తప్ప ప్రయోజనం ఉండదు. వృత్తిలో మీకు ముఖ్యమైన పరిస్థితుల్లో స్నేహితుల సహకారం లభించడంవలన కొంత అభివృద్ధిని సాధించగలరు. ఉద్యోగంలో మీ పరిస్థితి యిదివరకటికంటే బాగా ఉంటుంది. మీరు ఇది వరకు జరిపిన వ్యవహారాల్లో చిక్కుబడిపోయిన డబ్బు తిరిగి చేతికి వస్తుంది. కోర్టు వ్యవహారాల్లో కొంచెం శ్రమమీద విజయాన్ని సాధించగలరు ఆరోగ్యం బాగానే ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు. విద్యార్థులు సామాన్యంగా కృతార్థులు కావచ్చును.

మార్చి-24

ఈ సంవత్సరం మీ వ్యవహారాలన్నీ సంతృప్తికరంగా ఉన్నా ఇతరులకు సహాయం చేయడానికి ప్రయత్నించడంవలన కొంచెం శ్రమకు గురి కాగలరు. వ్యాపారంలో ఆదాయంతోబాటు అంతస్తు కూడా పెరుగుతుంది. ఇంతవరకు మీపట్ల ముభావంగా ఉన్నవారు కూడా మిమ్మల్ని గౌరవిస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాల్లో అనుకూలమైన సంఘటనలు జరుగుతాయి. వృత్తిలో నూతన మార్గాల ద్వారా ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగంలో ఉన్నత స్థానం కోసం మీరు చేసే ప్రయత్నాల్లో ప్రముఖ వ్యక్తుల సహాయం లభిస్తుంది. వ్యాపారం భారీ ఎత్తున చేయడంవలన ఆర్థికంగా అప్పుడప్పుడు ఒత్తిడి రావచ్చును. ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. కుటుంబ వ్యవహారాల్లో స్వల్ప భేదాభిప్రాయాలు రావచ్చును. దూర ప్రయాణాలు చేస్తారు. విద్యార్థులు మంచి మార్కులతో కృతార్థులు కావచ్చును.

మార్చి-25

ఈ సంవత్సరం వృత్తి వ్యాపారాల్లో ఎప్పుడూ ఏవో సందేహాలు రావడం వలన సాహసించి ఏపనీ చేయలేరు గాని ప్రయత్నించిన ప్రతి పనీ నెరవేరడానికి అవకాశం ఉంది. మీరు స్వంతంగా చేసే వ్యాపారాల కంటే భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. వృత్తి ఉద్యోగాలకు సంబంధించిన విద్యలో నిపుణులు కాగల సూచనలు ఉన్నాయి. వృత్తిలో యిదివరకు మీరు ప్రయత్నం చేసిన మార్పులు యిప్పుడు వాటంతటవి రావచ్చును. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి రావలసిన డబ్బు సమయానికి అందవచ్చును. స్థిరాస్థి వ్యవహారాల్లో కొత్త సమస్యలు తలయెత్తవచ్చును. ఆరోగ్యం బాగానే ఉంటుంది శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు విద్యార్థులు విశేషమైన శ్రమ లేకుండా కృతార్థులు కాగలరు. పారిశ్రామికవేత్తలకు యోగవంతమైన సమయం. ★


NIVEA
creme

అపస్వరం

మూలం త్రివేణి

అనువాదం శర్వాణి

జ రి గి న క థ

తల్లిదండ్రుల్ని కోల్పోయి అనాథైన మీరను పెదనాన్న క్రిష్ణయ్యగారు చేరదీస్తారు. చదువులోనూ యితర విషయాల్లోను ఎంతో చురుకుగా ఉన్న మీరకు పెరపల్లి ఆటంకం ఏదురౌతూ ఉంటుంది. కొన్నేళ్ళు గడుస్తాయి. మీర అన్న గోపి డాక్టర్ పూర్తి చేస్తాడు. మీర కూడా కాలేజిలో చేర్తుంది. తను కూడా డాక్టర్ చదవాలనుకుంటుంది. రాధ, గోపాలం దంపతులవుతారు. శాము, మీరలు పరస్పరం ఆకర్షించుకొంటారు. శాముతో మీర వివాహం జరిగిపోతుంది. మీర అత్తవారింటికి వెళుతుంది. కానీ లోలోపల డాక్టరవ్వాలనే కోరిక బలవత్తరమవుతుంటుంది. ఎత్తైటూరి వాతావరణం మీరకు గిట్టదు. అయినా, తన సంసారాన్ని దిద్దుకోవటమే తన కర్తవ్యమని మనసును సరిపెట్టుకునేందుకు ప్రయత్నిస్తుంది. ఇంటర్‌మీడియేట్, ఫస్టు క్లాసులో ప్యాసయినట్టు తెలియగానే గత స్మృతులన్నీ మీరను వ్యాకులపరుస్తాయి. కాలక్షేపం కోసం గ్రామీణ స్త్రీలకు విద్యాబోధన చెయ్యాలని అనుకుంటుంది మీర. ఆరంభించిన వెలరోజులలోనే ఆ పాఠశాల మూతపడతుంది.

10

చేతిబిడ్డ మూలుగుతూ, మురికి పేలికల మధ్య పడుకుంది. బిడ్డ, బిడ్డలా లేక కోతి పిల్లలా ఉంది. చీపురుపుల్లలాంటి చేతులూ, కాళ్ళూ, పెద్ద కడుపు, లివర్ జబ్బును తెలియజేస్తున్నాయి

క్షణక్షణానికి వూపిరి పీల్చటం కష్టమైపోతోంది, బిడ్డకు. వూపిరి పీల్చటానికి ప్రయత్నించి గిలగిలా తన్నుకోసాగింది బిడ్డ. వూపిరి గొంతులోనే నిలచి, గొరగొర శబ్దం వినిపించింది బిడ్డ కళ్ళు తేలవేయటం చూసి రాచమ్మ "అయ్యో బిడ్డా" అని, గుండె బాదుకొని ఏడ్వసాగింది. బోరడు మట్టుకు, సంసార వ్యామోహం లేని విరాగిలా, రాతిబొమ్మలా; కూర్చున్నాడు.

మీర బిడ్డకోసం ఏడుస్తున్న తల్లివేపు చూసింది. ఎనమండుగురు పిల్లల తల్లి రాచమ్మ. రసం పీల్చిన చెరుకులా ఉంది ముడతలు పడిన మొహం, దుమ్ము కొట్టుకున్న తల, కాంతిలేని లోతుకు పోయిన కళ్ళు, కృశమైన శరీరం ...

బోరడివేపు చూసింది, మీర. దృఢకాయుడని చెప్పలేకపోయినా, రాచమ్మలాగ, కృశించి లేడతను. ఊపిరాడుతున్న శవంలా ఉన్న, రాచమ్మ మీద ఇంకా ప్రతీకారం తీసుకుంటున్న అతడిని చూసి ఒళ్ళు మండింది మీరకు.

కాని, ... కాని అతనికి మాత్రం జీవితంలో ఏం సుఖముంది గనుక! ఉదయం నుండి సాయంత్రం దాకా వళ్ళు విరిగేలా చాకిరీచేసి వస్తే, ఇంట్లో ఏవిధమైన సంతోషమూ లేదుకదా? అలసివచ్చినతనికి పుల్లాసాన్నిచ్చే మొహాలు లేవు. విశ్రాంతి కోసం ఇంటికొచ్చినతనికి, ఈ పెళ్లాం బిడ్డల వేపు చూస్తే మరింత బాధే తప్ప వేరే లేదు కదా? భార్యనుండి పొందే సుఖం తప్ప, మరో సుఖం లేదతనికి! ఆ ఒక్క సుఖంలో తన జీవితపు దుఃఖాన్నంతా మరవటానికి ప్రయత్నిస్తాడతను.

మీర బిడ్డ చిన్ని చేతిని, తన చేతిలోకి తీసుకుంది. బంగారు గాజులతో నిండిన మీర చేతిలో, ఆ పిల్ల చీపురుపుల్లలాంటి చెయ్యి విచిత్రంగా కనిపిస్తోంది.

తను డాక్టరయి ఉంటే? ఎదురుగా తను ఉన్నా, చుట్టూ ఉన్న ఇంతమందిని సాక్ష్యంగా ఉంచుకొని ఆ బిడ్డ ప్రాణం పైకి ఎగిరిపోతూ ఉంటే, అందరూ చూస్తూ వూరికే కూర్చున్నారు. డాక్టరవాలని పలువరించిన మీర ఆ బిడ్డను శూన్య దృష్టితో చూస్తూ కూర్చుంది. ఆమె కళ్ళలో నీరు నిండాయి. ఆబిడ్డ అనుభవిస్తున్న బాధకన్నా, తన నిస్సహాయ పరిస్థితి, ఆమెను ఎక్కువగా బాధపెట్టింది. తను మానవురాలిగా పుట్టి, తెలివి, తీక్షణబుద్ధి కలిగిఉండి, ఆశావాది అయి కూడా ప్రయోజనం లేకపోయింది గాడిద పొదుగులోని పాల లాగ, ఆమె తెలివంతా ఎందుకూ పనికిరాకుండా పోయింది. తన కళ్ళ ముందే ఒక ప్రాణం ఎగిరిపోతోన్న స్థితి సంభవించినా, తను ఏమీ చేయలేక ఉండిపోవలసి వచ్చింది ఇంతకన్న ఘోర శిక్ష మరేం కావాలి?

బిడ్డ చెయ్యి మీర చేతిలో ఉండగానే, ఆఖరి శ్వాస తీసింది, బిడ్డ రాచమ్మ ఏడుపు తారస్థాయినందుకుంది మీర చేతిలోని బిడ్డ చెయ్యి క్రమముగా చల్లబడసాగింది. ఎంతసేపు అలా కూర్చొందో ఆమెకే తెలియదు శాము ఆమె భుజం తట్టి "మీరా" అన్నాడు.

"ఏమిటి?"

"పద, ఇంటికి వెడదాం"

మీర బిడ్డ చేతిని దాని రొమ్ము మీ దుంచి, పైకి లేచింది.

ఈ సంఘటనవల్ల మీర మనసులోని కోర్కె మళ్ళీ పెల్లుబికింది. ఇల్లు, వాకిలి, భర్త అందరిని వదిలి డాక్టరవ్వాల్న కోర్కె ఆమె హృదయాన్ని వ్యాపించింది. కాని, మీర కోర్కెప్రవాహంలోని శక్తి. నేలకు కొట్టబడిన రబ్బరు బంతిలా పైకి లేస్తున్న తన తీవ్ర వాంఛను, లోలోపలె అణచటానికి ప్రయత్నం చేసింది, మీర

గౌరీ పండుగ దగ్గర కొస్తోంది. పెళ్లయిన తొలి ఏడాది గనుక మీరను తప్పక పండుగకు మైసూరికి పంపాలని ఉత్తరం రాశారు, కృష్ణయ్యగారు.

(మైసూరులో భాద్రపద శుద్ధ తదియ, అనగా విఘ్నేశ్వరుని పూజకు ముందు రోజున స్వర్ణ గౌరీవ్రతం చేసుకుంటారు. తెలుగునాట సంక్రాంతి పండుగకు ఆడపిల్లలు పుట్టింటికి వచ్చినట్టుగానే, కన్నడిగుల, ఆడపిల్లలు, గౌరమ్మ పండుగకు పుట్టింటికి వెడుతారు. అందులోనూ ముఖ్యంగా, పెళ్లయిన ఏడాదికి, తల్లి కూతురు చేత గౌరిపూజ చేయుంచి, వాయనములు ఇప్పిస్తుంది. ఇది కన్నడిగుల ఆచారము.)

ఊరికి వెళ్లాలని ఎంతో ఉత్సాహంతో ఉంది, మీర. కాని శాము ఒప్పుకోలేదు. దాంతో భార్యాభర్తల మధ్య చిన్న ఘర్షణ జరిగింది.

"పండుగ అవగానే వచ్చేస్తానంది"

"వీల్లేదు. పుట్టింటికి వెళ్లాక, వచ్చేమాట వాయిదా పడొచ్చు నే నది భరించలేను. పండగ ఎక్కడ చేస్తేనేం?"

"అలా చేయను. నన్ను నమ్మండి. పండగ అవగానే వచ్చేస్తాను."

"వీల్లేదంటే వీల్లేదు నిన్ను వదిలి ఒక్కరోజు కూడ ఉండలేను, నేను." ఖచ్చితంగా చెప్పేశాడు.

ఇది ప్రేమో, స్వార్థమో అర్థంగాలేదు, మీరకు. చేదుమాత్రకు తేనె పూసి తినిపించినట్టు, తన స్వార్థ సాధనకోసం, ప్రేమ పేరుతో శాము తనను, ఇష్టప్రకారమే నడిపించుకోవటం చూసి జుగుప్స కలిగింది, మీరకు. ఇంత చిన్న కోర్కెను నిరాకరించటంతో, ఆమె మనసు అతడి పట్ల విముఖత చెందింది.

ఆఖరికి శాము ఇష్టప్రకారం పల్లెలోనే గౌరి పూజ చేసుకుంది మీర. కూతురు రాదన్న విషయం తెలుసుకున్న కృష్ణయ్యగారు, అక్కడికే మంగళ ద్రవ్యాలు పంపారు. కోపంతోనూ, ఉదాసీనతతోనూ గౌరీపూజ రోజున మీర ఒక్క నగకూడా పెట్టుకోకుండా మామూలు పట్టుచీరతో పూజకు కూర్చోబోతుండగా చూసి శాముకు ఆశ్చర్యం వేసింది అతనికి తన తల్లి గౌరిపూజ చేసినప్పటి దృశ్యం గుర్తు కొచ్చింది ఒంటినిండా నగలతో అలంకరించుకొని, చెంపలకు పసుపు రాసుకుని, నుదుటిలో పెద్ద అడ్డబొట్టు పెట్టుకొని, కళ్లకు కాటుక, తలనిండా పూలు పెట్టుకొని, పూజకు బయలుదేరితే సాక్షాత్ గౌరీదేవిలా ఉండేది. ఈరోజు తల్లి వైభవానికి విరుద్ధంగా, ఉన్న మీర తీరు అతడిని చకితుడిని చేసింది. వెండి గిన్నెలో కి పసుపు కుంకుమ నింపుతున్న మీరను,

"మీరా ఏమిటిది? ఈ చీరతోనే పూజ చేస్తావా?" అనడిగాడు

"హాఁ."

"పెట్టెనిండా ఉన్ని చీరలుండగా ...."

"గౌరిపూజకు కావలసినది, భక్తి, చీరలు కాదు."

"నిజమే. కాని, భక్తితోపాటు శ్రద్ధ కూడా ఉండాలి. అమ్మ ధర్మవరపు చీరల నిండుదనం, ఈ నీ చీరలకొస్తాయా ?"

"మీ అమ్మగారి ఇరవై మూరల చీరల బరువు నేను మోయలేను..... అదికాక, సగం చీరంతా కొంగుతో నిండిపోయింది. అలాటి చీరలు నాకు నచ్చవు."

"అయితే ఆ చీరలన్నీ ఏంచెయ్యా లంటావు ?"

"అన్నీ కత్తిరించి, ఆరు గజాలవిగా మారిస్తే కట్టుకోవచ్చు."

"అసంభవం ! ఆ చీరలన్నీ అలాగే మసికొట్టి పోయినా సరే. అమ్మ చీరలు కత్తిరించటానికి మాత్రం ఒప్పుకోను నేను "

"సరే, ఒద్దు."

"చీరలు వద్దు సరే, నగలకేమయ్యాయి ?"

"ఆ పూర్వకాలపు నగలు ఎవరు వేసుకుంటారు? వాటిని చెరిపించి, మామిడిపిందెల గొలుసు, నెక్లెసు. మిరియాల గాజులు చేయిస్తే వేసుకోవచ్చు."

ఈసారి వళ్ళు మండింది, శాముకు. తనను రెచ్చగొట్టడానికి మీర ఇలా మాట్లాడుతోందని తెలుసుకున్నాడు.

"బంగారం పెట్టెలో ఉంటే మురిగిపోదులే! కాని, నేను బ్రతికి ఉన్నంతకాలం, వాటిని చెరిపించటానికి ఒప్పుకోను." అని కోపంగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

అపస్వరం

మీర వ్యంగ్యంగా నవ్వి, తను చేస్తున్న పనిలో నిమగ్నురాలయింది. తన మాటను లక్ష్యపెట్టకుండా 'అమ్మ' అని చనిపోయిన తల్లినే తల్చుకొనే శాము పట్ల ఆమె హృదయం కఠినమయింది.

* * *

శాము పొలం దగ్గర, తలకోతుండు చుట్టుకుని, ధోవతి పైకి మడిచికట్టి బురదలో నడుస్తూ పనిచేస్తున్న రైతులకు సలహా లిస్తున్నాడు.

"కాలువ ఇంకొస్త వెడల్పుగా ఉండాలి, కదుర్రా తిమ్మా. నీరు ఆ కొసదాకా పారాలి "

హఠాత్తుగా, దూరంలో ఎవరో వస్తూన్నట్టు కనపడింది, శాముకు. "ఎవరా ?" అని చెయ్యి కంటికి అడ్డంగా పెట్టుకొని చూశాడు. చీర చెంగు గాలికి రెపరెప లాడుతోంది. ఇలాంటి సమయంలో మీర అక్కడికి వస్తుందన్న వూహే లేదతనికి. కాని వస్తున్నది మీరేనని తెల్లటివాయిల్ చీర ఖచ్చితపరుస్తోంది. ఆమె దగ్గరకు రాగానే, ఎండకు ఎర్రగా కందిపోయిన ఆమె మొహాన్ని చూసి జాలి కలిగింది శాముకు. అంతదూరం గబగబా నడిచిరావటంవల్ల ఆయాసంతో రొప్పుతున్నా మొహంలో ఉల్లాసమూ, ఉత్సాహమూ కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయ్. ఆ సమయంలో మీర మరింత అందంగా కనిపించింది. శాము కళ్ళకు. దగ్గరకు లాక్కోవా లనుకున్నాడు కాని, చుట్టూ ఉన్న మనుష్యులని చూసి, తన కోర్కెను మనసులోనే దాచుకున్నాడు.

"ఏమిటి, దేవిగారు ఇంతదూరం దయ చేసేరు ?"

"నా ఫ్రెండ్, నర్మద తెలుసుగా మీకు ? ఆమెకు ఉత్తరం రాశాను, 'దసరాకు సుబ్బూ, చంప, రాజు ఇక్కడికి రండి' అని. ఎల్లుండి వస్తారట. మీకు చెప్పి తనకు బదులు రాద్దామని వచ్చాను."

"ఎండలో ఎందు కొచ్చావు ? అయిదింటికి నేనే వచ్చేవాడినిగా."

"పోస్టుకు టైమైపోతుందిగదా అని వచ్చాను. ఈరోజు ఉత్తరం రాస్తే రేపే అందుతుంది."

"రాసెయ్యలేకపోయావా ?"

"మీతో చెప్పకుండానే ?" అంటూ ఉత్సాహంగా వెనుతిరిగింది మీర. ఇంటికి రాగానే, నర్మదకు బదులు రాసింది.

రెండు రోజులు ఎలా గడిచిందో ఆమెకే తెలియదు. మూడవరోజు ఇల్లంతా శుభ్రంగా కడిగించింది. బీరువాలోని దుమ్ము దులిపి సవ్వంగా సర్దింది.

నర్మదా వాళ్ళు ఉదయపు బండికే వస్తామని



రాశారు. ఆరోజు మీర ఆరు గంటలకే లేచి, పూలు కోసి, దండ గుచ్చి, జడ వేసుకుంది. పూల మాల తలలో పెట్టుకుంది తన కాలేజీ స్నేహితుల స్వాగతానికి ధర్మావరపు చీర అక్కర్లేదనిపించింది. ఆమెకు చాలా ఇష్టమైన జార్జెట్ చీర కట్టుకుంది. అంతలో బండివాడు, నింగడు, రామలక్ష్మణులను బండికి కట్టి సిద్ధంగా నుంచున్నాడు. పొలంవేపు బయల్దేరుతున్న శామును చూసి, మీర

"రండి, అక్కడిదాకా బండిలో వెడదాం" అంది.

"ఒద్దు. ఉదయపుగాలి వంటికి మంచిది. నడచే వెడతాను".

"మధ్యాహ్నం తొందరగా వచ్చేయండి, నా స్నేహితులను పరిచయం చేస్తాను."

"అమ్మ బాబోయ్! మీ కాలేజీ అమ్మాయిలతోనే!"

"ఏం, కాలేజీ అమ్మాయిలంటే పులి, సింహో అనుకుంటున్నారా ?"

"లేదుగాని, భోజనానికి నాకోసం కాచుకోకండి"

శాము మాటలతో ఆమెకు ఉత్సాహ భంగమే అయినా, స్నేహితుల రాకను తలచుకొని, తేరుకుని, మళ్ళీ ఉత్సాహం పుంజుకుంది.

రైలు కిటికీల్లో స్నేహితుల మొహాలు కనబడగానే ఉత్సాహంతో చెయ్యూపింది. రాజా, చంపా, నర్మదా హలో అన్నారు గట్టిగా.

రైలు ఆగగానే నర్మద కిందికి దూకింది.

"నింగా, వాళ్ళ సామాన్లు దించేసేయ్"

"మూడు చిన్న పెట్టెలున్నాయంతే."

నింగడు పెట్టెలు దించాడు. ఆ అమ్మాయిలు కట్టుకున్న పులి చారల చీరల్నీ, నెమలిపించంలా విప్పుకున్న శిరోజాలంకారాలనూ చూసి తెల్లబోతున్నాడతను.

"మీరా పెళ్ళయితే వొళ్ళొస్తుందంటారు గాని, నువ్వేమిటే అలా చిక్కిపోయావు?" రాజా అడిగింది.

కాకపోతే నీలా ఊరిపొమ్మన్నావా ? గుర్తుపట్టలేక పోయాను తెలుసా? రోజు రోజుకు బెలూనే అయిపోతున్నావు తల్లీ." అంటూ రాజాను హాస్యం చేసింది మీరా. చంప కిలకిలా నవ్వుతూ

"మీరా మొన్ననో తమాషా జరిగిందే. రాజా ఫోటో తీయించుకోవడానికో స్టూడియోకు వెళ్ళింది. ఆ ఫోటోగ్రాఫర్ రాజాను చూసి అమ్మా మీకు ఒక్కసారే పోటోతియ్యలేం. కావాలంటే ఇన్‌స్టాల్‌మెంట్ సిస్టమ్‌లో తీస్తాం' అన్నాడట. ఔదే నర్మదా?" అంది.

నలుగురూ కబుర్లు చెప్పుకుంటూ బండి దగ్గరకొచ్చారు. వీళ్ళ రంగురంగుల చీరలను చూసి గిత్తలు బెదరిపోయాయి. పులిచారల చీర కట్టుకున్న చంపా వెనక్కి ఒక్క గంతేసి

"ఎందుకే మీరా ఇలా బెదరిపోతున్నాయ్ ఈ గిత్తలు?" అనడిగింది.

"నువ్విటు రావే చిట్టితల్లీ. నీ చీర చూసి పులి వచ్చిందనే అనుకుంటున్నాయివి."

"ఆఁ. ఇక ఎక్కండి. రాజా నువ్వు ఎక్కమ్మా ముందు. నువ్వు ఎక్కాకకూడా బండి సురక్షితంగా ఉంటే, ఉన్నా దాన్లో మాకు కూడా చోటుంటే ఎక్కుతాం మేం." అంది చంప.

రాజా మొహం ఎర్రబడింది. "మీరా ఎలాగే ఎక్కడం?" అనడిగింది.

"ఒక్కసారి గంతు వేసి కూర్చో." అని సలహా ఇచ్చింది మీర.

"అవేం మాటలు మీరా? నువ్వుమరీని. రాజు గంతు వేయగలదా పాపం. ఓ బల్ల తెప్పించుపోనీ."

"నింగా. స్టేషన్ మాస్టర్ నడిగి బల్ల పట్టు కురారా."

నింగడు తెచ్చిన బల్ల సహాయంతో నలుగురూ బండి ఎక్కారు నింగడు ముందువైపెక్కి నెమ్మదిగా బండి తోలసాగాడు.

ఇదే మా ఊరి రోల్స్‌రాయ్స్."

"కుసుమ పాసయిందా?"

"మూడిట్లోనూ చెక్కేసింది. అయినా సెప్టెంబర్ ఉన్నంతవరకూ భయం లేదనుకో."

"ఇప్పుడు కూడా మీరు ముగ్గురు కలిసే వెడుతున్నారు కదూ?"

"ఆఁ. నర్మద మమ్మల్ని వదిలించుకుని మెడికల్ కాలేజీకి పోదామనుకుంది. కాని సీటు రాలేదు.

భర్త చేత సిగరెట్లు మాన్పించాలని మెల్లిగా మళ్ళీ దాడి ఆరంభించింది భార్యా రత్నం.

"అనల్నాకు తెలీకడుగుతా. అంత యిదిగా కాలుస్తారే, ఆ సిగరెట్లలో ఏముంటుంది?" అంది.

"పొగాకు" అని అక్కణ్ణించి లేచిపోయాడు భర్త.

వనజ (తాడేపల్లిగూడెం)

మీరా నువ్వు ప్రయత్నించి ఉంటే తప్పక సీటొచ్చేదేనే!"

అంత సంతోష సమయంలో కూడా ఆమాట వినగానే ఆమె మనసు చిన్నబోయింది.

"నాకా పుణ్యం లేదులేవే." అంది. ఆమె కంఠం రుద్ధమయింది. కళ్ళు చెమర్చాయి.

"మీరా, మన కన్నడం టీచర్‌కు బెంగుళూరుకు ట్రాన్స్‌ఫర్ అయింది."

"రాధ ఉత్తరం రాసిందా ?"

"ఆఁ. అప్పుడే కిశోర్‌కు తమ్ముడు పుట్టబోతున్నాడట."

బండి ఇంటిముందు ఆగింది. మీరా, నర్మదా, చంపా బండి దిగారు.

"రాజా, నెమ్మదిగా దిగమ్మా నా చిట్టితల్లీ. భూమాతకు నొప్పి కలిగించకు." అంటూ రాజాను హెచ్చరించింది చంప.

"ఓహో ! ఎలాంటి ప్రకృతి సౌందర్యం ! కవి హృదయాన్ని పరవశింపచేసే పరిసరాలు. యు ఆర్ ఎ లకీ గర్ల్ మీరా !" అంది చంప.

మీరకేం చెప్పాలో తోచలేదు. జీవంలేని నవ్వు నవ్వి వూరుకుంది.

"రండర్రా, కాఫీ టిఫిన్ తినుకుందురుగాని."

"ఉండు తల్లీ. కాస్త చీరలు మార్చుకోనీ." అందరూ మొహాలు కడుక్కుని, తెల్ల వాయిల్ చీరలు కట్టుకున్నారు.

ఇడ్లీ, వెన్న, కాఫీ పట్టించి ముగ్గురూ డ్రాయింగ్ రూముపైకి దాడి చేశారు.

"మీరా ఈ సోఫా సెట్టు చాలా బావుందేవ్ ? కాని ఈ పల్లెటూళ్ళో దాన్ని మెచ్చుకునేవాళ్ళు కూడా ఉండరనుకుంటానే."

మీర చిన్నగా నవ్వి 'నే నొకత్తెని మెచ్చుకుంటే చాల్దే !" అంది.

"ఈ వూళ్ళో రేడియో, సినిమా ....

"ఇక్కడ కరెంటే లేదు. కనక ఆ వూసెత్తడానికే వీల్లేదు"

"మీరా చంప వేసుకున్న ముడి ఎలా ఉందే ? నీకు నచ్చిందా ?"

"చాలా బావుంది. నాకూ కూడా నేర్పవే."

రెండు గంటలదాకా కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు నలుగురూ.

శాము ఇంకా ఇంటికి రాలా.

"భోజనానికి లేవండి."

"మాకేం ఆకలిగా లేదులే. మీ శ్రీవారిని రానీ."

ఏం చెప్పటానికీ తోచక మీర మౌనం వహించింది. మూడు గంటలకు శాము ఇంటికి వచ్చాడు. మీర తన స్నేహితులను అతడికి పరిచయం చేసింది. శాము మౌనంగా చేతులు జోడించి బయటికి వెళ్ళిపోయాడు. మీర అప్రతిభురాలయింది. పరిచయం చేసిన వెంటనే అతడలా వెళ్ళిపోతాడని ఊహించలేదు, మీర.

"ఆగు నింకా స్నానం చెయ్యలేదు" అంది స్నేహితుల ప్రశ్నార్థక దృష్టికి జవాబుగా. శాము స్నానంచేసి ఏదో పని ఉందంటూ అవధానిగారింటికి వెళ్ళిపోయాడు. మీర తన అసంతృప్తినంతా లోపలే మింగుకుని స్నేహితులను భోజనానికి లేవదీసింది భోజనా లయ్యాక మళ్ళీ కబుర్లలో పడ్డారు.

సాయంత్రం అయిదుగంటలయింది.

"లేవండర్రా. కాస్త తలలు దువ్వుకుని అలా షికారెళ్ళొద్దాం."

"మీరా, నేను వేసుకున్న రకం ముడి నీకు వెయ్యనా ?"

"అలాగే వేద్దువుగాని. ఒసేవ్ రాజా లే, లే" అంటూ నిద్రపోతున్న రాజాను లేపింది మీర.

పప్పన్నం తిని మధ్యాహ్నాలు ఇలా నిద్రపోతే వళ్ళు రాక ఏమవుతుం దేమిటి ?" చంప వ్యాఖ్యానించింది.

రాజా మెదలకుండా నిద్రపోతోంది. చంప లేసి కాసన్ని నీళ్ళు తెచ్చి రాజా చెవిలో పోసింది. రాజా బెదిరి లేచి కూర్చుని కళ్ళు నులుముకుంటూ చుట్టూ చూసింది అందరూ తలలు దువ్వుకునే ప్రయత్నంలో ఉండటాన్ని చూసి,

"ఓ, అప్పుడే మీరంతా సిద్ధమవుతున్నారన్నమాట !" అంది.

చంప మీర జుట్టును సున్నగా దువ్వి, జుట్టులోకి రింగు దూర్చి చక్కగా ముడివేసింది. మీర జుత్తు తక్కువే అయినా వెడల్పుగా ఉన్న ముడి 'ఎంత జుత్తు' అనిపించేలా ఉంది. వీలి డిసెంబరు



అమృతాంజనం

వాడి శీఘ్రంగా నివారణ పొందండి

స్థానికంగా ఉండే బాధను నివారించుకొడానికి లోపలికి మందులు ఎందుకు పుచ్చుకుంటారు? నొప్పి ఉన్న చోటుమీద అమృతాంజన్ రాసి అమోఘంగా శీఘ్రంగా నివారణను పొందండి. ఏ అపాయం లేకుండా కండరాల నొప్పులకు, తల నొప్పికి, బెణుకులకు ఇంకా కీళ్ల నొప్పులకు అమోఘంగా గుణమిచ్చే అమృతాంజన్ 10 రకాల ఔషధాలు చేరిన మందు. అమృతాంజన్ గుండెజలుబుకే కాక సాధారణ జలుబులకు కూడా మంచి మందు. కొంచెంకొంచెమే ఉపయోగించవలసి ఉంటుంది కాబట్టి ఒక సీసా మీ కుటుంబానికి కంతకాలికి నెలల తరబడి వస్తుంది.

అవసరానికి ఎప్పుడూ అమృతాంజన్ ఉంచుకోండి. అమృతాంజన్ 70 ఏళ్ల ప్రసిద్ధిపొందిన నమ్మకమైన గృహఔషధం.

అమృతాంజన్ నొప్పులు జలుబుల నివారణకు 10 రకాల ఔషధాలు చేరిన మందు,



అమృతాంజన్ లిమిటెడ్,
మద్రాసు • బొంబాయి • కలకత్తా • ఢిల్లీ

JWT/AM/2819

పూలమాల ముడికి అందంగా అలంకరించి వెనక ఓ అద్దం పెట్టిముడి అందాన్ని మీరకు చూపింది చంప."

"నీకు గండపెండేరం తొడిగించాలి" అంటూ చంపను మెచ్చుకుంది మీర.

తను పెట్టుకున్న పూల రంగుకు లేత నీలం రంగు చీర కట్టుకుంది మీర.

వాళ్ళందరి ముస్తాబూ పూర్తయ్యేసరికి ఆరయింది. ఇంటినుండి బయల్దేరారు. సీతాకోక చిలుకల్లా అలంకరించుకుని వెడుతున్న వీరిని ఇరుగూ, పొరుగూ అందరూ వింతగా చూడ సాగారు. మీర తన స్నేహితులను మొదట దేవాలయానికి తీసుకుని వెళ్ళింది. అక్కడ పూజ చేయించి తీర్థ ప్రసాదాలను పుచ్చుకుని బయల్దేరారు

సూర్యుడి బంగారు కిరణాలు చెరువులోని నీటి మీద పడి మెరుస్తున్నాయి. బంగారు రేకులా మెరుస్తోంది నీరు. చెరువు దగ్గర గానుగచెట్టుకు కట్టిన ఉయ్యాలలో చిన్న పిల్లలు ఊగుతున్నారు. హాయిగా ఉన్న ఆ వాతావరణంలో ఉయ్యాలలో ఊగాలనిపించింది చంపకు.

"మీరా, మనం గూడా ఊగుదామా ?"

మీర ఉయ్యాల దగ్గరకు వెళ్ళింది. చిన్న కుర్రాళ్ళు చెదరి తమ ఆట నిలిపారు. చింపిరి గుడ్డలు వేసుకున్న బలంగా ఉన్న ఓ కుర్రాడిని చూసి,

"వేణూ, మేము కాస్సేపు ఊగుతామోయ్" అంది.

"ఓ అలాగే" అన్నాడు వేణు.

మీర తన చేతిలో ఉన్న అరటిపళ్ళు, కొబ్బరి చిప్పలను ఆ కుర్రాడి చేతిలో పెట్టింది. మిగతా కుర్రాళ్లంతా అతడి చుట్టూ మూగారు.

చంపా, నర్మదా ఉయ్యాలమీద కూర్చున్నారు. మీర కొంగు దోపుతూ "చంపా గట్టిగా పట్టుకో. నేను వేగంగానే ఊపుతాను అంది. చంపా, నర్మదా వాళ్లను గట్టిగా పట్టుకున్నారు. మీర నెమ్మదిగా ఊపటానికి మొదలెట్టి, రానురాను వేగం హెచ్చించి జోరుగా ఊపటానికి మొదలెట్టింది. ఉయ్యాల ఓసారి అటువైపు కొమ్మలకూ, మరోసారి ఇటువైపు కొమ్మలకూ తగిలి ఊగసాగింది. చంప కొమ్మల్లోంచి ఆకులు తెంపి నవ్వుతూ మీర తలమీదికి విసురుతోంది. నర్మద ఆ వేగానికి భయపడి రెండు చేతుల్తోనూ తాళ్లను గట్టిగా పట్టుకుంది.

"ఇక చాలా ?" ముందుకు వచ్చి అడిగింది మీర.

"ఊహూఁ. చాలదు" అంది చంప.

"నాకు భయమేస్తోంది తల్లి. నేను ఊగలేనిక.' అంటూ దిగివచ్చింది నర్మద.

మీర చంప పక్కలో కూర్చుంది

"నువ్వో రాజా ?" అనడిగింది చంప.

"నే(నాను తల్లీ. నాకు భయం."

"నీకా భయం. ఈ కానుగచెట్టుకా ?"

నర్మద నవ్వి "రాజా వద్దులెద్దూ. తరువాత చెట్టు వేళ్లతో సమేతంగా పడిపోతుం దంతే" అంటూ ఉయ్యాల ఊపసాగింది.

సూర్యుడు నెమ్మదిగా పశ్చిమాద్రిని చేరుకుంటున్నాడు ఉయ్యాలలో ఊగుతున్నవారి మనస్సు ఉల్లాసంగతో గంతులేస్తోంది. చెరువులో నీళ్ళు నింపుకుంటున్న రైతు స్త్రీలు ఇంటికి వెళ్ళాలన్న విషయమే మరిచి వీరి ఆటలనే వింతగా చూస్తూ నిల్చున్నారు. చీకటిపడుతూ ఉండటాన్ని గమనించి మీర,

"నర్మదా ఇక ఆపవే. చీకటిపడిం దపుడే" అంది.

చంప మొహంలోని చెమట తుడుచుకుంటూ "నా ప్రింటెడ్ జార్జెట్ చీర నలిగిపోయింది. ఇక్కడికి వచ్చేందుకు ముందే ఐరన్ చేశాను" అంది.

తలమీద రెండు, నడుంమీద రెండు బిందెలు పెట్టుకున్న నలుగురు ఆడవాళ్లు వారి కెదురుగా వచ్చారు. తిమ్మమ్మ మీరను గుర్తించి "ఒసే మాదీ, ఆ నీలం కోక కట్టుకుంది మీరమ్మ కదే" అంది.

మీర దగ్గరకు రాగానే,

"ఏంటమ్మగోరూ, మీకూ ఉయ్యాలమీదికి మనసు పోయిందా ?" అంది.

"ఊఁ. అనిపించదా మరి. వీళ్లంతా మైసూరులో నాతోబాటు చదువుకున్నవారు" అంది.

తిమ్మమ్మ అందర్నీ తీక్షణంగా చూసి,

"ఈళ్లందరికీ పెళ్లి అయిందా ?" అనడిగింది.

తెల్లబోయింది మీర. చంప మొహం ఎర్రబడింది.

"లేదు."

"అదేంపనండమ్మగోరూ, వొయసొచ్చిన పిల్లలు గందా, పెళ్లి సేయకుండ అట్టే పెట్టుకుంటారా ?"

నర్మద నవ్వి "పెళ్లి సేసుకుంటే ఏం సుఖముంది చెప్పు ? సంసారంలో సుఖముందని అనుభవమున్న నీలాంటి ముసలిది చెపితే మే మందరం తప్పకుండా పెళ్లి చేసుకుంటాం." అంది.

తిమ్మమ్మ ఓ క్షణం మౌనం వహించింది. తరువాత,

"తిమ్మా, మేం పల్లెటూరోళ్ళం. మాకేం తెలుస్తాది. వండుకున్న కూడు ఎలా ఉన్నా, ఆకలి తీర్చుకోటానికి తినక దప్పదు గదా ? అలాగే సంసారంలో సుఖమున్నా, లేకపోయినా వొయిసొచ్చాక పెళ్లి సేసుకోవాలి. అదే నాను సెప్తుతున్నది" అంది.

"తిమ్మమ్మా నీకు ఆడపిల్లలున్నారా ?"

"లేకేం తల్లీ, ఇంటినిండా ఆడపిల్లలే."

"నా యీడు కూతురుందా ?"

"ఉంది తల్లీ."

"ఆ పిల్లకూ పెళ్లి చేశావా ? ఎంతమంది పిల్లలు ?"

"ఇద్దరు పిల్లలుండారు తల్లీ."

"సరే అయితే ఇప్పుడు నన్నూ, నీ కూతుర్నీ పోల్చి చూడు. మాలో ఎవరూ ఎక్కువ సంతోషంగా, హాయిగా ఉన్నారో ? చెప్పు మరి ?"

తిమ్మమ్మ తన కూతురు మాదమ్మను, నర్మదనూ పోల్చి చూసింది. మాదమ్మకు అపుడే సంసారంలో విసుగు పుట్టింది. పెద్దపిల్లకు ఇంకా సంవత్సరం నిండకమునుపే మళ్లీ కడుపొచ్చింది. రెండో పిల్లకు పది నెల్లు నిండాయో లేదో అప్పుడే మళ్లీ నెల తప్పింది. తల్లితో ఎన్నోమార్లు "నావల్లగాదీ కాపురం" అంటూ వాపోయేది. నర్మద మొహంలోని పసితనం, కాంతి, చైతన్యం మాదమ్మ మొహంలో లేనేలేదు. అప్పుడే ముసలితనం ఆమెలోని చైతన్యాన్నంతా హరింపచేసింది. పిల్లల్ని కనటంతోబాటు ఆమె ఆరోగ్యం రోజు రోజుకూ పాడవుతుంది. ఎప్పుడూ ఏడ్చే పెద్ద పిల్లాడు, వడిలో మూలిగే రెండవ పిల్ల, కడుపులో కదిలే మూడవ బిడ్డ. వీటితో జర్జరితమయింది మాదమ్మ.

(స శే షం)




వైజ్ఞానిక గాథాశతి

—10—

డాక్టర్

విటమినుల గాధ



"ఏమయ్యా, ఈ కోళ్ళు బాగానే ఉన్నాయే ? ఆవేళ చేబియ్యపన్నము పెట్టిన కోళ్ళేనా ఇవీ ?"

"అవును బాబూ అవే. వాటికి లెక్కేమిటి బాబూ నానా గడ్డీ తినే వాటికి ?"

"అప్పటినుంచీ చేబియ్యపన్నమే పెట్టారా వీటికి ?"

"అవును బాబూ, కొంచెం తవుడు కూడా పెట్టాము"

"తవుడూ పెట్టారూ ? ఇప్పుడు వాటికి వాలిపోయే మెడలూ, వంకర టింకర కాళ్ళూ తడ తడ లాడే రెక్కలూ లేవే ?"

"కోలుకున్నాయి బాబూ."

"చే బియ్యపన్నమూ తవుడూతో కోలుకున్నాయా ?" అని గొణుగుకుంటూ క్రిస్టియన్ ఐక్‌మన్ వెళ్ళిపోయాడు. అది ఈస్టిండీస్‌లో డచ్‌వారు స్థాపించిన హాస్పిటలు. అతడు నంజు రోగము—నివారించే పనిపెట్టి డచ్ గవర్నమెంటువారు హాలెండు నుంచి పంపిన వైద్య బృందములోని వాడు. ఆ రోగము సంగతి పూర్తిగా కనిపెట్టకుండానే అది అంటురోగమని నిశ్చయించేసి హాలెండుకి తిరిగి పోయారు తక్కిన వైద్యులు. ఐక్‌మన్‌కి వారి నిర్ణయం నచ్చలేదు. "ఆ అంటు రోగాన్ని కలిగించే సూక్ష్మ క్రిమిని విడదీస్తా" నని ఐక్‌మన్ జన్మభూమియైన హాలెండుకు వెళ్ళకుండా ఈస్టిండీస్‌లో నిల్చిపోయాడు.

ఆ హాస్పిటలు ఆవరణలో తిరుగుతూండగా పటుత్వములేని మెడలూ, బిగుతులేని రెక్కలూ, వంకరటింకర నడకలతో తీసుకుంటున్న కోళ్ళు కనిపించాయి అతనికి. వాటికీ నంజురోగము పట్టుకుందని నిశ్చయించి వాటి తిండీ, తిప్పలూ, సంగతి కనుక్కున్నాడు. నంజురోగులకు పెట్టిన అన్నము—వారు తినగా మిగిలిపోయినది— వాటికే పెట్టుతున్నారని తెలుసుకున్నాడు. ఆ రోగము వారి యెంగిలి అన్నము ద్వారా కోళ్ళకి పట్టుకున్నదని తీర్మానించుకున్నాడు. ఆ రోగమును కలిగించే సూక్ష్మక్రిమిని వెతకడానికి అతనికి ఈ కోళ్ల ద్వారా మంచి అవకాశము కలిగింది. మనుష్యులతో ప్రయోగాలేమి చేస్తాడు?


ఇంతట్లో ఆ హాస్పిటలు సూపర్నెంటు మారిపోయాడు. కొత్తాయన ఈ కోళ్లకి ఫ్యాక్టరీ బియ్యము కాక చేబియ్యము వండిన అన్నము పెట్టమన్నాడు. ఐక్‌మన్ పరిశోధన తల్లకిందులైంది. "మధ్యలో తిండి మార్చేస్తే ఎలాగ ? నేను వీటిమీద పరిశోధన చేస్తున్నాను. ఇప్పుడు నా ప్రయోగాలు దండగై పోతాయి" అని ఐక్‌మన్ మొరపెట్టాడు. సూపర్నెంటు "వైద్య సంఘంవారు నంజురోగము మనుష్యుల ద్వారా వ్యాపించే అంటురోగమని తీర్మానించారు గదా ? మరి నీ కోళ్ల ప్రయోగాలు ఏమి సాధిస్తాయీ? గవర్నమెంటు డబ్బు దండగ కాదూ ?" అని కఠినంగా సమాధానము చెప్పేడు.

చేసేదిలేక ఐక్‌మన్ వెళ్ళిపోయాడు. మరి నంజురోగ క్రిమి మాట ఏమిటి ? కొన్నాళ్లయిన తర్వాత అలవాటు చొప్పున ఐక్‌మన్ ఆ కోళ్ల దొడ్డి వైపు వెళ్ళాడు.

ఆ కోళ్ళు నంజురోగము పోయి ఆరోగ్యము పొందినట్లు కనిపించాయి. తేడా అల్లా వాటికి చేబియ్యపు అన్నమూ ఏ కొంచెమో తవుడూ పెట్టారు. అంతే. "తవుడున్న అన్నముతో కోలుకున్నాయా" అనుకుంటూ పరిశోధనశాల వైపు వెళ్ళాడు.

వెంటనే జైళ్లనుంచి ఖైదీలకు పెట్టే బియ్యమును గురించీ వారికి వచ్చిన నంజురోగమును గురించీ తబిశీళ్ళు తెప్పించుకున్నాడు. చేబియ్యము—తవుడుతో ఉన్నవి—వాడిన జైళ్లలో నంజురోగము అరుదుగా కపడింది, ఫ్యాక్టరీ బియ్యం తెల్లటి బియ్యం వాడిన చోట్ల బెరిబెరి —నంజురోగము ఎక్కువగా ఉన్నట్లు తేలింది. నంజురోగ క్రిమికి తవుడు విరుగుడు అనుకున్నాడు. వాడినచోటనల్లా చేబియ్యము నంజురోగ నివారణ చేశాయి. తరువాత బి—విటమిను అన్న జీవదాయక పదార్థము తవుడులో ఉన్నదనీ అది సూక్ష్మ ప్రమాణాలలో మన ఆహార పదార్థాలలో లేకపోయినట్లయితే , నంజురోగము వస్తుందనీ తేలింది.

ఫ్రెడరిక్ గౌలెండ్ హాప్‌కిన్సుకి 'ఏ' విటమిను చాలా సులువుగా దొరికిపోయినట్టు కనిపిస్తుంది. ఎలకల్ని పంజరాల్లో పెట్టి, వాటి ఆహారానికి కావలసినంత పిండి పదార్థమూ, మాంసకృత్తులూ, కొవ్వులూ, ఉప్పులూ చేర్చి పెట్టిన ఆహారము పంజరాలలో ఉంచి పరిశీలించాడు హాప్‌కిన్సు. ఆహారములో ఆ నాలుగు పదార్థాలూ ఉన్నాయన్నారు రసాయనికులు. అది కచ్చితంగా నిజమా అని పరిశీలించడానికి హాప్‌కిన్సు వాటిని మాత్రమే కూర్చిపెట్టి పరిశీలించాడు. ఆహారమూ, నీరూ సమృద్ధిగా పెట్టినా ఎలకలు నీరసించాయి. తరవాత పాలు బహు కొద్దిగా—శాంపిలు కోసమే అన్నట్టుగా—ఆ ఆహారముతో కలిపి పెట్టాడు. ఎలకలు కోలుకున్నాయి. హాప్‌కిన్సు వెంటనే ప్రచురించాడు తన పరిశోధనా ఫలితాల్ని : "పాలలో ఆహారపదార్థములు మాత్రమే కాక ప్రాణులకు కావలసిన జీవ పదార్థములు—అతి సూక్ష్మమైతేనేమి—ఉన్నది. అది లేకపోతే ప్రాణి మామూలు ఆహారమును తిన్నప్పటికీ సవ్యంగా పెరగలేదు. ఈ జీవ పదార్థము పాలలోనే కాక ఇతర తిండి పదార్థాలలోను ఉంటుంది" అని. దీన్ని చూడగానే ఐక్‌మన్ తవుడులో కూడా బి విటమిను ఉన్నదనీ, బెరిబెరీ రోగ క్రిమి కాక బి—విటమిను లోపమే కారణమనీ నిశ్చయించాడు. ★



'మీకు అర్థంకాకపోతే వింటూ కూర్చోండి ! నా ఉపన్యాసమంతా పూర్తిగా హిందీలో చెప్పాక, ఇంగ్లీషులో నేనే చెబుతాను ! ఆతర్వాత, తెలుగులో చెబుతాను!!'

సి. ఎన్. చిత్తరంజన్

విలాసంగా విప్లవం

హవానా పట్నం చూడగానే కొన్ని తప్పుటభిప్రాయాలు కలిగే అవకాశం ఉంది; ఎత్తయిన కట్ట



క్యూబా ప్రజలకుగాను భారత దేశం తరఫున శ్రీమతి లక్ష్మీమీనన్, ఇండియాలోని క్యూబా రాయబారి శ్రీ మాన్యుయల్ కు పదివేల రూపాయల విలువచేసే ఔషధాలను ఆమధ్య బహూకరించినప్పటి చిత్రం.

డాలూ; పెద్ద పెద్ద కార్లూ; నైట్ క్లబ్బులూ, బార్లూ; రోడ్లమీద ఆడి పాడేవారూ, పార్కుల్లోనూ, హోటల్ ముంగిళ్ళలో ప్రణయ కలాపాలు జరిపే యువతీ యువకులూ; రోడ్డుమీదనుంచి కనిపించే నీలం-ఆకుపచ్చ సముద్రం - ఇవన్నీ చూసి, 'ఈ దేశంలో జరుగుతున్నది విప్లవమా లేక విలాస కార్యక్రమమా?' అనే అనుమానం కలుగుతుంది! 'ఈ ప్రజలేనా విప్లవకారులు!' అనుకుంటాము. క్యూబాలో అందమయిన ఆడవారి సంఖ్య ఎక్కువేమో, మన అపోహ అధికం అవుతుంది!

అలా సముద్రంవైపు చూశామనుకోండి, దూరంగా గస్తీ కాసే అమెరికన్ యుద్ధ నౌక ఒకటి కనిపిస్తుంది. ఈ దృశ్యం మనకి ఆందోళన కలిగించక మానదు. అమెరికా తొంభయిమైళ్ల దూరంకూడా లేదన్న సంగతి జ్ఞాపకం వస్తుంది. అసలు ఈ ద్వీపంలో నివసించే ఈ సరదా మనుష్యులు అమెరికా ముఠాలవారి దండయాత్రలని ఎలా అరికట్టగలిగారు! ఇంకొక్క దాడిని వీరు తట్టుకోగలరా?

ఒకసారి హవానా పట్నం చుట్టి వస్తే మొదట కలిగిన అభిప్రాయాలన్నీ మాయమయి పోతాయి. వివిధ వృత్తులలో క్యూబన్‌లని కలుసుకుంటే, వారికి విలాస కార్యక్రమాలెంత ఇష్టమో ఒక ఆదర్శనం కోసం నిర్విరామ కృషి చెయ్యటం కూడా అంత ఇష్టమేనని గ్రహించ గలుగుతాము. ఎక్కడికి వెళ్లినా, "మాతృదేశం, లేదా మరణం; గెలుపు మనదే!" అనే నినాదం వినిపిస్తుంది. కొంతసేపు తర్వాత ఇది వట్టి నినాదం మాత్రమేకాదనీ, ఇంచుమించు 7 కోట్లమంది దృఢ సంకల్పాన్ని నిరూపించే గాఢవిశ్వాస ప్రకటన అనీ తెలుసుకోగలుగుతాము.

క్యూబన్ విప్లవ ఫలితాలు రాష్ట్రాలలో కనిపించినంతగా రాజధానిలో కనిపించవనిపిస్తుంది. కాని, హవానా పట్నం తిరిగి చూస్తే ప్రజా సామాన్యంకోసం ప్రభుత్వం చేసే కృషికి నిదర్శనలు కనిపిస్తాయి. సముద్రంతీరం వెంబడే చవకగా లభించే విశ్రాంతి గృహాలు ఎన్నో ఉన్నాయి. ఆరు సంవత్సరాల క్రితం సామాన్య జనానికి ఇటువంటివి అందుబాటులో ఉండేవి కానేకావు. బాతిస్తా రాజ్యంలో ధనవంతులకీ, అధికారులకీ మాత్రమే కేటాయించబడ్డ 'బీచ్' లు ఉండేవి.

బాతిస్తా 'హెడ్ క్వార్టర్స్'ని విప్లవ ప్రభుత్వం పాఠశాలలుగా మార్చివేసింది. [దీనిని ఇప్పుడు ఫ్రీడం 'సిటీ' (స్వేచ్ఛా నగరం!) అని పిలుస్తారు.] ఆఫీసర్ల భవంతులు ఉపాధ్యాయుల ఇళ్లుగా మారిపోయాయి.

సముద్రతీరంలో సంస్కరణలు విప్లవం తర్వాత జనసామాన్యం జీవితంలో ఏర్పడ్డ పరిణామాలకి నిదర్శనలు. కాని, కొత్త ప్రభుత్వం చేసిన నిజమైన మార్పుల ప్రాముఖ్యత, విద్యా సంస్థలు తెలుపుతాయి. 1961 లో ఫీడెల్ కాస్ట్రో తన దేశంలో నిరక్షరాస్యతని ఒక ఏడాదిలో నిర్మూలిస్తానని చెప్పినప్పుడు మిగతా ప్రపంచం ఆశ్చర్యపోయింది. అప్పటికి క్యూబాలో 80 లక్షల మందికి చదువనూ, వ్రాయనూ రాదు కాని ఎనిమిది నెలల లోపల విద్యార్థులూ, కార్మికులూ తండోప తండాలుగా దేశం అంతర్భాగాలలోనికి చొచ్చుకుని పోయి ఈ సంఖ్యని 20 లక్షలకి తగ్గించేశారు.

ప్రభుత్వం వేయించిన ముందడుగు ఇదొక్కటేకాదు. కర్మాగారాలలో, పొలాలలో, 'పాఠశాలలు' నెలకొల్పారు. విద్యాభ్యాసం సక్రమంగా జరిగినప్పుడే సోషలిజం పెంపొందగలదని దృఢంగా నమ్ముతున్న ప్రజలు ఉత్సాహంతో ఈ ఉద్యమంలో పాల్గొంటున్నారు. మొత్తం 19,000 చిల్లర ఉపాధ్యాయులలో సుమారు 7,000 మంది ఈ రకం 'స్కూళ్ల'కి చెందినవారే.....

ఉద్యోగాలుచేసే స్త్రీల పిల్లలని చూసే కేంద్రాలు ఎన్నో స్థాపించబడ్డాయి. ప్రతి ఫ్యాక్టరీకి,

---

శ్రీ సి. ఎన్. చిత్తరంజన్ న్యూఢిల్లీ నుంచి వెలువడే 'మెయిన్ స్ట్రీమ్' వారపత్రిక సంపాదకులలో ఒకరు. ఇటీవలే 19 రోజులు క్యూబాలో గడిపి వచ్చారు. ఈ వ్యాసం వారి అనుభవాల ఆధారంగా వ్రాసినది.

ప్రతి పొలానికీ ఒక శిశు కేంద్రం ఉండాలని వీరి ఆశయం. ఒక శిశువుకి తల్లి జీతంలో 10% పుచ్చుకుంటారు; పిల్లలు ఎక్కువయిన కొద్దీ శాతం తగ్గుతుంది. ఈ శిశు కేంద్రాలలో పిల్లల ఆహార విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. ఆటలలో కూడా మంచి ప్రోత్సాహం ఇస్తారు. విద్య సంగతి చెప్పనే అక్కరలేదు.

విద్యాభ్యాసం అన్ని తరగతులలోనూ, అన్ని స్థాయిలలోనూ ఉచితం. సాంకేతిక విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపబడటంలో ఆశ్చర్యపడవలసిన దేదీలేదు కాని లలిత కళల విషయంలో అశ్రద్ధ మాత్రంలేదు. లలిత కళాశాలకి కొత్త భవనాలు కూడా త్వరలో లభించవచ్చు.


2

క్యూబాకీ భారత దేశానికీ చాలా పోలికలు ఉన్నాయి. హవానాలో విమానం దిగుతూ ఉంటే కేరళ గుర్తుకు వస్తుంది; కొబ్బరి చెట్లూ, సెల యేర్లూ, సముద్రమూ సుపరిచితంగా కనిపిస్తాయి. ఇక రాజధాని వీధుల వెంబడి నడచి పోతూఉంటే గుంపు తక్కువే అయినా బొంబాయి జ్ఞాపకం వస్తుంది.

దేశం మాత్రమే కాదు, ప్రజలలో కూడా మనవారిని పోలేవారు ఎందరో ఉంటారు. నల్లటి దక్షిణ భారతీయుడినుంచి ఎర్రటి కాశ్మీర దేశస్థుడి రంగు కలవారందరూ కనిపిస్తారు. మన దేశంలోవలెనే వర్ణభేదం బాగా తెలిసే జంటలు చూడవచ్చు. క్యూబన్‌లు చాలా వేగంగా మాట్లాడుతారుట.

క్యూబన్‌లకి తమ ఆఫ్రికన్ పుట్టు పూర్వోత్తరాలంటే చాలా అభిమానం. విప్లవం రాకముందు నల్లటి వారికి, నీగ్రో పోలికలు ఉన్నవారికీ మంచి ఉద్యోగాలు దొరికేవి కావుట. ఇదంతా అమెరికా దక్షిణ ప్రాంతాలవారి అలవాట్ల ప్రభావం అయి ఉండాలి. నేడు ఈ ఎక్కువ తక్కువ భావాలు నశించాయని చెప్పవచ్చు. నేను అక్కడ గడిపిన 19 రోజుల్లో ఎవరూ తను క్యూబన్ దేశస్థుడనే భావం తప్ప ఏదీ చూపినట్లు కనిపించలేదు.

నేను క్యూబా చేరేముందు అనుకున్నాను— 'విప్లవం మంచిదే, అమెరికాని ఎదిరించటం గొప్ప



కాస్ట్రో

సాహసమే. కాని విప్లవ ప్రభుత్వం ఎటువంటిది? నాకు కొన్ని ప్రదర్శనార్హమయిన దృశ్యాలు మాత్రం చూపించి పంపేస్తారా? ప్రస్తుత ప్రభుత్వాన్ని విమర్శించే వ్యక్తులు తారసిల్లే అవకాశం ఉంటుందా?' నా సందేహాలు నిరాధారాలని త్వరలో గ్రహించాను. కార్యక్రమంలో చిన్న ఆలస్యం జరగటంవల్ల ఒక వారం నన్ను నాకే వదిలివేశారు. ఆవారం నా ఇష్టం వచ్చినట్లు తిరిగాను. వీలున్నప్పుడెల్లా ఇళ్లలోకి వెళ్లి నాకు తోచిన ప్రశ్నలన్నీ వేశాను. అందరూ నాతో బాగా సహకరించారు. ఇంగ్లీషు బాగా రాకపోయినప్పటికీ సాధ్యమయినంత తోడ్పడ్డారు. ఆహార వస్తువులు కొన్నిటిలో కొరత ఉందని ఒప్పుకున్నారు చాలా మంది. తగినంత తిండి దొరకటం లేదనికాదు కాని గుడ్లూ, కాయకూరలూ బాగా లభించటం

లేదన్నారు. అయినా రెండు మూడు సంవత్సరాలలో అంతా సరిదిద్దుకో గలదనే నమ్మకం వారికి ఉంది.

జనాభా లెక్కల ప్రకారం రోమన్ కాథొలిక్‌లే ఎక్కువ. వీరికి దైవభక్తి, భీతి కూడా ఎక్కువే ననిపిస్తుంది. చర్చిలు చాలా ఉన్నాయి. ప్రతి ఇంటిలోనూ దేవుడికి సంబంధించిన బొమ్మలు ఎన్నో కనిపిస్తాయి.

క్యూబన్‌లలో వివేకవంతులందరికీ విప్లవం సంగతి బాగా తెలుసు. అమెరికన్ విధానాలు తమ ఆర్థిక స్థితికి ఎలా హాని కలిగించాయో గ్రహించే శక్తి వారికి ఉంది. తమ ప్రభుత్వం ఈ హాని ఫలితాలని నిర్మూలించాలని చేసే ప్రయత్నాలు వారికి అర్థం అవుతాయి. ప్రభుత్వం చేసిన పొరపాట్లు కూడా వారికి తెలియక కాదు— వాటిని బహిరంగంగా చర్చిస్తారు. అధికారులూ అంతే! తమ తప్పులని వెంటనే ఒప్పుకుంటారు. మొదటి రోజుల్లో సామ్రాజ్యవాదులమీద కోపం చెరుకు పొలంమీద చూపించటం తెలివి తక్కువేనని అంగీకరిస్తారు. విప్లవం తర్వాత చక్కెర ఉత్పత్తి సగానికి సగం పైగా పడిపోయింది. పంచదార పరిశ్రమలో కార్మికులని తక్కిన పరిశ్రమలలోకి బదిలీ చేశారు. కొందరిని సైన్యంలో చేర్చారు. అందు చేత, ప్రభుత్వం 'వాలంటీర్లు' కావాలని ప్రకటించింది. వేలకు వేలు వాలంటీర్లు వచ్చారు. చక్కెర పరిశ్రమ కోలుకుంది.

అసలు ఈ వాలంటీర్ల పద్ధతి క్యూబన్ కార్మికుల దేశ భక్తికి నిదర్శనం. ప్రతి పరిశ్రమలోనూ ఔత్సాహికుల కృషి చక్కటి ఫలితాలని ఇస్తూ ఉంది. దానికి కారణం మరొకటి కూడా ఉందేమో! కార్మికుల పరిస్థితులు బాగా బాగుపడటంచేత వారూ తగిన ఉత్సాహం చూపుతున్నారేమో! నిరుద్యోగ సమస్య అనేది క్యూబాలోలేదు. కనీస వేతనం 85 పెసోలు. (మన ద్రవ్యంతో అక్కడి ధరలు దృష్టిలో ఉంచుకుని పోలిస్తే ఇది ఢిల్లీలో 125 రూపాయలకి సమానం.) అంతేకాదు. విద్యాభ్యాసం ఉచితం, వైద్య చికిత్స చాలావరకు ఉచితం, కర్మాగారాలలో చవక మధ్యాహ్న భోజనాలు ఇప్పిస్తారు. ఇళ్ల వేతనంలో 10 శాతానికి దొరకటమేకాక, అద్దెకి ఇంటి పరిమాణాలకీ సంబంధం ఉండదు— కుటుంబంలో వ్యక్తుల సంఖ్యమీద ఆధారపడి ఉంటుంది! అన్యాయంగా అద్దెలు పుచ్చుకునే వారిని వెతికి అద్దెలు తగ్గించింది ప్రభుత్వం. అందుకనే, ప్రజలు తమ ప్రభుత్వం పట్ల ఎంతో అభిమానం చూపుతారు. శత్రువుల ప్రయత్నాలని ధైర్యంగా ఎదుర్కొన్నారు. కాస్ట్రో ఉద్ఘాటనలకి ఎప్పుడూ మంచి సంచలనమే కలుగుతుంది.

ఒక చిన్న ఉదాహరణ: కాస్ట్రో, సామ్రాజ్యవాదుల ప్రయత్నాలను అరికట్టేందుకని దేశమంతటా విప్లవ సంరక్షణ సంఘాలని ఏర్పరచాడు. ఇవి బ్లాక్‌మార్కెట్ సమస్యల పరిష్కారానికి కూడా తోడ్పడ్డాయి. ఇంకా ఇతర సాంఘిక సమస్యల పరిష్కారంపట్ల శ్రద్ధ చూపుతూ ఉంటాయి.

నేడు ఈ సంఘాలలో సభ్యుల సంఖ్య 20 లక్షల దాకా ఉండవచ్చుకాని వీరిలో 15,000 మంది మాత్రమే జీతగాళ్లు! (1962 లో పోలియో వాక్సిన్ మందు మాత్రలు పిల్లలకి ఇవ్వవలసి

45 వ పేజీ చూడండి



సాయుధులయిన ఈ వాలంటీర్లు స్కూలు టీచర్లు కూడా!

సంపెంగలూ నన్నజాజులూ



అవసరాల రామకృష్ణారావు

జరిగిన కథ

మంజుల వివాహకారణంగా, ఆర్థిక అవసరాల దృష్ట్యా కొడుకుని కట్నం తీసుకొని పెళ్ళి చేసుకోమంటాడు తండ్రి, మొదట నిరాకరించినా చెల్లెలి పైగల ప్రేమలో తర్వాత సరే నంటాడు. తర్వాత మంజుల వివాహ మవుతుంది. ఆరేళ్ళు గడిచాయి. మంజు యిాలోగా బియ్యే పట్టాతోబాటు పాలుగారే మధురిమను కూడా పొందింది. భర్తతో కాశీ వెళ్ళి ఎం. ఏ. పరీక్షలు బాగా రాశానన్న తృప్తితో తిరిగివస్తూ అన్నయ్య సంసారం ఆందోళనకరంగా ఉండటం గమనిస్తుంది భర్త పరీక్ష పాస్ కాలేకపోయినందుకు బాధపడుతుంది మంజు వాళ్ళ సంసారంలో అపార్థాలు చెలరేగి పుల్లీ విరుచుకుంటాయి. ఎం ఏ. ఫైనల్‌కి వెళ్ళాలని ఉబలాటపడుతున్న మంజుకు ఆశాభంగం కలిగేలా ప్రవర్తిస్తాడామె భర్త చివరికెలాగైతేనేం ఎమ్మే పాసైనా ఉద్యోగం చెయ్యననే షరతుపై భర్తని ఒప్పిస్తుంది. కంచరలో కుంటువడ్డ నారాయణ నిర్మలల సంసారాన్ని ఒకదారికి తెస్తుంది మంజు మంజు, మధుర కలసి పరీక్షలకు కాశీ వెళతారు. అక్కడ మధుర కేశవరావుల స్నేహాన్ని అనుమానిస్తుంది మంజుల. తమ స్నేహంలోని పవిత్రతను వ్యక్తం చేస్తుంది మధుర. మంజు అన్నయ్య ప్రసాదరావు కుటుంబం అల్లకల్లోలమవుతుంది. అతను వ్యాధిగ్రస్తుడవుతారు చేస్తున్న ఉద్యోగాన్ని, ఆదర్శం పేరుతో చేజేతులా పోగొట్టుకొనే స్థితికి వస్తాడు. తన హారాన్ని అమ్మి అన్నయ్య ఋణ భారాన్ని తగ్గిస్తుంది, మంజుల.

13

దూరం నుంచే నన్ను చూసి పరిగెత్తుకు వచ్చింది. మధురిమ. పిల్లను ఆప్యాయంగా దగ్గిరకు తీసుకుని ముద్దెట్టుకున్నాను.

'ఇన్నాళ్ళుండి పోయావేమే అమ్మా. ఇంకెప్పుడూ యిలాచెయ్యకే అమ్మా' అంటుంటే నా హృదయం ద్రవించింది. లోపల్నుంచి కామేశ్వరి వచ్చింది. 'వచ్చావుటమ్మా తల్లీ మంజులా! అక్కడే ఉండి పోయావేమో అనుకున్నాంలే, ఇప్పటికైనాయిల్లు జ్ఞాపకానికి వచ్చిందా? నీలాగే నీకూతురుకూడా సామాన్యరాలు కాదమ్మోయ్. వెర్రిపిల్ల దీన్ని సాకడం యిదో కష్టమా అనుకున్నాను, జెర్రి పిల్లగాని వెర్రిపిల్ల కాదమ్మోయ్. నన్ను మూడు చెరువుల నీళ్ళు తాగించింది. వేరే విడిశైదు అక్కర్లేదు తల్లోయ్' గుమ్మంలోకి రాగానే ఏమిటీ సోద అనుకున్నాను.

'మధూ, నాన్నారు ఏరే?'

'ఆఫీసుకి వెళ్ళారే.... అవును గాని అమ్మా, కాశీ నుంచి నాకేంతెచ్చావే?' ముందుగా రసగుల్లా డబ్బాలు యిచ్చాను. తర్వాత గౌన్లూ, జోళ్ళు తీశాను. అవన్నీ చూస్తూంటే దానిలో కలిగిన ఆనందాన్ని తనివి తీరా చూస్తున్నాను.

'వచ్చావా అక్కా?' తలెత్తి చూశాను. సరళ!

'ఆఁ నువ్వెప్పుడొచ్చావ్? నాన్నగారి ఒంట్లో కొంచెం నెమ్మదిగా ఉందా?'

'ఇప్పుడు కాస్తనయమే. క్రిందటి ఆదివారం నాడు కాబోలు నేను వచ్చాను. మీారేం అలా చిక్కి నల్లబడిపోయారు, చదువు వేడే ?'

దీనికి నేను కాదు, కామేశ్వరి జవాబు చెప్పింది.

'ఒక్క చదువైతే బాగానే ఉణ్ణు. వూళ్ళో ఉన్న సొదలన్నీ మా మంజులకే, ఇంక ఆ వెర్రిలో పడితే యిల్లూ వాకిలీ ఏమైపోయినా, మొగుడూ సంసారం పట్టేట్లో కలిసినా ఆవిడకి లక్ష్యం ఉండదు. మొత్తమ్మీద ఆవిడ గుండె నిబ్బరం మెచ్చుకోదగ్గది. ఇంతకీ ఒక్కొక్కళ్ళకీ ఆడింది ఆటా పాడింది పాటా అవుతూంటుంది అది వాళ్ల అదృష్టంలెండి!' నాకు అత్తగారి సాధింపు లేదు, ఆడబిడ్డ పోరు లేదు, ఆయన కూడా పల్లెత్తు మాట అనరు. మధ్యని ఈవిడెవర్తి? తల్చుకుంటే ఆవిడకు జవాబు చెప్పే స్థితిలో నేను లేకపోలేదు గాని వస్తూనే ఇంకా అల్లరి పెంచుకోడం నాకు అశుభంగా తోచింది.

'ఎవరేమనుకున్నా సరే, నేను అదృష్టవంతురాల్నే' అనేసి మధురిమను ఆ చంక నుండి ఈ చంకకు మార్చుకుని విసురుగా లోపలికి వెళ్లిపోయాను.

'చూశావా, చూశావా ..' అని ఆమె యింకా ఏవేవో సరళతో చెప్పబోతే,

'వస్తానండీ, పనుందీ' అని ఆ అమ్మాయి దాటుకుంది. అప్పుడు కామేశ్వరి దాసీమనిషిని కేకేసి

'విన్నావుటే రంగీ, యిప్పుడు నేనేమన్నాననీ' అని దాని చెయ్యి పట్టుకుని కూచోపెట్టి మొదలెట్టబోయింది.

'ఉండండొమ్మగోరూ ! ఆరెప్పుడనగా బయలెల్లినారో ఏటో. ఈ యిసురు ఎప్పుడూ యిన్నదేగా' అని చెయ్యి విదిలించుకుని పెరట్లోకి వచ్చి నాకు నీళ్ళు కాగబెడుతూ కూచుంది,

కామేశ్వరి కింక ఎవరూ కనబడలేదు కరివేపాకు అమ్ముకునే మనిషిని కేకేసింది,

'విన్నావుటమ్మా తలుపు లమ్మా ఈ విడ్డూరం? తనేమో వూరూ వాడా తిరిగొస్తుందీ, అదేమీ అనడానికి వల్లకాదు ? ఇదెక్కడి రాక్షస్తనమే ! ఇంతకీ నా కెందుకు యీ నిష్ఠూరాలు ? ఎక్కడుంచవలసిన వాళ్లని అక్కడుంచకపోతే ముందు ముందు వాడే అనుభవిస్తాడు. అవతల మా అమ్మ పుట్టెడు రోగంలో ఉన్నా పుట్టపు చూపు కదా అని వచ్చాను. అయినా ఏమిటో నా వెర్రి గాని, మోకాట్లో మెడ నరం పట్టిందని, దాని కెందుకుంటుందీ ? ఇంత గుంట ముండకి అన్ని సామాన్లు తెచ్చిందే, పోనీ నేను తనలాంటి ఆడపడుచును కానూ, వచ్చేది కాశీ నుంచి కద, ఒక్క బనారసు చీర, అధమపక్షం ఒక్క వీశెడు బనారసు కాజా తెచ్చి నా కివ్వాలంటావా, వద్దంటావా, తలుపు లమ్మా, నువ్వే చెప్పు'

'అమ్మా, కామేసారమ్మగారూ, నేనే పో పెస్నె అడుగుతాను తవరే సెప్పండి నన్ను అమ్ముకోమంటారా, సెంగేసుకుని యిక్కడ తొంగోమంటారా ?'

'పోసి రాకాసీ ఎంత మాటాడేవే ? పోతావా పోవా' అని దాన్ని వెంటబెట్టింది. హాల్లోకి వచ్చి అక్కడున్న ఆయన ఫోటో దగ్గిర కుంచుంది. అపజయం ఎరుగని కామేశ్వరి.

'ఒరే తమ్ముడూ, ఎవర్నో అనుకోడం దేనికి ? ఈ తప్పంతా నీది. ఆడ కూతురికి అంత స్వేచ్ఛేమిటిరా ? నిన్ను మించిన చదువేమిటిరా ? ఎంత తెగించింది కాకపోతే గుమ్మంలోనే నన్ను ఎదిరిస్తుందా ? తను లేకపోతే తనింట్లో వండిపెట్టడానికీ, తన పిల్లను ఆడించడానికీ నేను పనికొచ్చానా ? అదేమ అనడానికి పనికిరానూ ? దేశానికి వచ్చి కూడా అన్నగారింట్లో వారంరోజులు తిష్ట వేస్తుందా ? అడగడానికి వల్లగాదూ ?'

వినీ విననట్లు వూరుకున్నా నా చెవిలో పడుతూనే ఉన్నాయి.

'అమ్మా, అత్త రోజూ యిదిగో యిదీ వరస. సాధారణంగా హొటల్‌నుంచే తెప్పించేసేది. ఒకవేళ యింట్లో చేసినా ఏం బాగా వండేది కాదు. బాగులేదనడానికి వల్లకాదు. తినకుండా వూరుకోడానికీ వల్లకాదు. ఏం మీ అమ్మ చేసినట్లు లేదూ? చాకిరీకి తప్ప నేను పనికిరానూ ? అని మొదలెట్టేది. నాన్నతో చెప్పి కొట్టించేది కూడా. నువ్వెప్పుడొస్తావో అని బెంగెట్టుకున్నానే అమ్మా!' నేను దాన్ని దగ్గిరగా తీసుకుని,

'తప్పమ్మా, అలా ఒకచోట మాటలు మరోచోట చెప్పకూడదు. పైకి అలా అంటుంది గాని అత్త ఎంతో మంచిది' అనబోతే,

'ఏం మంచి నా మొహం మంచి' అనేసింది.

'అదిగో అలా అనొద్దనే చెబుతూంట. ఎలాగోలా ఇన్నాళ్ళూ ఉండి నీకు చేసిందిగా .... అయినా యిప్పుడు నే వొచ్చేశాగా' అని నేను అంటూంటే

వీధిలో లాం(బెట్టా ఆగిన చప్పుడయింది. మధు రిమ వీధిలోకి పరిగెత్తింది.

'నాన్నా, నాన్నా, మనమ్మొచ్చేసింది, మనమ్మొచ్చే సింది' అంటూ ఎదురెళ్ళింది. ఆయన దాన్ని ఎత్తుకుని తీసుకువస్తూ,

'మనమ్మ ఎవరే ?' అన్నారు.

'అప్పుడే వచ్చేశావేం, దారి తప్పలేదు గద ?' అన్నారు నవ్వుతూ. నవ్వుతూంటే ఆయన బుగ్గలు పైకిలేచి అసలే చిన్నవిగా ఉన్న కళ్ళని మరింత మూసే స్తాయి. ఆ పరిస్థితుల్లో ఆయన కనురెప్పలే కను బొమ్మలే నవ్వుతున్నట్టు నాకు కనిపిస్తుంది. సూర్యోదయ పూర్వ సుందరాకాశరాగం లాంటి ఆ దృశ్యం నాకు చాలా యిష్టం. ఆయన్ని చూసి ఎన్నేళ్ళో అయిపోయినట్టుంది నాకు. ఆయన అలా నవ్వుతూ అడుగుతూంటే నేను పడిన మాన సిక (శమంతా క్షణంలో ఎగిరిపోయిన ట్లయింది.

'ఎలా రాశావ్ పరీక్షలు ? అనుకున్నవన్నీ వచ్చాయా ?'

'ఆఁ బాగానే రాశాను. వెంటనే రాలేకపోయాను. కోపమేం రాలేదుగద ? అన్నయ్య ఒంట్లో ఏం బాగులేదండి.'

'అయ్యో, అదేం పాపం ? ఏం జబ్బు ?' వివరాలు చెప్పేను.

'అయినా మందు పుచ్చుకోక పోడం ఏమిటీ ? తెలివితక్కువ మనిషి'.

'అంతేకాదు, ఉద్యోగం విషయంలో కూడా ఘర్షణ పడ్డాడు.'

ఆ వివరాలు కూడా చెప్పేను.

ఇతడే తొందరపడ్డాడేమోనని నా అభి(పాయం. ఏ ఎండకా గొడుగు పట్టవలసినరోజు లివి. అనవ సరంగా నోరు జార్చుకుంటే కలసివచ్చే దేముంది? పోనీ జరిగిందేదో జరిగింది. అంత ధైర్యమైన మనిషి దానికోసం మనసు పాడుచేసుకు కూచుం టాడా ? తగినట్లు ధైర్యం చెప్పి రాకపోయావా ?

'ఊరుకున్నానా మరి ? అన్నీ చేసే వచ్చాను! ఏమయినా మళ్ళీ వాడు బతుకులో పడే వరకూ నాకు బెంగగానే వుంటుందండీ. ఒకవారంరోజులు పోయాక మళ్ళీ వెళ్ళి ఒకటి రెండురోజులుండి వస్తాను, పంపించరూ ?'

ఇంట్లో వినేవాళ్ళు లేరని పక్కింటికి పని గట్టుకు వెళ్ళిన కామేశ్వరి అప్పుడే తిరిగొచ్చింది. తిరిగొస్తూ అందుకుంది.

'ఎందుకు పంపడూ ? పంపనూ పంపుతాడు. ఎదురుగుండా ఏమీ అనలేక, వెనకాల బాధ పడనూ పడతాడు. ఇంతకీ అస్తమానూ పుట్టిం టికి బయలుదేరే వాళ్ళకి ఉండాలి ఆ యింగిత జ్ఞానం !'

నే నింక భరించలేకపోయాను. అడిగింది ఆయన్ని, ఈవిడ కెందుకూ ?

'కామేశ్వరి వదినా, ఆడది అవసరం వచ్చి నప్పుడు కూడా పుట్టింటికి వెళ్ళడం తప్పంటారా?'

'తప్పొ, తప్పున్నరా !'

'అది ఎవరైనా, ఎందుకైనా తప్పేనా ?'

'ఆహా !'

'అయితే మీ రిప్పుడు ఎక్కడున్నారు ? ఎందు కున్నారు ?' ఆయన నావైపు కొంచెం కోపంగా చూసి గబగబ మేడమీదకి వెళ్ళిపోయారు. కామేశ్వరికి వెంటనే బోధపడినట్టు లేదు. బోధపడగానే మాత్రం యిల్లెగరగొట్టేసింది.

'ఏ—మి—టీ, నేను నా పుట్టింటి కెందు కొచ్చానని అడుగుతున్నావా, ఎంత ధైర్యమే నీకు! బంగారంలాంటి ఈ యిల్లూ, నీ పుట్టింటూరి ఆ దరి(దపు కొంపా రెండూ ఒకటే ? అదిగాక ఇది



రాణి - వాణి సంభాషణ

రాణి —రాబోయే వేసవికి మేమంతా ఊటీకి వెళ్ళదలచినాము.

వాణి —యేం ? ఎందుకు?

రాణి:—యెలా భరించటం విపరీతమైన యెండలకు నాకు పిల్లలకు చర్మం పెట్లుతుంది. చమట గుల్లలు బాధ భరించలేకుండా వున్నాము.

వాణి.—యిక ఈ వేసవి బాధలకు భయపడనక్కర లేదు. ఊటీకి, బెంగుళూరికిపోయి డబ్బు ఖర్చు పెట్టవలసిన పనిలేదు. విజయా కెమికల్స్ మద్రాసువారి నూతనముగా తయారైన అశోకా శాండల్ పౌడర్సు 3 విధములుగా వున్నవి. వాటిని క్రమముగా ఉపయోగించిన ఈ చమటగుల్లలు (Prickly heat, Chaffing etc.) చర్మము పెట్లుట వీటిని దగ్గరికి రానివ్వదు మరియు చర్మము చల్లగా మృదువుగా వుంచును. యీ పౌడర్లు మైసూరు చందనముతో తయారైనవి.

రాణి·—అలాగా!

వాణి —ఔను పోయిన వేసవిలో మా కుటుంబమంతా ఈ పౌడర్సునే వుపయోగించి చాలా మేలు పొందినాము.-యెచ్చటికి వెళ్ళలేదు. చాలా డబ్బు ఆదా అయినది.

రాణి —అలాగయితే నేను కూడా మా శ్రీవారికి చెప్పి, తెప్పించుకుంటాను వీటి పేర్లు చెప్పు.

వాణి.—చెపుతా విను. (1) అశోకా శాండల్‌వుడ్ ఆల్‌పర్పస్ పౌడరు స్నానానంతరము శరీరమంతా చల్లుకోవచ్చును. (2) అశోకా శాండల్‌వుడ్ టాల్కం పౌడరు. ఇది టాయిలెట్‌గా వుపయోగించునది. (3) అశోకా శాండల్‌వుడ్ పేస్ పౌడరు (ఫ్యాన్సీ ప్లాస్టిక్ డబ్బాలో) దీనివి వానిటీ బ్యాగ్‌లో వుంచుకొని అప్పుడప్పుడు ముఖమునకు అద్దుకొనుటకు చాలా మంచిది.

విజయా కెమికల్స్, మద్రాసు - 7.

రచయితలకు విజ్ఞప్తి

తమ రచనలతో కాక విడిగా స్టాంపులు పంపే వారి రచనలు తిప్పి పంపడం సాధ్యం కాదు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే అవకాశం కూడా లేదని గుర్తించ ప్రార్థన

సం॥

నిజంగా నా పుట్టిల్లు విందు కరువుందీ ? మేడ్రాసు లాంటి వూళ్ళో సేతువులాంటి యిల్లు నాకుందే! మేరువులాంటి తల్లి నా కుందే ! ఏదో పనిమీద ఈ ప్రాంతానికి వచ్చాను. పోనీ ఉండమన్నాడు గదా అని గడిపి పెట్టేను. దిక్కులేనిదాన్ని కాదే! గతి కడుక్కుపోయి రాలేదే ! మంచిమాట లేక పోతే పోయిరి— నన్నిలా అవమాన పరుస్తుందా ? ఇదంతా చూసి వాడు కూడా వూరుకుంటాడా ? ఛీ .... యీ దరిద్రపు కొంపలో యిక క్షణ ముండను.'

కామేశ్వరి క్షణంలో తన సామాను సద్దేసుకుంది. నేను బతిమాలినకొద్దీ రెచ్చిపోయింది. రిక్షావాణ్ణి కేకేసి సామాన్లు అందులో పెట్టింది. నాకు ఏమీ తోచలేదు.

'ఏమండీ మీ కామేశ్వరక్క వెళ్ళిపోతున్నారు. ఒక్కసారి దిగిరండి' అని క్రిందనుంచి కేకేశాను. ఆయన పలకలేదు.

'పోతున్నదానిని పోనిద్దూ, శని వదిలిపోతుంది' అంటున్న మధురిమ నోరు నొక్కి నాలు గంగల్లో నేను మేడెక్కేను.

'ఏమండీ, మీ అక్కయ్య వెళ్ళిపోతున్నారు. సామాన్లు కూడా రిక్షాలో పెట్టించేశారు. మీరు ఉండమని చెబుతే ఉంటారు—రండి.'

ఆయన మాటాడలేదు. ఇటు తిరగలేదు. అటు వైపు తిరిగి నుంచుని సిగరెట్టు కాలుస్తున్నారు. నేనే ఆయన ఎదురుగా వెళ్ళేను.

'మాటాడ రెందుచేత ? ఎలాంటిదయినా ఆవిడకూ మనకూ తప్పే సంబంధం కాదిది. నే నొచ్చిన రోజునే ఆవిడ వెళ్ళిపోతే నలుగురూ ఏమనుకుంటారో ? ఇంతవరకు వస్తుందని నాకు తెలీదు. లేకపోతే నేను ఆమాటయినా ఆడి ఉండే దాన్ని కాదు. రిక్షా కూడా కదులుతున్నట్టుంది. ఇక్కణ్ణుంచి మీరు ఒక్క కేకేస్తే ఆవిడ ఆగి పోతుంది. మాటాడరేం ?'

'ఏం మాటాడను ? చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ఏం లాభం ? ఈ జ్ఞానం నీకు ముందే ఉండవలసింది. ఇప్పుడు ఏమనుకున్నా కలసివచ్చే దేముంది ?'

'మీరు రాకముందు నుంచీ నన్నావిడ దుమ్మెత్తి పోస్తోంది. మీరు వచ్చాక కూడా అనవసరంగా కల్పించుకుని ఏవేవో అనబోయింది.'

'ఆవిడ నోటి దూకుడు మనిషని ఎవరికీ తెలీదు ? వూరుకుంటే తీరిపోదూ ? పది మాటకు ఒక్కమాట సరిపోయేలా మన పాండిత్యం అంతా ఆమె ముందు ఒలకబొయ్యాలా ? మనం చదువు కున్నామని నలుగురికీ మనమే చాటుకోవాలా ?'

లేదు. ఇటువంటి జవాబు నేను ఆశించ లేదు. ఇలాంటి దెప్పి పొడుపులు సహించే శక్తి కూడా నాకిక లేదు. నేను వెనుదిరిగి వచ్చేయ బోయాను. ఆయన పిలిచారు. నేను వినిపించుకో లేదు. గబగబ మేడ మెట్లు దిగి వెళ్ళిపోబోతుంటే దారిలో మెట్లమీద నా చేతులు పట్టుకు ఆపేశారు.

'మంజూ, అంత కోపం దేనికి ? నే నేమన్నా నని ?' నా కంట్లో ముత్యాల్లా నీటిబిందువులు నిలిచాయి. ఆయన నా గెడ్డం పట్టుకు పైకెత్తేరు.

'మా కామేశ్వరక్కను నువ్వు వెళ్ళగొట్టేశావని నేను అనుకుంటున్నానేమో అని బాధపడుతున్నావా?

సంపెంగలూ సన్నజాజులూ

అదేంలేదు. ఒక విధంగా అది వెళ్ళిపోడమే మంచిది, ఇల్లు చల్లగా ఉంటుంది !'

నేనేం మాటాడలేదు.

'ఈ పదిహేను రోజులూ ఎలా గడిపానో తెలీదు. నువ్వు మన ప్రాంతాలకి వచ్చి కూడా అక్కడ ఆగిపోయావని తెలిసి మరింత బాధ పడ్డాను. నిన్నొకసారి చూడగానే ఆ బాధంతా మాయమైపోయింది. నీ చక్కటి కాఫీ కోసం ఇంకా ఎన్నాళ్ళని ఎదురుచూడమంటావా ? ఏది చెప్పని ....'

'ఆగండి' నేను క్రిందికి చూపించాను.

'మీ రిద్దరూ యిక్కడ ఏం చేస్తున్నారూ ? మీకోసం యిల్లంతా వెతుకుతున్నాను. ఇక్కడ ఉన్నారూ ?' అంటూ మా మధురిమ వచ్చిరా

సంపెంగలూ సన్నజాజులూ

బొమ్మను ఎత్తుకుని పైకి వస్తోంది. చిట్టడవిలా ఉన్న యింటిని సర్దడానికి ప్రయత్నిదామని నేను క్రిందకి దిగేను.

ఆ మూడోరోజు మధ్యాహ్నం సరళ నాకోసం వచ్చింది.


'మీకు యిబ్బంది లేకపోతే ఆ ఇరవై రూపాయిలూ అడిగి రమ్మన్నారు' అంటూ. నాకేం బోధపడలేదు, వాళ్ల దగ్గర యిరవై పుచ్చుకో వలసినంత అవసరం ఆయన కేమొచ్చిందో నాకు అర్థమవలేదు. నిజానికి నాదగ్గరప్పుడు పది హేను రూపాయిలూ కొంత చిల్లరా తప్ప ఏంలేదు. అందులో పది రూపాయలు యిచ్చాను. మిగిలింది ఆయనని అడుగుతానని. ఉండబట్టలేక ఆయ నెప్పుడు పుచ్చుకున్నారని అడిగాను.


'ముందే బావగారు ఖర్చు మనిషి తరువాత కామేశ్వరి లాంటిది వచ్చి కూచుందాయె. ఇక అప్పులకు బయల్దేరడంలో ఆశ్చర్య మేముందీ ?'

'ముందే ఖర్చు మనిషి' అన్న మాట ఆయనకి కాదు గాని నాకే తగిలింది. కనీసపు అవసరాలు తీరని ఆర్థికబాధ ఏమీ నేను పుట్టింటి దగ్గిర అనుభవించలేదు గాని అనవసరపు ఖర్చుచేసి ఎరు గను. ఇక్కడికి వచ్చాక వీరు కొంచెం దుబారా ఖర్చులు చేస్తున్నట్టు చాలాసార్లు అనిపించింది.

మొట్టమొదట సిగరెట్లు మాన్పించడానికి విశ్వప్రయత్నం చేశాను. వాటివల్ల పెదవులు ఎలా మాడిపోతాయో, గుండె ఎలా దెబ్బతింటుందో వూపిరితిత్తుల వ్యాధులు ఎంత సులువుగా సంక్ర మిస్తాయో—యిలాంటివి నచ్చచెప్పటానికి గట్టి ప్రయత్నం చేశాను. 'ఆ కంపు నాకు పడదు. ఆ వాసన భరించలేను అలా అయితే ఇటువైపు రావొద్దు' అని చెప్పి చూశాను. మొట్టమొదట నవ్వి వూరుకునేవారు. తరువాత లెక్కచెయ్యడం మానేశారు. ఆఖరికి కోపంగా చూసేవారు. అంతే కాల్చే సిగరెట్ల సంఖ్యలో ఒక్కటీ తగ్గించేవారు కాదు. ఒక్కొక్కప్పుడు అగ్గిపెట్టె దాచేసేదాన్ని. మరొకప్పుడు పెట్టెలో సిగరెట్లున్నా తీసి మండు తున్న పొయ్యిలో పారేసేదాన్ని. మౌనంగా కార్యా లను సాధించేవారికి అపజయ మేముంది ? మూణ్ణిముషాల్లో కొత్తవి తెప్పించుకునేవారు. ఇంక ఆయన మార్గానికి అడ్డు తగలడం అనవ సరం, అవివేకం అనిపించింది. అదీగాక ఈ అల వాట్లు నిన్నా మొన్నా అయినవి కావు, రేపూ ఎల్లుండీ పోవడానికి.

అలాంటిదే మరొకటి కాఫీ హోటలు అల వాటు. ఇంట్లో పదిమంది పిల్లలతో సతమత మౌతుంటే తెల్లవారేసరికే ఏ పిల్లాడో 'నాన్నా నేనూ వస్తాను' అని వెంట పడకుండా పెరటి దారిని హోటల్ ప్రవేశం చెయ్యడంలో న్యాయం లేదు గాని సమర్థించుకోడానికి అవకాశం ఉంది. మరి యీ వ్యసనం ఈయన ముందు ఎందుకు మానరో మానవమాత్రులకి అర్థంకాదు. అక్కడ తయారయే పదార్థాలన్నీ శాయశక్తులా ఇంటి దగ్గిర చెయ్యడానికి ప్రయత్నం చేసేదాన్ని. హోటలునుండి యిడ్డెన్ల పొట్లం తెప్పించి యింట్లో చేసిన వాటితో పోల్చి తేడా తెలుసుకో





సంపెంగలూ సన్నజాజులు

దానికి గట్టి ప్రయత్నం చేసేదాన్ని. బల్లముందు కుర్చీ వేసి బల్లమీద ప్లేటులో టిఫిన్ పెట్టి సర్వరులా నే నక్కడ చేతులు కట్టుకుని నిలబడితే వారికి నవ్వు ఆగేదికాదు. నువ్వింకో అన్ని ప్రయత్నాలు చేసినా 'జూ' లో వన్య మృగాలలాగ నేచురల్ పరౌండింగ్స్ ఏర్పరచి నన్ను సంతుష్టి పెట్టలేవు. ఆ ఫ్లేవర్ వేరు, ఆ అనుభవం వేరు' అనే వారు. అవును మరి. 'మాసిపోయిన లుంగీ గుడ్డ కట్టుకున్న సెర్వడూ, లొత్తలుపడి మురికి వోడుతున్న అల్యూమినియం పళ్లేలూ నే నెక్కడ తేగల్ను !' అనేదాన్ని. ఇంట్లో ఎన్ని చేసినా వారి కాఫీహోటలు ఖర్చు రూపాయికి తగ్గేదికాదు. కొన్నాళ్ళు పర్సు దాచేసేదాన్ని. ఏం లాభం ? 'అరువులేదు' అని బోర్డు రాసి తగిలించినా అరువు వల్ల కలిగే ఆదాయాలే వాళ్ళకి ఎక్కువ. నా ప్రాణం విసుగెత్తి 'మీరలా సొమ్ము మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుపెడుతూంటే ఇంట్లో నా శ్రమ కూడా ఎందుకు దండుగ ! నేను మళ్లీ యింట్లో చెయ్యడం కూడా ఎందుకు మీరు తినక పోయాక ! మీరు సాయంకాలం వచ్చేటప్పుడు, ఆచేత్తో రెండు టీపీ, రెండు కారమూ పొట్లాల్లు కట్టించుకొస్తే సరే అన్నాను సగం వేళాకోళంగా సగం నిజంగా. 'అలా నువ్వే దార్లోకి రావడం అన్నివిధాలా శ్రేయస్కరం' అన్నారు ఆయన గెలుపొందిన వారి మొహాని కుండే సహజమైన వెలుగుతో.

మూడోది పేకాట. ఇదంత రెగ్యులర్‌గా ఆడే వారు కాదు. అప్పుడప్పుడు క్లబ్బులో వెలిగించే వారు. 'ఒళ్ళు చెడని మత్తుమందు, ఇది ఎవరైనా జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు సేవించక తప్పదు' అని ఆయన పేకాటని నిర్వచించేవారు, డబ్బులేకుండా పేకాడడం, నీళ్లు లేకుండా స్నానం చెయ్యడం లాంటిదట. ఆడినప్పుడు మాత్రం గంటలు గంటలు కూచునేవారు.

ఒకసారి అన్నయ్యకు వీటి గురించి రాస్తే,

'ఇవి ఉదహరించవలసినంతటి వ్యసనాలే వెర్రి చెల్లీ ! చీటికీ మాటికీ విసుక్కునే ధుమధుమల కన్న ధూమపానం ఏమంత బాధించేది కాదు. ఎన్ని చేసినా అది చెయ్యలే దిది చెయ్యలేదని కాల్చుకు తినేకన్నా కాఫీహోటళ్ల చిరుతిండి ఘనాపాటి నేరమేమీ కాదు. ఇళ్ళూ, వాకిళ్ళూ తాకట్టు పెట్టే జూలాయితనం కన్న అప్పుడప్పుడు ఓ పేకాట వేసుకోడం అదేమీ అంత అపరాధం కాదు. ప్రతి మాటకీ ఎదుటివారిని నొప్పించడ మనేది అన్ని వ్యసనాలలోకీ అధమ వ్యసనం. అది లేనినాడు, ఒకరి ఖర్చుమీద మరొకరు ఆచూకీ అజమాయిషీ చెయ్యనినాడు యివి చిర్వ్యసనాలే కాని దుర్వ్యసనాలు కానేకావు.'

అని జవాబు !

(సశేషం)

టర్కీ దేశం ముచ్చట్లు


జె. వరలక్ష్మి

ఇటీవల 'సైప్రస్'లో జరిగిన అల్లరులు అంతర్జాతీయంగా అందరి దృష్టినీ ఆకర్షించడమేగాక, టర్కీ రిపబ్లిక్ పేరు అందరికీ వినపడేట్లు చేశాయి. 50 సంవత్సరాలక్రితం అంతరించిపోయిన్న ఆటోమన్ సామ్రాజ్యం, మొదటి ప్రపంచ యుద్ధకాలంలో జర్మనీతో చేతులు కలిపింది. యుద్ధం ముగిసి 3 సంవత్సరాలు అయినా కాకమునుపే సామ్రాజ్యం పేరూ ఊరూ లేకుండా నశించిపోయింది. మిగిలిందల్లా సుల్తాన్, కొందరు సివిల్ ఉద్యోగులు, వోడిపోయిన కొద్ది సైన్యం, ఎంతోకాలంగా బాధలకు గురిఅయిన ప్రజా సామాన్యం. మిత్ర రాజ్యాలన్నీ కలిసి టర్కీ రిపబ్లిక్ సరిహద్దులు నిర్ణయించి కెమాల్ పాషా అనే ఆర్మీ ఆఫీసరును మొట్ట మొదటి అధ్యక్షునిగా నియమించాయి. కెమాల్ సాధించిన ఘన కార్యాలు ఏవీ లేవని చెప్పటం సులభమేకాని "టర్కీ జాతి" అనేదానిని సృష్టించాడని మాత్రం చరిత్రకారులు గుర్తించి తీరుతారు. ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి, సైన్యాన్ని కట్టుదిట్టం చేశాడు. కాని ఆయన మరణించాడు. ఈమధ్యనే ఆయన 25 వ వర్ధంతి జరిగినది. ఆ సందర్భంలో వచ్చిన సందేశాలు ఆయన ఎడల అన్ని దేశాల అధినేతలకు గల గౌరవాన్ని తెలియజెబుతాయి.

ఆయన మరణానంతరం రెండవ ప్రపంచ యుద్ధం వచ్చింది. అప్పటి అధ్యక్షుడైన ఇస్మెట్ ఇనోనూ దేశాన్ని తటస్థంగా ఉంచాడు. కాని యుద్ధం తరువాతి కాలంలో అనేక రాజకీయ పార్టీలు వెలిసినవి. ఇస్మెట్‌పాషా స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ప్రభుత్వాన్ని కూలదోసి, డెమాక్రటిక్ పార్టీకి చెందిన మెండీరిస్ అతని అనుయాయులు పదవులను అలంకరించారు. కాని 1960 వ సం. లో పది సంవత్సరాలు రాజ్యం చేసిన డెమాక్రటిక్ పార్టీ పరిపాలన పోవటమేకాక మిలిటరీ తిరుగుబాటువల్ల మెండరీస్ మరి నలుగురు అనుయాయులు ఉరితీయబడ్డారు. ఈ చారిత్రిక సత్యాలు అందరూ ఎరిగినవే! కానీ టర్కీ ఏంచేసింది, ఏంజేయాలనుకుంటున్నది అనే విషయంమాత్రం స్పష్టంగా ప్రపంచ ప్రజలకు తెలియదు అలా టర్కీ ముఖ్యోద్దేశం టర్కీని స్వతంత్ర ప్రజాతంత్ర రాజ్యంగా చేయాలనే! ఇస్తాంబుల్, అంకారా, ఇజ్మిర్ పట్టణాలుచూస్తే యూరప్ జాతులలో ఒకటిగా టర్కీని గుర్తిస్తాం. కాని అనటోలియాలోని గ్రామాలుచూస్తే టర్కీ చాలా వెనకబడి ఉన్నదని అనుకుంటాం. గ్రామానికీ, పట్టణానికీ వున్న ఈ తేడాయే ప్రజలలో రెండు రకాల మనుషులను తయారు చేస్తున్నది. పట్టణవాసులు నాగరికులు, విజ్ఞానవంతులుగానుఉంటే పల్లె ప్రజలు అజ్ఞానులుగానూ, మొండి పట్టుదలగలవారుగాను ఉంటున్నారు. యువతరంవారు అభ్యుదయాన్ని కాంక్షించినా, అసంఖ్యాకమైన జనం, అజ్ఞానంతో పేదరికంతో అలమటిస్తున్నప్పుడు వోటింగు హక్కులు లభించినా, వోటు విలువ ఏముంటుంది? రాజకీయ స్వాతంత్ర్యం ఉన్నా అది ఒక్కటే చాలదుగదా. సరిగ్గా ఇదే పరిస్థితి నిన్న మొన్నటిదాకా మన దేశంలోనూ ఉన్నది.

టర్కీలో 1960 లో వచ్చిన మిలిటరీ విప్లవం తర్వాత నియంతృత్వ పరిపాలన స్థాపించటం చాలా సులభమై ఉండేది. కాని కొత్తగా రచించబడిన టర్కీ రాజ్యాంగ విధానం ప్రజాస్వామికానికే ప్రాధాన్యతనిచ్చి, వ్యక్తి స్వాతంత్ర్యాన్ని రాజకీయ హక్కులను గుర్తించింది. కానీ ఈ వ్యక్తి స్వాతంత్ర్యం, సమానత్వం అనే మాటలకు నిజమైన విలువ రావాలంటే ప్రతి వ్యక్తి విద్యావంతుడై ఉండాలి! టర్కీ రిపబ్లిక్‌కు అప్పుడే 40 సం. ల ప్రాయం వచ్చింది. కానీ విద్యా విధానం చెప్పుకోవలసినంతగా మార్పు చెందలేదు. కొందరు ఇతర దేశాలకు వెళ్ళి కూడా విద్య నభ్యసిస్తున్నారు. కానీ టర్కీలో మాత్రం సరైన శిక్షణావకాశాలు లేవు.

యాసార్ కమల్ అనే టర్కిష్ రచయిత రేడియోలో మాట్లాడుతూ, "టర్కీలో విద్యా విధానం చాలా న్యూనత కలిగించేదిగా ఉన్నది" అన్నాడు. పరిస్థితులు ఇలా ఉంటే దేశంలో మహిళల పరిస్థితులు వేరే చెప్పనే అక్కరలేదనుకుంటాను. ఇక పిల్లల సంగతి సరేసరి! యానీటోలియాలో మిలియన్ మంది పిల్లలు స్కూలుకు వెళ్ళే వయస్సులో ఉన్నారుకాని అక్కడ స్కూలే లేదు. ఇస్తాన్‌బుల్‌లో నామమాత్రంగా కొన్ని స్కూళ్ళు ఉన్నవి. కాని రెండుసార్లు, మూడుసార్లు "షిఫ్టు" పద్ధతి అవలంబిస్తేగాని, అక్కడివారికి చదువు చెప్పలేక పోతున్నారు. ఉపాధ్యాయులకు జీతాలు చాలా తక్కువ. ఉపాధ్యాయులకే సరియయిన శిక్షణ కాని, తర్ఫీదుకానీ లేదు. ఈ పరి



స్థితిని మార్చాలని ఒక "కమిషన్"ను నియమించారు. కానీ ఈ కమీషన్‌వారు చేసిన సిఫార్సులను వేటినీ ప్రభుత్వంవారు అమలులో పెట్టలేదు. ఈ లోపాలకు ఎక్కువ బాధ్యత మెండీరిస్ ప్రభుత్వం వహించాల్సి ఉంటుంది. 1950 లో డెమాక్రటిక్ పార్టీ పదవిలో ఉన్నప్పుడు అనీటోలియాలో "పీపుల్స్ హావుసెస్" అనే కేంద్రాలు చాలా చోట్ల ఉండేవి ఇవి సాంస్కృతిక కేంద్రాలుగా పని చేసేవి. వయోజన పాఠశాలలు, గ్రంథాలయాలు, రీడింగు రూములు, వినోద ప్రదర్శనలు ఈ కేంద్రాల తరఫున నడిచేవి.

యూటికి 77 మందికిపైగా వ్యవసాయదారులు కాబట్టి వీరికి విద్య నేర్పటానికి గ్రామాలలో విలేజ్ ఇన్‌స్టిట్యూట్స్ అనేవి ఉండేవి ప్రత్యేకమైన పద్ధతిలో విద్యనేర్పే విధానం కూడా రూపొందించబడింది కాని మెండీరిస్ ప్రభుత్వం ఏర్పడగానే కేవలం రాజకీయ ద్వేషంతో ఈ కేంద్రాలన్నిటినీ మూసివేసింది. ప్రజలను విద్యావంతులను చేయడానికి సక్రమమైన కృషి జరగలేమ సరిగదా, టర్కీ 20 సం. రాలు వెనక పడిపోయింది.

మెండీరిస్ ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదాలలో ఒకటేమిటంటే "మతాన్ని రాజకీయాలకు ఉపయోగించింది టర్కీలోని ఇస్లాం మతాదర్శాలు, ఈజిప్టులోని ఇస్లాంమత ఆదర్శాలు ఒకటేకావు శతాబ్దాల తరబడిగా, ముస్లింలను గుప్పిటలో పెట్టుకొనేందుకు ఉపయోగించిన ఒకే ఒక ఆయుధం "మతం" కాబట్టి ఆ మత ప్రాబల్యం గట్టిపడి ఏ మార్పుకూ తలఒగ్గని విధంగా "సిమెంటు" చేయబడింది. ఈజిప్టులో మాదిరి మతాదర్శాలకు "కొత్త భాష్యం" చెప్పేవారెవరూ లేకపోయినారు అంచేత విద్యావంతులైన కొద్దిమంది టర్కీ దేశస్థులకు కూడా "ఇస్లాం"మతం అభివృద్ధి నిరోధకమైనది అనే భావం కలిగింది వీటికితోడు మత బోధకులు, చిన్న చిన్న నాయకులు, విపరీత బోధలు చేసి మతాన్ని ప్రచారం చేశారు. రిపబ్లిక్ ఏర్పడి 30 సంవత్సరాలైనా మత సంబంధమైన స్కూళ్ళు పని చేస్తూనే ఉన్నవి. వీటిని "ఇమామ్—హాతీప్" స్కూళ్ళు అంటారు. మెండీరిస్ ప్రభుత్వం ఈ పరిస్థితులను చక్కగా ఉపయోగించుకున్నది. ఛాందసులైన రైతులు ఏ మార్పునూ సహించలేకపోయినారు.

ఇలాంటి ప్రజలను మార్చి, నవీన కాలంలో నూతన పద్ధతిలో జీవించటం నేర్వాలంటే ఎంత కష్టతరమైన పనో వేరే చెప్పక్కర్లేదు టర్కీలో ఈ సందిగ్ధ పరిస్థితే ఉన్నది సరిగ్గా ఇదే పరిస్థితి మన గ్రామీణ ప్రాంతాలలో కూడా లేకపోలేదు.

మధ్య ఆసియాలో సామ్రాజ్యవాదాన్ని గెలిచి స్వతంత్రాన్ని సంపాదించిన రాజ్యం టర్కీయే. అయినా ఈనాటికీ ఆధునిక జీవితం కొనసాగించటం సాధ్యపడలేదు ఎన్నో వ్యూహాలు, ఆశలు ఉన్నవి. మరికొన్ని సమస్యలు కూడా ఉన్నవి వీటిని పరిష్కరించుకుంటూ, సుఖవంతమైన జీవితం గడపటానికి అనువుగా బాటలు వేసుకోవాలని టర్కీలోని ఆధునిక తరంవారు ఆలోచిస్తున్నారు. ★





పదిహేనురోజులు జ్వరంతో పోరాడి చివరకు నేనే విజయం సాధించి (అంటే పత్యం తీసుకొని) స్నేహితుల్ని తిరగవేయడానికి (ప్రస్తుతం మనం విరుద్యోగులం గనుక కాస్త ఫ్రండ్స్‌తో కాలక్షేపం చేద్దామని) బయలుదేరాను మొట్టమొదట మా గణపతి దగ్గరకు వెళ్దామనిపించింది కాళ్ళు కూడా వాళ్ళింటివేపే దారితీశాయి తీరా వాళ్ళింటికి బైట గేటుకు ఒక పొను అట్ట "విఘ్ననాయక ఫిలింస్" అని నల్ల సిరాతో వ్రాయబడి వేళ్ళాడకట్టబడి ఉంది వాడితో కాలక్షేపం చేద్దామని వెళ్తే అట్ట బోర్డు ఎదురైంది. అంటే మనవాడు ఇల్లు మార్చాడన్నమాట! సొంత ఇల్లు వదిలి (మావాడు) ఎక్కడికి వెళ్లాడో ఈ 'విఘ్ననాయక ఫిలింస్' వారికి తెలుసేమోనన్న అనుమానం నాలో (కొన్త) చోటు చేసుకుంది. అనుమాన నివృత్తికై 'విఘ్ననాయక ఫిలింస్' వారిని అడుగుదామని గేటుతీసి లోపలి కెళ్లాను. లోపలికెళ్ళి చూద్దునుగదా మా గణపతి మేనల్లుడు, వసారాలో గది గుమ్మం దగ్గర స్టూలుమీద కూర్చొని నిద్రపోతున్నాడు. ఆ గది గుమ్మందగ్గర నాకు ఇంకో అట్ట బోర్డు ఎదురైంది. దానిపైన "పి. జి పతి మోషన్ పిక్చర్స్ ప్రొడ్యూసర్" అని పచ్చ సిరాతో వ్రాసి ఉంది. ఆరినీ! •కథ అర్థమైంది. మావా డొక సినీ ప్రొడ్యూసరైపోయాడండోయ్! కాస్త సంతోషంగా గది కర్టెన్ తొలగించి లోనికి పోయాను.

లోపల గణపతిగాడి వైభవం చూస్తే నాకు నవ్వాగలేదు (పైకి నవ్వలేదు) మావాడిని ఒక చేతుల్లేని కుర్చీ మోస్తోంది వాడిముందు నల్ల చెక్క టేబుల్ ఒకటి ఉంది దానికి ఒక కాలు సగం విరిగితే మావాడు అది నిలబడేందుకుగాను విరిగిన కాలుకింద రెండు ఇటుకరాళ్లు పెట్టి నట్టున్నాడు. ఆ టేబుల్‌పైన వేసిన టేబుల్ క్లాత్ మటుకు శుభ్రంగా ఉంది దానిమీద రెండు ఫైల్సు (వాటిలో ఏమున్నాయో ఇంకా చూడలేదు) ఒక పైలట్ పెన్, తుప్పుబట్టిన యాష్‌ట్రే (వాడు ఎస్. ఎస్. ఎల్ సి చదివేటప్పుడు వాళ్ళ నాయనమ్మకు తెలీకుండా కొన్నాట్ట) రెండు తాగేసిన కాఫీ గ్లాసులు, ఒక కాలింగ్‌బెల్ (పూర్వం హోటళ్లలో ఉండే బెల్ మాదిరిది) ఉన్నై. గదినిండా శత దినోత్సవాలు జరుపుకున్న చిత్రాలు తాలూకు వాల్ పోస్టర్లు అంటించబడి ఉన్నై!

• మావాడు టేబుల్‌కు కాళ్ళు తన్నిపెట్టి, కుర్చీ గోడకు చేరేసి, నిద్రపోతున్నాడు నేను టేబుల్ ముందున్న స్టూల్ జరిపేసరికి మావాడు• ఉలిక్కిపడి లేచాడు. వాడి కుదుపుకు టేబుల్‌మీదున్న రెండు గాజు గ్లాసుల్లో ఒకటి కిందకు దొర్లింది.

తత్ఫలితంగా పగిలింది కూడా ! నన్ను చూసి వాడు పలుకరించలేదు సరిగదా, 'టింగ్ టింగ్' మని కాలింగ్‌బెల్ నొక్కాడు. అది విని బైట నిద్ర పోతున్న వాళ్ల బాబిగాడు "యస్ సార్" అంటూ లోపలికి పరుగెత్తుకొచ్చాడు.

"ఏరా బైట ఏం చేస్తున్నావ్ ? ఎవరన్నా వచ్చినప్పుడు నాకు ఇన్‌ఫాం చెయ్యకుండా లోనికి పంపవద్దని చెప్పాలా ?" అని అన్నాడు మా గణపతి, వాళ్ల బాబిగాడిని కోపంగా చూస్తూ !

బాబిగాడు ఏడుపుమొహం పెట్టి "చెప్పావు మామయ్యా, కాదు కాదు సార్" అన్నాడు.

"మరి ఈయన లోపలి కెలా వచ్చారు ?" వాడి ప్రశ్నకు బాబిగాడు బిక్కమొహంవేసి నుంచు న్నాడు.

"వెళ్లు ఇటువంటి పొరపాటు మళ్లీ చేస్తే వూరుకొనేది లేదు" అన్నాడు గణపతి ఆఫీసరు ఫోజులో !

ఈ సంభాషణ విన్న నాకు నవ్వాగలేదు (ఈసారి పైకి నవ్వేశాను) బాబిగాడు వెళ్లగనే వాడు నన్ను "ఏమండీ ఏం కావాలి ?" అని అడి గాడు. ఈ ప్రశ్న నాకు మరింత ఆశ్చర్యాన్ని కలుగ జేసింది. నాలుగేళ్ల నుండి నాతో ఫ్రండ్‌షిప్ వెలగ బెడుతున్న వీడు, ఎప్పుడూ నాచేత ప్రేమలేఖలు వ్రాయించుకొనే వీడు, పరీక్షలో మా ఇంటికి వచ్చి చదువుకొనే వీడు, సోడా తాగితే డబ్బులు ఖర్చవుత వని హోటలుకెళ్లి మంచినీళ్లు తాగి వచ్చే వీడు, ఈ గణపతిగాడు, నన్ను "ఏమండీ ఏం కావలి" అని అడిగితే ఎలా ఉంటుందో మీరే చెప్పండి. కోపంతో "ఏరా ఎరుకలవూడికి (దండప్రయోగంచేత ఈ వూళ్లో పిచ్చి కుదురుస్తారని ప్రతీతి) ప్రయాణం కడుతున్నావా ఏం" అని అడిగాను.

"మిస్టర్, ఏమిటా మాటలు ?" మావాడు పెద్దగా అరిచాడు.

"లేకపోతే ఏమిట్రా నీ కేమన్నా మతి పోయిందా ఏం ? నేనురా, నేనూ ఓంకారాన్ని" వాడికెలా చెప్పాలో తెలియక ఈవిధంగా తెలియచెప్పా.

దానికి వాడు,

"మిస్టర్ ఓంకారం ! నువ్వూ, నేనూ బియావ్వే పార్, మిరూ, నేనూ స్నేహితుల మన్నమాట నిజమే! కానీ ఎక్కడ ? బైట. ఈ గదిలో ఉన్నంతవరకు నేను ప్రొడ్యూసర్ సి. జి పతిని, నీవు కస్టమర్‌వి" అని అన్నాడు కరప్షన్ ఎరుగని ఉద్యోగిలా !

మావాడొట్టి జగమొండి. వాడు చెప్పినట్లు చెయ్యకపోతే వాడి ఒళ్లే వాడికి తెలీదు. వాడి ప్రొడ్యూసరాయణం తెల్సుకోవాలంటే వాడిని కాకా పట్టాల్సిందే మరి !

"ఐతే ప్రొడ్యూసర్ సార్ మీకు ఎవరూ ప్యూన్ దొరకలేదా, చిన్నపిల్లవాణ్ణి గేటుదగ్గ రుంచారు" అని అడిగాను

"ఆఁ ఏమీలేదండి కుర్రవాడికి శలవులు. వూరికే గొడవచేస్తూ ఎండలో తిరుగుతుంటే వ్యాసును మాన్పించి వీడిని కూచోబెట్టాను భయంకొద్దీ వాడు ఎప్పుడు గేటు దగ్గరే కూచొని ఉంటాడు" అని చెప్పారు ప్రొడ్యూసరుగారు హుందాగా నవ్వుతూ.

కుర్రవాడికి వాడంటే భయంలేదని, రోజుకు పావలా ఇస్తానంటే గేటు దగ్గర నిద్రపోతున్నా డని తర్వాత ఆ కుర్రవాడి ద్వారానే తెలిసింది.

"మీ సినిమా ఏ ఫక్కీలో తియ్యాలనుకొంటు న్నారు ? నటీనటుల్ని టెక్నీషియన్స్‌ని సెట్ చేశారా" అని అడిగాను ఇంటర్వ్యూకెళ్లిన పత్రికా విలేఖరిలా !

"మా సినిమా అంతా కొత్త ఫక్కీలో నడు స్తుందండీ. ఇంకా కథ ఎన్నుకోలేదు. నేను సినిమా రంగానికి (పుస్తకానికి కాదు) కొత్తవాడ్ని. అలాగే మా సినిమాలో నటీనటులు, రచయితలు సంగీత దర్శకులు తదితర సాంకేతిక నిపుణులందరు కొత్తవాళ్లే కన్పిస్తారు"

"మరి స్టూడియో కూడా కొత్తదే నాండి ?" నాకు అనుమానం వేసింది చెప్పొద్దూ ! వీడు సినిమా అంతా కొత్త పద్ధతిలో తీస్తా నంటు న్నాడు. కొత్త పద్ధతిని చెప్పి సినిమా ఏకంగా ఇంట్లోనే తీసేస్తా డనిపించి అలా అడిగాను.

దానికి వారు పెద్దగా నవ్వేసి "లేదండి ! పాత స్టూడియోల్లోనే నిర్మిస్తాం" అన్నారు.

"ఐతే రచయితలు కూడా కొత్తవాళ్లే నన్న మాట"—నా ప్రశ్న.

"అహ ! అంతా కొత్తవాళ్లే"

ఇక్కడ నా గురించి మీకు కాస్త చెప్పాలి నేను ప్రస్తుత ప్రొడ్యూసరు ఫోర్తుఫారం చదువు తున్నప్పటినుండి స్నేహితులం. అలానే ఇద్దరం కలసి బి. ఏ లోకి వచ్చాం. (దండయాత్రల వివ రాలు చెప్పటంలేదు, క్షమించండి) నేను కాలేజీలో అడుగుపెట్టిన దగ్గర్నుండి రచయితను కావాలని

రచన: ప్రభాకర్

ఉవ్విళ్లూరుతుండేవాడిని నా ఆశ దినదిన ప్రవర్థ మానమై చిన్నచిన్న కథలు రాయటం మొదలు పెట్టాను. ఈమధ్య పత్రికకు పంపిన మూడు కథల్లో రెండు తిరిగి వచ్చినై (మూడో కథకు స్టాంపులు జత చెయ్యలేదు.) ఇప్పుడు చిన్నచిన్న నవలలు రాయగల్గుతున్నాను. ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే, ఆఁ! మీరు తెలుసుకున్నారు. తెలుసుకొని వూరుకోకుండా నవ్వుతున్నారు కూడా ! నవ్వకండి, చదవండి.

"అయితే ప్రొడ్యూసర్ సర్ ! నేను కూడా రచయితనన్న సంగతి మీకు తెలుసు. నా దగ్గర ఐదారు కథలున్నై. మీరు కావాలంటే ...." చేతులు నలుపుకుంటూ అడిగాను.

"తప్పకుండా నండి మీ దగ్గరున్న రచనలు ఇంకా ఎక్కడ పబ్లిష్ కాలేదుకదా."

"లేదండి"

"మీ నవల ఏదో పత్రికలో ధారావాహికంగా వెలువడుతోందని విన్నాను. ఏ పత్రికలో ప్రచు రిస్తున్నారు ?" ప్రొడ్యూసరు డ్రాయరు సొరుగు బర్‌మని లాగుతూ అడిగాడు.

"మన వూరినుండి వెలువడుతున్న లిఖిత మాసపత్రికలో ప్రచురిత మౌతోంది"

"అయితే ఆ కథలు తీసుకురండి వాటిలో ఒకటి సెలెక్టు చేద్దాం. ఏదీ నచ్చకపోతే కొత్త కథ రాద్దురుగానీ" అని అన్నారు సిగరెట్‌పెట్టె బైటకు తీసి సొరుగులోనికి నెట్టూ !

"అలాగే నండి"

"ఐతే కవిగారూ మీ పూర్తి పేరు చెప్పండి" అని అన్నాడు వాడికి నా పేరు తెలీనట్లు.

అయినా వాడి రోజులు గదా అని "ఓం ఓంకారం" అని చెప్పాను.

"మీ పేరేమీ బాగాలేదండి ! చూడండి, పెద్ద పెద్ద కవులు గూడా కలం పేర్లు పెట్టుకుంటు న్నారు. అలాంటప్పుడు మీ పేరును కూడా కొద్దిగా మార్పుచేస్తే ఏం ? ఓం ఓంకారమంటే మరీ మోటుగా ఉంది. ఏమంటారు ?"

"చిత్తం."

"మీరు ఓం ఓం అని పెట్టుకోండి ఇంచక్కా శ్రీ శ్రీ లా."

అలా మార్పు చేసేందుకు ఇష్టమే నన్నట్లు తల ఆడించాను. ఈ ప్రొడ్యూసరుతో మాట్లాడు తుంటే నా మనస్సులో బేకారీగా తిరుగుతున్న వెంకట్రావు ఉరఫ్ నాటకాలరావు, దీక్షితులు అన బడే హరికథల హార్మోనిస్టు వాడి బృందము, మెది లారు నిరుద్యోగంతో బాధపడుతున్న వీళ్లకు సహాయం చెయ్యగలనన్న వూహ నాలో మెది లింది.

"ఇదుగో కవిగారూ, మీ కథ ఎలా ఉండాలో తెలుసా" నా ఆలోచనలకు అంతరాయం కలి గిస్తూ మా ప్రొడ్యూసరుగారు అడిగారు.

"తెలీదండి"

"మన సినిమా అంటే మీరు రచిస్తున్న కథ ఇంటర్వెల్ దాకా విషాదంగా లేదా కామెడీగా ఇంటర్వెల్ నుండి కామెడీగా లేదా విషాదంగా ఉండాలి. ఏమంటారు ?"

"ఏమంటాను మన సినిమాను ప్రేక్షకులు ఇంటర్వెల్ వరకే చూస్తారు" అని మనసులో అనుకొని ప్రొడ్యూసర్‌గారితో "అలా చేస్తే బాగానే ఉంటుందని" చెప్పాను. కత్తి యుద్ధాల నుండి హెలికాప్టర్ యుద్ధాల వరకు మా సిని మాలో ప్రదర్శించాలట. అన్నట్టు అందులో పద్యాలు గూడా ప్రవేశపెట్టాలట. వాడి, సారీ, వారి మాటల్నిబట్టి చూస్తే వారు తీసే చిత్రము అనగా వారికి కావలసిన నా కథ చారిత్రాత్మకమో జానపదమో, సాంఘికమో అర్థంకాలేదు. ఎందు కంటే వారి సినిమాలో ఈ నాలుగు పద్ధతులు కన్పించాలట. సినిమా ఇట్లా తీసేట్లయితే ఆప రేటరు కూడా దాని మొహం చూడడని చెప్పాను. దానికి ప్రొడ్యూసరుగారు ఖస్సుమని లేచారు. ఆయన చిత్రం కొత్త రికార్డు సృష్టిస్తుందిట! "అమాటకొస్తే నువ్వు కథ రాయొద్దుపో !" అన్నారు ప్రొడ్యూసరుగారు ఉమా టనేసరికి నేను నిలువునా నీరైపోయాను మళ్లీ అరగంట కాకా పడితే నార్మల్ కొచ్చారు, మా ప్రొడ్యూసరుగారు !

"ప్రొడ్యూసర్ సర్ ! మీకు వెంకట్రావు, దీక్షితులు తెలుసా ? . . వాళ్లేనండి ఒకడు నాట కాలు వేస్తాడు, మరొకడు హార్మనీ—...."

"తెలుసండోయ్ కవిగారూ తెలుసు ఏమిటి సంగతి ?"—నవ్వుతూ అడిగారు ప్రొడ్యూసరు గారు.

"ఆ ఏమీలేదు మన సినిమాలో వాళ్ల కేవైనా ఛాన్సులు చూపిద్దామని. దీక్షితులకు మ్యూజిక్ డైరెక్షను, వెంకట్రావుకు హీరో వేషం ఇస్తే బాగుంటుంది" అని అన్నాను కాకా ఫలిస్తుంది గదా అన్న సంతోషంతో !

దానికి వారు "లేదండి, వెంకట్రావుకు హీరో వేషం ఇవ్వటానికి వీలులేదు నేను ఈ చిత్రానికి ప్రొడ్యూసర్, డైరెక్టర్ అండ్ హీరోగా వర్క్ చేస్తాను దీక్షితులుగారికి మీరు చెప్పినట్లు మ్యూజిక్ డైరెక్షన్ ఇద్దాం, వెంకట్రావుని మాత్రం సైడ్ హీరోగా బుక్ చేద్దాం" అని అన్నారు.

ఐతే వీడు సినిమా డైరెక్టు చేస్తాడన్నమాట అయ్యయ్యో! ఇంతకన్నా ఘోరం ఇంకేమన్నా ఉందా! వీడు సినిమా డైరెక్టు చేస్తానంటే కాలేజీలో చదివే రోజుల్లో వీడు డైరెక్టు చేసిన నాటకం గుర్తుకొచ్చింది ప్రసిద్ధ సినీ రచయిత విరచితమైన ఒక నాటకాన్ని కాలేజి యూనివర్సిటీకి ప్రదర్శించాలని మాగణపతి (ప్రస్తుత ప్రొడ్యూసరు) బృందం (నేనుతప్ప) నిశ్చయించింది ఆ నాటకాన్ని ఈగణపతి డైరెక్టు చేశాడు (మా డ్రమెటిక్ అసోసియేషన్ ప్రెసిడెంటుగారి సైకిలు నాలుగుసార్లు శుభ్రంగా తుడిచి, ఆ నాటకంలోని

మా కథ

పాత్రధారులకయ్యే మేకప్ ఖర్చులు తానే భరించి, వాళ్లందరికి నాలుగుసార్లు టీ పార్టీలిచ్చి, డైరెక్టర్‌గా సెన్సార్ చెయ్యించుకున్నాడని ప్రతీతి) ఆనాటకంలో కొత్తదనం చూపిస్తానని వీడు ఒక లేడీ స్టూడెంట్‌చేత హీరోవేషం వేయించాడు. ఆమెకు (సారీ! హీరోకు) స్టేజిపైకి రాగానే కాళ్ళు వణక సాగాయి. ఎల్లాగైతేనేం డైలాగులు వప్పచెప్పటం మొదలుపెట్టింది, ఆడహీరో! నూటూబూటూవేసుకున్న ఆమె అలవాటు ప్రకారం పైట సరిచేసుకోబోయింది. ఇక చూడండి ప్రేక్షకుల రియాక్షన్! వాళ్ళు పాత్రధారులపైన చెప్పు మొత్తంగా వేయకుండా ఒక్కోచెప్పును నాలుగు భాగాలుగా చేసి మరీవేశారు. దానితో ఆరు రంగాలు గల ఆ నాటకంలోని ఐదున్నర రంగాల ప్రదర్శన సశేషంగానే వుండిపోయింది

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు" — అన్నాడు ప్రొడ్యూసరుగారు గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ వెలిగిస్తూ!

"ఏమీ లేదండి, మరినేవస్తాను వీలుంటే మీరు సాయంత్రం అలా పార్కుకురండి నేను కూడా వస్తాను. కాస్త కులాసాగా గడపొచ్చు" అని అన్నాను పార్కులో అయితే స్నేహితుడుగా వాడు సినిమా తీయటానికి ఎలాపూనుకున్నాడో తెలుసుకోవచ్చనే వుద్దేశ్యంతో!

"అలాగేనండి నాకూ కాస్తరిలీఫ్‌గా వుంటుంది. తప్పకుండా వస్తాను"

ప్రొడ్యూసరు గారి దగ్గర శలవు తీసికొని ఇంటికి బయలుదేరాను.

*   *   *

అనుకున్న ప్రకారం అయిదు గంటలకల్లా పార్కుకు చేరుకునేసరికి మావాడేదో పుస్తకం చదువుతూ గడ్డి మీద దొర్లుతున్నాడు నేను మెల్లిగా వెళ్లి వాడిప్రక్కనే కూర్చున్నాను. నన్ను చూసివాడు గబగబా పరుగెత్తుకెళ్లి ఒకపావలా వేరుశనగకాయలు కొనుక్కొచ్చి నాముందు పోశాడు. అరె! ప్రొడ్యూసరు ఇవన్నీ ఎలా చేస్తున్నాడనుకోకండి. వాడు నాచిన్ననాటి స్నేహితుడు (కుచేలుడంతటివాడు, కాని వీడికి డబ్బుంది!) కుశల ప్రశ్నలైన తరువాత ఒక్కొక్క కాయ వలుచుకు తింటూ మావాడి ప్రొడ్యూసరాయణం గురించి అడిగాను.

వాడు వేరు శనగకాయలు తినటం ఆపేసి, గొంతు సవరించుకొని, చొక్కా దుమ్ము దులుపుకొని, ఇటూ అటూ చూసి, మధ్యలో ప్రశ్నలు వేయవద్దని చెప్పి, ఇలా చెప్పటం మొదలు పెట్టాడు.

"నాకు నాయనమ్మ తప్ప మరెవ్వరూ గార్డియన్లు లేరని నీకు తెలుసు ఆ నాయనమ్మ నన్నొక గ్రాడ్యుయేటును చేయటానికి మార్చి సెప్టెంబర్లకు విసుగులేకుండా యూనివర్శిటీకి గ్రాంట్లు ఇచ్చిందని కూడా నీకు తెలుసు ఆ నాయనమ్మ నేను పి. యు సి. లో చేరినప్పటినుండి యాత్రలకు పోతాననటం నీకు విదితమే! ఆమె యాత్రల ఆశయం ఇన్నాళ్లకు నెరవేరింది. నేనిక జన్మలో బి. ఎ. పాస్‌కానని, ఆమెనాకళ్ల ఎదుట వుంటే ఇక బాగుపడననీ, ఆస్తంతా నాపేర వ్రాసి వీలునామా ప్లీడరు దగ్గర వుంచాననీ, అవసరమైతే తీసుకోమని చెప్పి యాత్రలకు వెళ్లింది. (ఆమెకు త్రివేణి సంగంలో ఐక్యం అయిపోవాలని వుందిట!) ఆమె వెళ్ళిన రెండురోజులకు మా అక్కయ్య వచ్చి భోరుమంది ఎందుకంటే, నాయనమ్మ ఆమెకు చెప్పకుండా వెళ్ళిందని! బావకూడా కాంపులకెళ్ళాడట తను ఒక నెలరోజులుండి పోతానంది. మా పొలాలు, గృహాలు వగైరా స్థిరాస్తులు ఎక్కడెక్కడ వున్నాయో మా అక్కయ్య తెలియచెప్పేదాకా తెలియలేదు వివరాలన్నీ విన్న తర్వాత ఆఆస్తితో రెండు సినిమాలు తీయవచ్చని నిర్ణయించుకున్నాను. అందుకే మొదటి సినిమాను ప్రెసిడెంషియల్ అవార్డు కొరకు కొత్త పంథాలో నిర్మించదలచుకొన్నాను. నీవు మాత్రం కథ ఎంత త్వరగా అందిస్తే అంత మంచిది. ఆ వీలునామా కొరకు ప్లీడరు దగ్గరకు వెళ్తే ఆయన వూళ్లోలేడని ఒకవారం వరకు రాడని తెలిసింది. కొంతపొలం అమ్మితేగాని డబ్బు చేతిలోపడదు. అన్నట్టు మన కంపెనీ రిజిస్టర్ చేయించాలి,



అయ్యా! నాకు హిందీ బాగా వచ్చు' చాలా మీటింగులలో చాలా మంది ఉపన్యాసాలు అనువాదం చేశాను! కానీ, మీరు మాట్లాడే హిందీ ఏ ప్రాంతానిదో .... యేమో! ఒక్క ముక్క కూడా అర్థం గావటం లేదు!!

మన ఆఫీసు ఫర్నిచరు మార్చాలి, నీకూ కొంత అడ్వాన్సు ఇవ్వాలి. ఈవారం ఆగి ఫ్నీడరు దగ్గర ఆ పత్రాలు తీసికొని కొంత పొలం అమ్మితేనేగాని ఈ పనులన్నీ చేయటానికి వీలుండదు."

కథ చెప్పటం పూర్తిచేసి నేను మిగిల్చిన వేరు శనగకాయలు సొమ్ముచేయటం మొదలెట్టాడు, మావాడు.

ఈకథ విన్న తర్వాత వాడునిజంగా సినిమా తీస్తున్నాడని ధృడపరచుకున్నాను. నన్ను సినీ రచయితను చేస్తున్న నాఅదృష్టాన్ని స్వగతంతోనే అభినందించాను. తర్వాత అవీ ఇవీ మాట్లాడి ఇద్దరం (స్వ) గృహోన్ముఖులమయ్యాం!

ఇంటికి చేరిన నేను భోజనం కూడా చేయ కుండా బుద్ధిగా కథరాయటానికి వుపక్రమించాను. పేపరు మీద కలం పాలరాతిమీద పాదరసంలా సాగిపోతోంది. గణపతి ఇచ్చిన హింట్స్ ప్రకారం కథలో అన్నిరకాల యుద్ధాలు, విచిత్ర సంఘట నలు ఇముడుస్తున్నాను. నా మనస్సంతా కథపైనే కేంద్రీకరించిరాస్తున్నాను. (ఉత్తమ రచయిత గా బహుమతి రావాలి మరి!) అర్ధరాత్రి అయే సరికి సగంకథ మాత్రమే పూర్తి అయింది. మిగతా కథ మరుసటి రోజు పూర్తి చేయవచ్చనే వుద్దేశ్యంతో పక్క మీదకు చేరాను.

రాత్రి పన్నెండు గంటల వరకు పనిచేయటంతో వుదయం ఎనిమిది గంటలకు అమ్మవచ్చి లేపిం దాకా నిద్ర లేవలేక పోయాను. కాలకృత్యాలు ముగించుకొని మరల కథరాయటానికి కూర్చున్నాను. అలా రెండుమూడు లైన్లు రాసానో లేదో మా గణపతి రొప్పుతూ, రొజుతూవచ్చాడు. మొహ మంతా చెమట పట్టివుంది వాడి వాలకం చూస్తే నానోటంట మాట రాలేదు. మౌనంగానే ఒక మరచెంబుడు నీళ్ళు తెచ్చివాడికిచ్చాను. అవి ఒక్క గుటకలో పూర్తి చేసి కుర్చీలో కూలబడ్డాడు. రెండుమూడు సార్లు నిట్టూర్చి వాడే నన్ను పలుకరించాడు.

"ఏమి ట్రా రాస్తున్నావ్?"

"మనసినిమాకు కథరా"— ఉత్సాహంగా జవాబు చెప్పాను.

"వద్దురా, రాయొద్దు! నేను సినిమా తీయ టంలేదు" బిక్కమొహం వేసి అన్నాడు.

ఈమాట వినేసరికి నానెత్తిమీద పిడుగు పడ్డట్టైంది. వీడి సినిమా కొరకని అర్ధరాత్రి దాగా కూచోని సగం కథ పూర్తి చేస్తే ఇప్పుడొచ్చి వద్దంటున్నాడు. పెద్ద సినిమా తీసే వాడిలా నిన్నంతా పార్కులో కబుర్లుచెప్పి ఇవ్వాళ ఇట్లా చేస్తే నాకుకోపంరాదూ! ఆ కోపంతోనే నాపెన్లో వున్న ఇంకంతా (వాడి కథకొరకు పార్కర్ ఇంక్ కొన్నాను) వాడి మొహాన చల్లాను చిత్తుకాగితాలన్ని చించి వాడి నెత్తినపోశాను వాడ్ని నోరారా తిట్టాను ఆశ్చర్యం! ఇన్ని చేసినా వాడు నోరు మెదప కుండా కూచున్నాడు. ప్రేమించి, పెళ్లిచేసుకుంటా నని చెప్పి చివరకు పెళ్లిచేసుకుంటానికి తన అసమర్ధతను వ్యక్తపరిచే హీరో, హీరోయిన్ ఎన్ని తిట్టినా కొట్టినా ఎలా మెదలకుండా వూరు కుంటాడో అలానే కదలకుండా కూచున్నాడు మా గణపతి! తిట్టీ, తిట్టీ నాకే విసుగుపుట్టి నేను మౌనంగానే కూచున్నాను. కాసేపాగి నేనేదో అడగబోయేసరికి వాడే అన్నాడు— "నా కథంతా వింటే నువ్విలా చేయవురా"

"ఒరేయ్! సినిమా డైలాగులు నాదగ్గర వాడక! నిన్న ఒక కథచెప్పి నమ్మించావ్ మళ్లీ ఇవాళొక.."

"నిన్న చెప్పింది నిజం ఇవాళ చెప్పేది అక్షరాల నిజంరా!"

"ఏమిట్రా నిజం? నన్ను ఫూల్‌ని చెయ్యటమా?"

"మోసం జరిగిందిరా బ్రదర్ మోసం"

"ఏమిట్రా మోసం?" కాస్త తగ్గుస్థాయి లోనే అడిగాను.

"అలాచిన్నగా అడగరా చెప్తాను. యాత్రల కని వెళ్లిన మానాయనమ్మ తిరిగి వచ్చేసిందిరా!"

"ఎప్పుడు?"— ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ నా ప్రశ్న.

"ఇవాళ వుదయం ఆరుగంటలకు"— గద్గద స్వరంతోగూడిన వాడి జవాబు.

"వెళ్లి పదిహేనురోజులుకాలేదు. అప్పుడే యాత్రలన్నీ అయిపోయాయా?"

"అసలు మానాయనమ్మ యాత్రలకు పోతేగా"

"మరి"

"నేను నాయనమ్మ చాటు బిడ్డనని, ఆమె లేకపోతే ఇల్లు ఎలా చక్కబెట్టకలుగుతానో చూడా లని అనుకొందిట. అందుకని యాత్రలకని, మళ్లీరానని నాతోచెప్పి, మా అక్కయ్య గారింటికి చెక్కేసింది. అక్కడనుండి నాపరిస్థితి గమనించ మని మాఅక్కయ్యను పంపింది ఆమె మన సినిమా హడావుడి చూసి నాయనమ్మకు లెటరు వ్రాసేసరికి ఆమె తిరుగు టపాలో వచ్చేసింది! ఇక చచ్చేదాకా ఆస్తి నాపేర వ్రాయదట!"

"అదేమిట్రా వీలునామా ఫ్లీడరు దగ్గరుం దన్నావుగా!"

ఇదొక నాటకంరా! ఆ రాస్కెల్ ప్లీడర్లో వుండి కూడా ఇన్నాళ్ళు లేడనిపిస్తున్నాడు ఈసినిమా లాటి నాటకంలో వాడో గెస్ట్ ఆర్టిస్ట్ అయ్యాడు"

"ఐతే ఇప్పుడు మీనాయనమ్మ ఏమంటోంది?"

"వెధవ్వేషాలేయక మార్చికి కట్టమంటోంది. నాకుమాత్రం పరీక్షకు కూచోవాలనిలేదు. ఆ మాటే ధైర్యంచేసి ఆమెతో చెప్తే చీపురు తీసికొని కొట్టడానికి వచ్చింది. మానాయనమ్మ సంగతి నీకు తెలుసుగా, చేతికందితే నిజంగానే కొట్టగలదు. అందుకే గాభరాగా ఇటు పరుగెత్తు కొచ్చాను"— గణపతి నావేపు నిస్సహాయంగా చూస్తూ అన్నాడు. వాడిని చూస్తే నాకు జాలి వేసింది. నా ఆగ్రహప్రవర్తన తాలుకు సిరా గుర్తులు వాడిమొహం నిండా కనబడుతున్నై! మొహంకడుక్కోమని సబ్బు, నీళ్ళు తెప్పించి ఇచ్చాను. మొహం శుభ్రంగా కడుక్కొని, కాఫీ ఇచ్చినా తాగకుండా నాకు క్షమాపణ చెప్పుకొని వెళ్లిపోయాడు వాడి డిజప్పాయింట్‌మెంట్‌కు నాకు చాలా జాలివేసింది. వాడికి మనస్సులోనే సానుభూతి తెలియబరచి నా ఆలోచనలను వాడి నుండి కథ పైకి మరల్చాను. మా వూరి నుండి వెలువడే లిఖిత మాసపత్రికకు ఇవ్వవచ్చనే వుద్దే శ్యంతో మిగతా కథను పూర్తి చేయటానికి వుపక్రమించాను, మా వాడికథను కాదుకాదు" "మా కథ"ను మీ ముందుంచు తున్నాను. ★

'ఆంధ్రసచిత్ర వారపత్రిక'లో ప్రచు రణకు ఇండియన్ ఇంక్ తో వేసిన కార్టూ నులు మాత్రమే పంపాలి. సాధారణంగా 4″ × 2″, 4″ × 4″ చిత్రాలు పత్రి కలో పడుతూ ఉంటాయి. సం||

విలాసంగా విప్లవం

29 వ పేజీ తరువాయి

వచ్చినప్పుడు ఈ సంఘాలు మొత్తం పనిని 11 రోజుల్లో పూర్తి చేశాయి! పోయిన ఏడు అదే పని 24 గంటల్లో ముగిసింది!!)

ఈ సంఘాలు విచిత్రమయిన పనులు కూడా కొన్ని చేస్తాయి 1963—64 సంవత్సరాలలో ముద్ర పడిపోయిన తపాలా బిళ్లలు సేకరించి విదేశాలలో అమ్మి దేశానికి 285 లక్షల డాలర్లు సంపాదించి పెట్టాయి! ఈ సంఘాలలో 47 శాతం స్త్రీలు, 35 శాతం 25—33 సంవత్సరాల వయసులో ఉన్నవారు.

రోజు రోజుకీ కాస్ట్రో ప్రభుత్వం బలపడుతోందంటే ఆశ్చర్య మేముంది?

3

'ఎల్ సలాదో' బీచ్‌లో ఒక మధ్య వయస్కురాలు నాకు తటస్థపడింది ఆమె సోదరుడు కాస్ట్రో సహచరుడుగా, యుద్ధభూమిలో మరణించాడు. ఆమె అంది, "1959 లో క్యూబా చూసి ఉంటే నేటి పరిస్థితి ఎంత మెరుగో మీకు తెలిసి ఉండేది మా విప్లవం రష్యా విప్లవం కన్న వేగంగా నడుస్తుంది రష్యా అప్పుడు ఒంటరి దేశం కదా? మాకు సోషలిస్టు దేశాల సాయం తథ్యం కదా?" అని.

సోషలిస్టు దేశాల సహాయం తమకి ఎంత ముఖ్యమో క్యూబా ద్వీపం ప్రజలకి బాగా తెలుసు. వీటిలో సోవియట్ రష్యా సహాయం అత్యధికం. రష్యా సాయం సైనికమేకాదు, ఆర్థికం కూడా' డీసెల్ ఎంజిన్లు, మెషిన్ టూల్‌లూ, పవర్ ప్లాంట్‌లూ వగయిరా

చెకోస్లోవాకియా, తూర్పు జర్మనీ, బల్గేరియాల తోడు కూడా ఉంది కాని చైనా సహాయం మొత్తం మీద తక్కువే. ఉదాహరణకి, ఒక ఫ్యాక్టరీకి చైనా పేరు ఉన్నప్పటికీ అందులోని 112 యంత్రాలలో 60 రష్యావే! [రష్యా, చైనా తగాదాలలో క్యూబా తటస్థంగా ఉంటోంది కాని, ఒక ప్రొఫెసర్ అన్నట్లు "ఇక్కడ చైనావారు ఓడిపోయినట్లే! చైనా పక్షంవారికి కూడా గుండెకన్నా పొట్ట ముఖ్యం అని తెలుసు."]

క్యూబా దేశస్థులు ఎవరినీ గుడ్డిగా అనుకరించదలుచుకోలేదు సాయం పుచ్చుకున్నంత మాత్రాన వారు తమ ఆత్మాభిమానానికి అవమానం సహించలేరు అమెరికన్ "బ్లాకేడ్' సమయంలో ఇతరుల మీదకన్నా తమమీద తామే ఆధారపడటం మంచిదని తెలుసుకున్నారు ప్రకృతి సిద్ధంగా క్యూబా అయిశ్వర్య వంతమయినది—ఒక చెరుకుపంట వారికి 20, 30 కాలాలకి సరిపోతుంది నిక్కెల్, క్రోమియం, రాగి మొదలయిన లోహాలు సమృద్ధిగా దొరుకుతాయి.

ఒకవిధంగా అమెరికన్ శత్రుత్వం క్యూబాకి తోడ్పడింది! దానివల్లనే దేశం పారిశ్రామికంగా అభివృద్ధిని అతి శీఘ్రంగా సాధించ గలుగుతోంది.

క్యూబా పరిపాలనలో ఒక గుణం నాకు బాగా నచ్చింది. ఎవరూ ఆడంబరంగా ప్రవర్తించరు. అధికారులు తమ తప్పులు త్వరగా ఒప్పుకుంటారు. అయితే, ఆర్థిక విషయాలకి సంబంధించిన వివరాలు సరిగ్గా దొరకవు దీనికి కారణాలు ఊహించటం కూడా కష్టమే ఎక్కడో సరయిన సహకారం కొన్ని శాఖలకి లభించటం లేదేమో . ఇది అంత ప్రమాదకరం కాదనుకోండి మన దేశంలో పరిపాలన పద్ధతులు చాలా బాగున్నాయంటారుగాని క్యూబాలోలాగే పారిశ్రామిక వివరాలు సరయినవి దొరకటం కష్టం అన్న సంగతి అందరికీ తెలుసు

క్యూబా సోషలిజం అనే దానిమీద నడుస్తోంది ఆదాయాలలో అత్యధిక విభేదాలు తగ్గిస్తున్నారు. కనీసవేతనం 85 పెసోలు అయితే గరిష్ఠ వేతనం 1200 అని విన్నాను పట్నాల, గ్రామాల మధ్య తారతమ్యాలు కూడా తగ్గుతున్నాయి క్యూబా దేశస్థులు సోషలిజంను ఎన్నుకున్నారు కాని తమ ఆదర్శాల ప్రకారమే తమ ఆశయాలని నెరవేర్చుకుంటారు ఇది వారి దృఢ సంకల్పం, అని నాకు అనిపించింది. ★

వేల్పులకైనా వహార్పులు

11 వ పేజీ తరువాయి

వామనపురాణం

విష్ణువు విరోచనుని సంహరించుట, విష్ణువు అదితి గర్భమున వామనుడై జన్మించి బలిచక్రవర్తిని పాతాళమునకు త్రొక్కివేయుట, వామనుడు వికటజింహ్వుడను రాక్షసుని సంహరించుట, వామన జయంతీ మహాత్మ్యము మొదలైనవి యిందులో వర్ణింపబడినవి.

విష్ణుధర్మ పురాణం

విష్ణువు తన భక్తుడైన అంబరీషుని పరీక్షించుటకు యింద్రుని రూపంతో అతనికి ప్రత్యక్షమై వరము కోరుకొమ్మనగా అంబరీషుడు విష్ణువును తప్ప వేరొక దేవుని వరము కోరుటకు అంగీకరించలేదు కుహనా యింద్రుడు వజ్రాయుధాన్ని ప్రయోగించబోయినను అంబరీషుడు భయపడనందున విష్ణువు తన నిజరూపముతో అతనికి ప్రత్యక్షమై, క్రియా యోగాన్ని ఉపదేశించెను. ప్రహ్లాదుడు నరసింహదేవుని దేహమందు మూడు లోకాలను దర్శించగలిగెను

యుధిష్ఠిరునకు నారాయణుడు రాజనీతిని ఉపదేశించెను. నరనారాయణుల తపస్సును భంగం చేయుటకు యింద్రుడు, రంభ మొదలైన అప్సరసలను పంపించెను. కాని కృతార్థుడు కాలేకపోయెను. విష్ణుమహాత్మ్యం యిందులో విపులంగా వివరించబడింది

విష్ణుధర్మోత్తర పురాణం

విష్ణువు మధుకైటభులనే రాక్షసులను వధించుట, వామన చరిత్ర, విష్ణువు పరశురాముడై జన్మించి కార్తవీర్యార్జునాదులను వధించుట విష్ణువు దత్తాత్రేయుడై అవతరించుట, విష్ణువు రాహువు అనే రాక్షసుని శిరస్సును ఖండించుట, ఈశ్వరుడు నారాయణుని స్తోత్రము చేయుట, విష్ణువు భూమియందు ప్రమతి, వాసుదేవ, అర్జున, కలికి మొదలైన పేర్లతో మనుష్య రూపమున అవతరించుట, గజేంద్రమోక్షం మొదలైనవి మొదటి ఖండలో వర్ణింపబడినవి

మత్స్య, కూర్మ, హంస, అశ్వ, నృవరాహ, మయూర మొదలైన అవతారాలను విష్ణువు యెత్తినట్లు చెప్పబడింది. అనేక మన్వంతరములలో విష్ణువు వరాహ, వామన, త్రివిక్రమ, నరసింహ, మత్స్య, కూర్మ, హంస, నృవరాహ, భార్గవరామ, రామ, మాంధాతృ, పృథు, కార్తవీర్యార్జునుడు మొదలైన అవతారాలను యెత్తినట్లు చెప్పబడింది వరుణుడు, అతని కుమారుడైన పుష్కరుడు భార్గవ రామునికి రాజధర్మమును వివరించుట మొదలైనవి రెండవ ఖండలో వర్ణింపబడినవి

మధుకైటభ రాక్షసులను వధించుటకు ముందు విష్ణువు నాట్యము చేయుట, నారాయణుడు భూమియందు పూర్వశి రూపమును చిత్రించుట మొదలైనవి మూడవ ఖండమందు వర్ణింపబడినవి వివిధ దేవతల విగ్రహములు, దేవాలయములు వీటిని నిర్మించే విధానం యిందులో చెప్పబడింది అనేక వ్రతాల విధానం మహాత్మ్యం కూడా వివరించబడింది

నరసింహ పురాణం

నారాయణుడే విష్ణురూపమున బ్రహ్మాండమును సృష్టించుట, జన్మ రాహిత్యము కొరకు విష్ణువును పూజించవలసిన విధానం, నృసింహ పూజాఫలితం మొదలైనవి వర్ణించబడినవి

క్రియాయోగంసారం

లక్ష్మీపతియైన విష్ణువే వ్యాసుడై అవతరించుట, మహావిష్ణువు, తన శరీరమునుండి బ్రహ్మ, విష్ణు, రుద్రులను సృష్టించగా, ఆద్య ప్రకృతియే బ్రాహ్మి, లక్ష్మి, అంబికా రూపములను ధరించుట వైష్ణవ లక్షణములు, రామ షడక్షరీ మంత్ర మహాత్మ్యం విష్ణు నైవేద్య స్తుతి, ఏకాదశీవ్రత మహాత్మ్యం మొదలైనవి వర్ణించబడినవి. వైష్ణవులు, బ్రహ్మ, విష్ణు మహేశ్వరులను సమానముగా భావించవలెనని చెప్పబడింది

ఆదిపురాణం


కృష్ణ బలరాముల జననం, బాల్య వృత్తాంతం పూతన, శకటాసురుడు మొదలైన రాక్షసులను సంహరించుట, గోపికల యిండ్లలో వెన్నను దొంగిలించుట, భక్తుల లక్షణములు రాసక్రీడా వర్ణన, నారదుడు స్త్రీ రూపము పొందుట మొదలైనవి యిందులో వివరించబడినవి

కల్కిపురాణం

బ్రహ్మచే ప్రార్థితుడై విష్ణువు కలికిరూపమున భూమియందు అవతరించుట, కలికి పరశురాముని వద్ద సకల విద్యలను అభ్యసించుట, కలికి, బిల్వోదకేశ్వరుడైన శివుని పూజించి గుర్రమును, ఖడ్గమును వరముగా పొందుట, వర్ణాశ్రమ ధర్మ స్థాపనము చేయుట, లక్ష్మీదేవియే పద్మావతిగా జన్మించగా ఆమెను కలికి వివాహము చేసుకొనుట, కలికి బౌద్ధులను, మ్లేచ్ఛులను జయించుట, కలికి శశిధ్వజుని కుమార్తెయైన రమను పెండ్లియాడుట, కలికి తన భక్తులను రాజ్యాధిపతులనుగా చేయుట మొదలైనవి వర్ణింపబడినవి.

బృహన్నారదీయ పురాణం

మహావిష్ణువునుంచి ప్రపంచము ఉద్భవించుట, మహావిష్ణువే రజస్సత్వ తమోగుణముల వలన బ్రహ్మ, విష్ణు, రుద్రులుగా అవతరించుట, భాగవత లక్షణం, విష్ణువు, వామనుడై అవతరించుట బలికి త్రివిక్రమ రూపమున దర్శన మిచ్చుట మొదలైనవి వర్ణింపబడినవి. (సశేషం)





"తేనెమనసులు" లో సంధ్యారాణి.



"తేనెమనసులు" లో సుకన్య.

చిత్రలహరి

"తేనెమనసులు" చిత్రంలో నటించిన కొత్త తారలను గురించి తెలుసుకోవాలని కుతూహలం చూపుతున్నారు కొంతమంది పాఠకులు వారి వివరాలు సంగ్రహంగా ఇక్కడ పొందుపరుచుతున్నాను.

రామ్మోహన్

వారణాసి రామశాస్త్రిగారి కుమారుడు. 1938 ఫిబ్రవరి 4 న కర్నూలు జిల్లా గిద్దలూరులో జన్మించాడు. నలుగురు చెల్లెళ్లు, ముగ్గురు తమ్ములు ఉన్నారు. హైస్కూలు విద్య గిద్దలూరు, నంద్యాలలోను, ఇంటరు కర్నూలులోను చదివాడు హైదరాబాద్‌లో బి కాం చదువుతుండగా 1959 లో హిందూస్తాన్ ఎయిర్ క్రాఫ్ట్సులో ఉద్యోగం వచ్చింది. అందులో రామ్మోహన్ ఇన్‌స్ట్రుమెంట్స్ మెకానిక్‌గా ఉండేవాడు. 1964 ఏప్రిల్‌లో బాబూ మూవీస్‌లో చేరాడు వివాహం కాలేదు. తేనెమనసుల్లో చిట్టిబాబు వేషం యితనిది.

కృష్ణ

1942 మే 30 వ తెనాలి తాలూకా బుర్రిపాలెంలో ఘట్టమనేని వారియింట జన్మించాడు. ఇద్దరు తమ్ములు, ఇద్దరు చెల్లెళ్లు ఉన్నారు. హైస్కూలు విద్య తెనాలిలోను, ఇంటరు, బి యస్ సి. ఏలూరులోని సి ఆర్ ఆర్ కాలేజీలోను చదివాడు. బి యస్ సి లో ఎకనమిక్సు ఉండిపోయింది. నాటకాలలో చక్కటి అనుభవంవున్న యువకుడు. 1964 మే లో బాబూ మూవీస్ వారి సెలక్షన్‌లో ఎన్నికయ్యాడు. వివాహంకాలేదు తేనెమనసుల్లో రాజు.

సంధ్యారాణి

ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ సౌండ్ ఇంజనీరు సి. ఎల్. నాయుడి సంతానంలో సంధ్య రెండవది. 1947 మార్చి 9న బెంగాల్‌రాష్ట్రంలోని పాట్నాలో జన్మించినది. ఆమె బాల్యంలోనే నాయుడు గారు బెంగాల్‌నుంచి వచ్చేసి, విజయవాడలో స్థిర నివాసం ఏర్పరచు కున్నారు. హైస్కూలు విద్య విజయవాడలోను, పి యు సి గుంటూరు వుమన్స్ కాలేజ్ లోను చదివి, పాసయినది. బి యస్‌సి. చదువుతూ మానివేసింది శ్రీ మనోహర్ వద్ద భరతనాట్యం నేర్చుకున్నది వుమన్స్ కాలేజ్ ఫంక్షన్స్‌లో సంధ్య అనేకసార్లు నృత్యప్రదర్శనలు యిచ్చినదికూడ. బాగా పాడుతుంది. తెలుగుతో పాటు ఇంగ్లీషు, బెంగాలీ, హిందీభాషలు స్పష్టంగా చక్కగా మాట్లాడుతుంది అంద చందాలు, సంస్కారం వున్న చిన్నది కుమారి సంధ్యారాణి, తేనెమనసుల్లో సీత.

సుకన్య

విజయనగరంలో జన్మించినది. వయసు సుమారు ఇరవయి ఉండవచ్చు రాజమండ్రిలో పెరిగినది. భరతనాట్యంలో ప్రవేశమూ, అద్భుతంగా ప్రదర్శించగల నేర్పూ ఉన్నవి సుకన్యకు. వెండితెర మీద వొకప్పుడు ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించిన మాజీనటి కృష్ణవేణి—సుకన్యకు పినతల్లి. చదువుకున్నది కొద్దిపాటేఅయినా, జనరల్ స్టడీ ఎక్కువ చేసింది, సుకన్య తెలుగు సాహిత్యంలో దాదాపు ఆమె చదువని పుస్తకం అంటూ లేదేమో! చూడగానే ఎదుటివారిని ఆకర్షించగలిగే అందం ఈమెకున్నది మాటల్లోను, చేతల్లోను సంస్కారము ఉట్టిపడుతూ ఉంటుంది. చిత్రసీమలో ఉజ్వల భవిష్యత్తు ఉన్నది సుకన్యకు తేనెమనసుల్లో భానుమతి.

ఈ నలుగురూ బాబూ మూవీస్‌వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "తేనె మనసులు" లో ప్రధాన పాత్రధారులు. వారి గురించి నాకు అందిన సమాచారం యిక్కడ యధాతధంగా వ్రాయడం జరిగింది.

పరమానందయ్య శిష్యులు

శ్రీదేవి ప్రొడక్షన్స్‌వారు తమ రెండవ కానుకగా "పరమానందయ్య శిష్యులు" అనే జానపద చిత్రం నిర్మించే సన్నాహాలలో ఉన్నారు ఈ చిత్ర కధను నవీన పంధాలో రూపొందించారు సదాశివ బ్రహ్మం సంభాషణలు, గీతాలు వ్రాశారు. ఇంతవరకు ఈ చిత్రంలో ప్రధాన భూమికలు పోషించేందుకు ఎన్. టి. రామారావు, కె ఆర్. విజయ, ఎల్. విజయలక్ష్మి ఎన్నుకోబడినారు. మిగిలినవారిని కూడ త్వరలోనే ఎన్నికచేసి, ఏప్రిల్ నెల నుంచి సెట్స్‌కు వెళతారు చిత్రసీమలో గల హాస్యనటు లందరికీ యిందులో స్థానం కల్పించాలనీ నిర్మాత శ్రీ తోట సుబ్బారావు సంకల్పం. వీనస్ స్టూడియోలో నిర్మాణం జరిగే యీ చిత్రానికి సంగీతం ఘంటసాల, దర్శకత్వం . సి పుల్లయ్య (లవకుశ) నిర్వహించుతారు కుమారి కె ఆర్. విజయ నటించుతున్న రెండవ తెలుగు చిత్రమిది మొదటిది యస్ ఏ టి వారి 'శ్రీకృష్ణ పాండవీయము'. అందులో రుక్మిణిగా నటించుతున్నది విజయ తెలుగు చిత్రాలకు కొత్తగాని, తమిళ చిత్రరంగంలో యిపుడు ధృవతారగా వెలుగుతున్నది. హావభావాలు ప్రకటించడంలో ప్రజ్ఞగల చక్కని నటీ, నర్తకీ కూడా.

సురేష్ పిక్చర్స్

ఇంకా నామకరణం చేయని సురేష్ పిక్చర్స్ జానపద పౌరాణిక చిత్రానికి— నటీనటుల ఎన్నిక పూర్తి అయింది. కాంతారావు, రాజశ్రీ, రాజనాల, పద్మనాభం, బాలకృష్ణ, త్యాగరాజు, శోభన్‌బాబు, వి. వి. సుబ్బారావు (జూనియర్), ఎల్. విజయలక్ష్మి, వాణిశ్రీ, సురభి బాలసరస్వతి, పుష్పవల్లి మొదలైనవారు నటించుతున్న యీ చిత్రానికి సంభాషణలు జూనియర్ సముద్రాల వ్రాశారు గీతాలు.

చిత్రలహరి

ఆరుద్ర, జూనియర్ సముద్రాల, దాశరథి, నృత్యాలు కె ఎస్ రెడ్డి, కళ రాజేంద్రకుమార్, ఎడిటింగ్. మార్తాండ్, కెమెరా అన్నయ్య, దర్శకుడు సి యస్ రావు, నిర్మాత డి రామానాయుడు. ఫిబ్రవరి 13 నుంచి 28 వరకు విలన్ సెట్లో పని జరిగింది. ఇందులో కాంతారావు, ఎల్. విజయలక్ష్మి, రాజనాల, బాలసరస్వతి పాల్గొన్నారు తరువాత షెడ్యూలు మార్చి 5 నుంచి 21 వరకు కొనసాగుతుంది.

దేవత

కన్నుల్లో గుసగుసలు కనిపించనీ
గుండెల్లో గుసగుసలు వినిపించనీ ..."

అంటూ యువ హృదయం పల్లవించితే చెలి హృదయంలో చక్కిలిగింతలు చెలరేగి, సిగ్గు మొగ్గలు వేస్తుండగా "నీ చూపుతో నన్ను మురిపించకు, ఈ పూలు వింటాయి నడిచేయకు" అంటుంది. ఈ లేత మనసుల పలుకుల్లో తీపి నింపినది,

మధువు చిలికినది కవి వీటూరి. ఆ పలుకులను చక్కని వరుసలో మలచి, ఇంపుగా సంగీతం సమకూర్చినది సంగీత దర్శకుడు కోదండపాణి. భావయుక్తంగా ఆలపించినది సుశీల, ఘంటసాల. రేఖా అండ్ మురళీ ఆర్ట్సువారి "దేవత" చిత్రానికి గాను యీ గీతం మార్చి 1 వ తేదీన వాహినీలో రికార్డు చేశారు. చిత్రంలో ఎన్. టి. ఆర్. సావిత్రిలపై చిత్రీకరించుతారు.

ఈ చిత్రం షూటింగు నిర్విరామంగా జరుగుతున్నది.

ఆ కా శ రా మ న్న

మహారాజు అనంగపాలుని దర్బారు. ఆయనతో పాటు నరసింగరాయలు, వాచాలుడు అక్కడ ఆసీనులయి వున్నారు. ఇంతలో ఒక సైనికుడు వచ్చాడు. మహారాజుకు అభివాదం చేస్తూ "ప్రభువులకు అభివాదాలు! కాంచీపురం నుంచి రాయబారి వచ్చినాడు" చెప్పాడు.

"ప్రవేశపెట్టు!" అన్నాడు మహారాజు.

"అకస్మాత్తుగా రాయబారం పంపడంలో చక్రవర్తి ఆంతర్యం ఏమిటో?" సందేహం వెలిబుచ్చాడు వాచాలుడు.

"ఏముంది, తనసార్వభౌమాధికారాన్ని కాదన్నామని ఆగ్రహం వచ్చి ఉంటుంది." అన్నాడు నరసింహరాయలు ఓరగాచూస్తూ.

"వస్తే మాత్రం భయపడే వాళ్లెవరు ?" అన్నాడు వాచాలుడు లేని ధైర్యాన్ని ఒలకబోస్తూ.

"మహాపరాక్రమ వంతుడైన మన మహారాజు ఒకరికి భయపడడంగాని, ఒకరి ఆజ్ఞకు తలవంచడంగాని, ఏనాటికీ చేయరు..... ఏమంటారు మహారాజా?" మహారాజు ముందరికాళ్లకు బంధం వేసే ప్రయత్నంచేస్తూ అడిగాడు నరసింగరాయలు.

"అవును!" రాజు పలికాడు.

రాయబారి ప్రవేశించి "శ్రీశ్రీశ్రీ అనంగపాల మహారాజులుంగారికి అభివాదాలు. మా చక్రవర్తిగారు మీకు పంపించిన లేఖ........ అంటుండగా గోపాల కృష్ణరాయలు వచ్చాడు. వచ్చి "ఏమిటిది మహారాజా?" అంటూ అడిగాడు.

నరసింగరాయలు "ఇలా యివ్వండి ప్రభూ! నేను చదువుతాను." అంటూ రాయబారి వద్దనుంచి లేఖ తీసుకుని చదువ నారంభించాడు" రాజాధిరాజ, రాజమార్తాండ, రాజ పరమేశ్వర, కరురాయరగండ.... శ్రీశ్రీశ్రీ రిపుంజయ సార్వభౌములు— మహేంద్రపురాధీశుడైన అనంగపాల మహారాజునకు వ్రాయులేఖార్థములు....."

మధ్యలో వాచాలుడు అందుకుని ఎంత అహంభావం! తనకేమో తెగబారెడు బిరుదావళి స్వస్తి వాచకం చెప్పుకున్నారు అన్నాడు. – మహారాజును రెచ్చగొట్టేవిధంగా "మహావీరులైన మిమ్మల్ని ఒక సామాన్యునిగా సంభోదించాడు" అన్నాడు నరసింగరాయలు. "తప్పులేదు నాయనా! చక్రవర్తులు సామంతులకు వ్రాసే సాంప్రదాయం అదే!" అని చెప్పాడు గోపాలకృష్ణరాయలు. అనంగపాలునిలో పౌరుషం ఎగదన్నింది "మేమేం అతనికి సామంతులం కాము... ఆఁ, ఇంకా ఏమని వ్రాశాడో చదవండి!" అన్నాడు.

నరసింగరాయలు తిరిగి చదవడం మొదలుపెట్టి "మా ఏకైక పుత్రుడు చిరంజీవి వసంతరామరాయలకు మీ సహోదరి చంద్రావతి నిచ్చి వివాహం జరిపించుటకు నిశ్చయించినాము. గాన, వెంటనే పెండ్లికి తగిన ఏర్పాట్లు గావించమని కోరుతున్నాము... ఇట్లు... కాంచీపుర చక్రవర్తి రిపుంజయుడు" అంటూ ముగించాడు.

"అదృష్టవంతులం మహారాజా! చక్రవర్తే స్వయంగా తమ వియ్యాన్ని కోరుతున్నారు" అన్నాడు గోపాల కృష్ణరాయలు.

"అతను కోరేది మనతో వియ్యంకాదు, కయ్యం" వివరించాడు వ్యంగ్యంగా నరసింగరాయలు.

"బంధుత్వం అనే పేరుతో మిమ్మల్ని శాశ్వతంగా తన సామంతునిగా చేసుకోవాలనే యీ పన్నాగం పన్నాడు" అన్నాడు వాచాలుడు.

"ఒకవేళ నిజంగా వియ్యాన్ని కోరేవారైతే పిల్లనడిగే పద్ధతి యిదేనా?"

"మీయిష్టం లేకుండా, మీతో సంప్రదించకుండా, మీసోదరి పెళ్ళిని నిర్ణయించడానికి తనకేం హక్కుంది?" నరసింగరాయలుకు వత్తాసు పలుకు తున్నాడు వాచాలుడు.

"ఇది మిమ్మల్ని అవమానించడమేగా?"

"చక్రవర్తినని తనేం చేసినా చెల్లుతుందని, మీపై తనకు గల అధికారాన్ని నిరూపించడమేగా!"

"ఈ వివాహానికి అంగీకరిస్తే అతని సార్వభౌమత్వాన్ని మనం అంగీకరించినట్టే!"

"సామంతులం అని ఒప్పుకున్నట్టే!"

నరసింగరాయ, వాచాలుర పలుకులు మహారాజులో పౌరుషాన్ని ప్రేరేపించినవి. రిపుంజయుని మీద ఆయనకు విపరీతమైన ఆగ్రహావేశాలు అంకురించినవి. అందుకే "వీల్లేదు... ఎంత మాత్రం ఈ పెళ్లి జరగడానికి వీల్లేదు!" అన్నాడు.

ఈ రసవత్తర సన్నివేశం గౌరీప్రొడక్షన్స్ వారి "ఆకాశరామన్న" చిత్రానికిగాను యిటీవల గోల్డెన్ స్టూడియోలో చిత్రీకరించారు. నరసింగరాయలుగా రాజనాల, అనంగపాలునిగా రామకృష్ణ, గోపాలకృష్ణ రాయలుగా ప్రభాకరరెడ్డి, వాచాలుడుగా పేకేటి నటించారు.

వీటూరి రచన చేసిన యీ చిత్రానికి కోదండపాణి సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. దర్శకత్వం: జి. విశ్వనాథం, నిర్వహణ: యస్. భావనారాయణ.

భక్తతుకారాం

పద్మజా ప్రొడక్షన్సువారు "భక్త తుకారాం" చిత్రం నిర్మించుతున్నారు. అంజలీదేవి, కృష్ణకుమారి, గిరిజ, సురభి బాలసరస్వతి, ఎస్. వి. రంగారావు, కాంతారావు, రేలంగి, రమణమూర్తి, నాగయ్య, ముక్కామల, రాజ్ బాబు మొదలయినవారు నటించుతున్నారు. ఇందులో జగ్గయ్య శివాజీ పాత్రలో కనిపించుతారు.


రావూరి సంభాషణలు; సి. నారాయణరెడ్డి, కొసరాజు, ఆరుద్ర, రాజశ్రీ గీతాలు వ్రాశారు. సంగీతం : యస్. రాజేశ్వరరావు, కళ : సిహెచ్. ఇ. ప్రసాదరావు, దర్శకత్వం : పి. సుబ్బారావు. సుచిత్ర అనే కొత్త నటి యీ చిత్రం ద్వారా ఆంధ్ర ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నది.

అం త స్థు లు


జగపతీవారు హైదరాబాద్ శ్రీ సారధీ స్టూడియోలో నిర్మించుతున్న "అంతస్థులు" చిత్రం చాలాభాగం తయారయింది. నాగేశ్వరరావు, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, రమణారెడ్డి, రాజ్ బాబు, నెల్లూరి కాంతారావు, భానుమతి, కృష్ణకుమారి, జి. వరలక్ష్మి, ఎల్. విజయలక్ష్మి మొదలయినవారు నటించుతున్న యీ చిత్రానికి సంభాషణలు ఆచార్య ఆత్రేయ వ్రాశారు. పాటలు: ఆత్రేయ, కొసరాజు, ఆరుద్ర, సంగీతం : కె. వి. మహాదేవన్, నృత్యాలు : హీరాలాల్, కళ : జి. వి. సుబ్బారావు, కెమెరా : సి. నాగేశ్వరరావు, దర్శకత్వం : వి. మధుసూధనరావు.

మరొక అయిదు పాటల చిత్రీకరణ, కొంత పాచ్‌వర్కు మిగిలిఉన్నదనీ, మే నెలలో విడుదల చేయాలనే సంకల్పం తమ కున్నదనీ చెప్పారు. నిర్మాత : శ్రీ వి. బి. రాజేంద్రప్రసాద్ బి. ఎస్. సి.

—మోహన్ కుమార్ ★



'మంగమ్మ శపథం' కొడైకెనాల్ అవుట్‌డోర్ దృశ్యం.



మద్రాసులో ప్రదర్శనలిచ్చిన అమెరికన్ విద్యార్థుల బృందంలో కొందరు...

అమెరికన్ విద్యార్థుల వినోద కాలక్షేపం

"మా దేశపు వినోద ప్రదర్శనలు మీ కెంత బాగా నచ్చాయో, మీ దేశపు నృత్యాలంటే మాకూ అలానే ఎంతో ఇష్టం" అన్నారు ఆ బృందంలో ఒకరు. అందుకే కొందరు మద్రాసులో ఉన్న నాలుగైదు రోజుల్లో భారతీయ ప్రదర్శనలను అభ్యసించారు.

మార్చి 2, 3, 4 తేదీలలో మద్రాసులోని మ్యూజిక్ అకాడమీ థియేటర్‌లో అమెరికాలోని బ్రిగాం యంగ్ యూనివర్సిటీ విద్యార్థులు ఇచ్చిన వినోద ప్రదర్శనలు ఇక్కడ ఎంతగానో నచ్చాయి. 25 మంది సభ్యులున్న యీ బృందంలో పదముగ్గురు అమ్మాయిలు, పన్నెండుమంది అబ్బాయిలు ఉన్నారు. మద్రాసులో యిచ్చిన రెండు గంటల ప్రదర్శనలో రకరకాల నృత్యాలను, సంగీత రూపకాలను ప్రదర్శించారు. లలితసంగీతం, వాద్య సంగీతం మొదలైన ఇతర కార్యక్రమాలు కూడా జరిగాయి. ప్రత్యేకించి జానపద నృత్యాన్నొకదానిని ప్రదర్శించారు.


"కర్టెన్ టైమ్ యు. ఎస్. ఏ" అనే పేరుతో ఏర్పాటయిన యీ వినోద కాలక్షేపాన్ని ఈ విద్యార్థి బృందంవారు ఇండియాలో కాక మరికొన్ని ఇతర దేశాలలో కూడా ప్రదర్శిస్తున్నారు.

కార్యక్రమం జరిగిన రెండు గంటలసేపు ప్రేక్షకులకు ఎంతో వినోదాన్ని అందించటం జరిగింది. దాదాపు 15 అంశాలున్నాయి. అన్నీ అన్ని రకాలు కావటం ఒక విశేషం.

అమెరికాలోని నృత్యాలను, సంగీతాన్ని ఈ కార్యక్రమాలలో పూర్తిగా ఇమడ్చటం జరిగింది. ప్రదర్శనలన్నీ క్రమబద్ధంగాను, వేగంతోనూ జరిగిపోయాయి. విద్యార్థులంతా సుశిక్షితులు కావటం వల్ల, కార్యక్రమంలో ఎలాంటి లోపమూ జరుగలేదు.

ప్రముఖ అమెరికన్ ఎకార్డియనిస్ట్ జనెట్‌డాడ్ ఈ కార్యక్రమాలలో ప్రముఖపాత్ర వహించింది. అదే రోజు మధ్యాహ్నం ఆమె స్థానిక పత్రికా విలేఖరులతో మాట్లాడింది. కార్యక్రమాలలో ఒకటైన ఆమె 'ఎకార్డియన్' సంగీతం ఎంతో మధురంగా ఉంది. ముఖ్యంగా, ఆమె వినిపించిన భారతీయ సంగీతం ప్రేక్షకులను బాగా ఆకర్షించింది.

కొంత హాస్యం, మరికొంత జానపద ఫరళీ యీ కార్యక్రమాలలో భాగాలు.



హాలీవుడ్‌లో కూడా మంచి పేరు, ప్రఖ్యాతి సంపాదించిన పశ్చిమ జర్మనీ వర్ధమానతార ఎల్కీ-సోమర్.

ఒకరికి పదిలక్షలు మరొకరికి రు. 300

సినిమా పరిశ్రమలో ఎవరెవరికి ఎంత వెడుతుంది ? కలకత్తా 'స్టేట్స్‌మన్' పత్రికలో సునందా. కె. దత్త—రాయ్ కొన్ని సంఖ్యలు ఇచ్చారు.

భారతదేశం మొత్తంమీద మొదటి 100 మంది నటీనటులు మాత్రం కలిసి ఒక యేడు 11 కోట్ల రూపాయలు సంపాదించారుట.

కాని 150,000 మంది సాంకేతిక నిపుణులు, రచయితలు, చిన్న నటీనటులు, వగైరా కలిసి 5 కోట్ల రూపాయలు మాత్రమే గడించారుట.

4000 సినిమా హాలుల వారికి సుమారు 17 కోట్ల రూపాయలు అందాయిట.

అంటే వ్యక్తిగత సగటు ఆదాయం నటీనటులలో మనిషికి పది లక్షల పైన ఉంటే, మిగతా వారిలో మనిషికి 300 రూపాయల చిల్లర మాత్రమే అన్నమాట !


మరొక విచిత్రం ఏమిటంటే—పై లెక్కల ప్రకారం ఒక హాలుకీ సంవత్సరానికి 42,000 కి కొంచెం ఎక్కువ ఆదాయం వస్తే బొంబాయిలో రెండు హాలులకి మాత్రం ఒక నిర్మాత వడ్డీ లేకుండా 2 లక్షల డిపాజిట్ కాక వారానికి 12,000 రూపాయలు అద్దె ఇస్తున్నాడుట !

దత్తా—రాయ్ లెక్కల ప్రకారం (ఇవి ప్రొడ్యూసర్ల లెక్కలమీద ఆధారపడినవే !) ఒక హిందీ చిత్రానికి 15 లక్షలు ఖర్చుపెడితే 100 లక్షల తిరుగు ఆదాయం రావచ్చుట.

* * *

భారతదేశంలో కెల్లా పెద్ద డిస్ట్రిబ్యూటర్లు ఎవరు ? భారత ప్రభుత్వపు ఫిలింస్ డివిషన్‌ట ! ★

సరాగమాల



వి.ఎ.కె. రంగారావు

కలకత్తా నుంచి మంగళంపల్లి అనంత వెంకట్రామయ్య యిలా వ్రాశారు "కీర్తిశేషులైన ద్వారంవారి రికార్డుల లిస్టు (అన్నీ ఒక సంచికలో లేకపోతే రెండు మూడు వారాల్లో) పరిచయం చేస్తే మా భర్తీలు పూర్తిచేసుకొంటాము ముఖ్యముగా కలకత్తాలాంటి వూళ్లో డమ్‌డమ్‌కి పది మైళ్లలోనే ఉన్నా కూడా డీలర్లకు రికార్డు నంబర్లు యిచ్చి ఆర్డరు చేసుకొంటేనేగాని ఈలాంటి రికార్డులు దొరకవు అందుచేత ఈ కోరికను మన్నించ ప్రార్థన"

రెండు మూడు వారాల్లో మీ సలహాను తప్పక పాటిస్తాను. ఈ రెండు మూడు వారాల గడువు కారణం యిప్పటివరకు విడుదలయిన వారి రికార్డులలో ఏవేవి ఇంకా దొరుకుతున్నవో లేవో తెలుసుకోవటానికి వ్యవధి అవసరమవటం ఇక కలకత్తాలో దొరక్కపోవటం గురించి నేనేం చెప్పగలను ? భారతదేశంలో అందరికీ ఒకేఒక గ్రామఫోను వాదుడు కాబట్టి అటువంటి అవకతవకలు వారిష్టం వచ్చినట్లు సాగుతున్నవి మరొక ప్రత్యర్థి వచ్చేవరకు బాగుపడే సూచనలేవీ లేవు

వాల్తేరునుంచి ఎ కామేశ్వరరావు యిలా వ్రాశారు

"ఈమధ్య యిద్దరు ముగ్గురు సోదరులు సరాగమాలలో కొందరి గురించి మాత్రమే గొప్పగా వ్రాస్తున్నారని, ప్రజాదరణ పొందిన (హిట్టయిన) పాటలకు, సంగీత దర్శకులకు న్యాయం చేకూర్చటం లేదని విమర్శిస్తూ వ్రాశారు. నిజానికి హిట్ కావటం అంటే ఏమిటి ? ఎక్కువ రికార్డులు అమ్ముడు పోవటం గాని లేక ఎక్కువమంది వాళ్లలో నలగటం అనేగా— 'అంచె లంచెలు' అయినంత 'మనసు పరిమళించెనే, 'కాశీకి పోయాను' అయినంత 'ఎచటినుండి వీచెనో,' 'గోంగూర పాట' అయినంత 'ఎంత మధురసీమ', 'కోలు కోలోయమ్మ' అయినంత 'అలిగిన వేళనే' హిట్ కాలేదు. కారణం జనసామాన్యానికి అందుబాటులో ఉండటమూ, సంగీతంలో మెళకువలేమీ లేకపోవటమూ పదేళ్ల క్రిందటి శంకర్‌జైకిషన్ల అమరసంగీతానికీ వందల వాద్యాలతో తయారు జేసేవారి నేటి సంగీతానికీ పోలిక లేదనే రంగారావు గారి వాక్యాలతో నే నేకీభవిస్తాను. ప్రజాదరణనే కేవలం గణించి పాటల ఔన్నత్యాన్ని కొలువవలదని వినతిచేస్తూ రంగారావుగారిని తమ ఫక్కీ కొనసాగించవలసినదిగా అర్థిస్తున్నాను"

ధన్యవాదాలు

రేపల్లె నుంచి అనూరాధ యిలా వ్రాశారు :

"శంకర్‌జైకిషన్ల సంగీతముపై మీరు చేసిన విమర్శ నిష్పక్షపాతంగానే ఉన్నది ఈనాడు మన సంగీతములోని లోపాలు మీరు గ్రహించి వారి సంగీత స్థాయి దిగజారిందని అన్నారు నిజమే. కాని, వారి చిత్రాలలో పాటలు ప్రజాభిమానాన్ని చూరగొన్నవి దీన్నిబట్టి శ్రోతలలో సంగీతాభిమానుల సంఖ్య తక్కువని తెలుస్తున్నది ఏవో పాశ్చాత్య పోకడలు వినిపించే పాటలే ప్రజల అభిమానాన్ని పొందుతున్నాయి అటువంటి మంచి (ప్రజల దృష్టిలో) పాటలను విమర్శించి మీరు విమర్శకు గురి అవుతున్నారు కాని మీరు కొందరు నటులు, గాయకులపై పక్షపాత బుద్ధితో ప్రవర్తిస్తున్నారన్న మాట నిజమే"

ఇక ఈ చర్చ నిలిపివేస్తున్నాను శ్రద్ధ తీసుకొని ఈ విషయమై వ్రాసిన వారకు లందరికి ధన్యవాదాలు ఇరవై అయిదు నయాపైసల తపాలా బిళ్లలు తమ ఉత్తరాలతో జతపరచనివారికి ప్రత్యుత్తరము ఈయబడదని మరోమారు హెచ్చరిక.


ఇటీవల మల్లాది రామకృష్ణశాస్త్రిగారు మూడు సినిమాల కోసం తమ కవితామృతాన్ని చిలికించారు. మొదటి చిత్రం రామినీడు దర్శకత్వం వహిస్తున్న "పల్నాటి వీరకథ". ఈ దర్శకుని ప్రతి చిత్రంలోనూ మల్లాది వారి మణిపూసలు ఒకటో రెండో ఉంటాయన్న సంగతి పాఠకులకు విదితమే. "పల్నాటి వీరకథ" లో నాలుగు పాటలున్నవి. మొదటిదాన్ని గురించి ఇంతకుముందే వ్రాశాను. "వెలుగొచ్చెనే లేత వెలుగొచ్చెనే" అన్నది బాలచంద్రుని పుట్టుక గురించి పాడే పాట. మొదట వ్రాసిన పాట యిదైనా కారణాంతరాల వలన ఇంకా రికార్డు కాలేదు. ఇప్పటికి రికార్డయి



'ఉయ్యాల-జంపాల' లో కృష్ణకుమారి.

నవి అపూర్వమయిన నాయకి రాగంలో మాంచాల పాడే దేవీస్తుతి. గాత్రం సుశీల. మాంచాల బాలరాజుల ముగళగీతం "శీలము గలవారి చినవాడా" బాలమురళీకృష్ణ సుశీల పాడారు. మాంచాల బాలరాజుని యుద్ధోన్ముఖుని చేస్తూ పాడినది "రతిరాజసుందరా రణరంగధీరా" ఇదీ సుశీలే పాడినది. ఈ నాలుగు పాటలూ తెలుగు సినిమా సాహితీ స్రవంతిలో తేలియాడే దీపకళికలు.

ఈ పాటలలో ఒకదాని గురించి మరొక విశేషం. అందులో "అధిక చక్కని వీర" అనే ప్రయోగం ఉన్నది. మిడిమిడి జ్ఞానంతోనే అహంకారం కమ్ముకు వచ్చిన ఒక రంగారాయుడు మల్లాదివారి ముందే తన పరిమిత జ్ఞానాన్ని వెళ్లబోసుకున్నాడు. అది సంకర సమాసం కాదా అని. అప్పుడు వారు తెలియజెప్పారు. సంకర సమాసమే. కాని ఆనాటి స్త్రీల పాటలలో విరివిగా వాడబడిన పదం అది. కాబట్టి వాస్తవికత కోసం అది అక్కడ ఉపయోగింపబడినది అని. ఈ మిడిమిడి జ్ఞానశూరునికి అహంకారాంధకారం విడింది. ★



"చదువుకున్న భార్య" లో జమున.

అవీ - ఇవీ - అన్నీ


గుంటూరు ఫిలింఫాన్స్ పోటీ ఫలితాలు

ఇటీవల గుంటూరు ఫిలింఫాన్స్ అసోసియేషన్ వారు తమ ద్వితీయ మహాసభతోపాటు తెలుగు, హిందీ సినిమాపాటలు, కథారచన పోటీలు నిర్వహించారు. దీనికి గుంటూరు జిల్లా కలెక్టర్ శ్రీ శ్రీనివాసాచారి అధ్యక్షత వహించారు. పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీ దేవేంద్రరావు ప్రసంగించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ తుర్లపాటి కుటుంబరావు సావనీర్‌ను ఆవిష్కరించారు. నటి కృష్ణకుమారి విజేతలకు బహుమతులను పంచారు. తెలుగు సినిమాపాటలలో ప్రథమబహుమతి శ్రీ జె. యం. రాజా, ద్వితీయ బహుమతి శ్రీమతి శ్యామల కన్సొలేషన్ సర్టిఫికెట్లు: శ్రీ కె. విలన్స్, బి. హేమలత, యస్. వి. గోపాలశర్మ.

హిందీ సినిమాపాటలు· ప్రథమబహుమతి. బి. హేమలత, ద్వితీయబహుమతి: షేక్‌కమురుద్దీన్. కన్సొలేషన్: సి. శ్యామల, పి. విష్ణుతీర్థ, కె. విల్సన్. శాస్త్రీయ సంగీతం: ప్రథమబహుమతి· బి. హేమలత. ద్వితీయబహుమతి వి. శ్యామల. కథారచన· ప్రథమబహుమతి: టి. బి. మాధవరావు. ఇవికాక ప్రత్యేక బహుమతులు కూడ యిచ్చారు. జాతీయ కాలాపనకు కె. విల్సన్‌కు ప్రథమ బహుమతి లభించింది.

లిప్‌సిగ్ ఫేర్

తూర్పు జర్మనీలోని లిప్‌సిగ్ పట్న ప్రాముఖ్యం అక్కడజరిగే పురాతనమైన సంతవల్లనే సంతరించుకొన్నదని చెప్పవచ్చు. ఈసంవత్సరం లిప్‌సిగ్ పట్నం రెండు ఉత్సవాలను జరుపుకోనున్నది. ఇక్కడ జరిగే సంతలో 15, 16 శతాబ్దాలలోనే పెక్కుదేశాలు పాల్గొన్నాయనటానికి ఆధారాలున్నాయి. రెండో ప్రపంచయుద్ధంలో దెబ్బతిన్న ఈ ప్రదర్శన ప్రగతిని సాధించి 1945 లో పునర్దర్శన మిచ్చింది. ఆతర్వాతే యిది నిజమైన వ్యాపార ప్రదర్శనగా రూపొందింది. ప్రతి సంవత్సరం యిక్కడ జరిగే విదేశవ్యాపారం దేశంలో 40 శాతం ఉంటుంది. 1964 లో 22,000'మార్కు'లు. ఈసంత, సభ్యులకు అమూల్యమైన సహాయాన్ని ఆర్థికసహకారాన్ని అందిస్తుంది. వ్యాపార సంబంధమైన సలహాలనుకూడా యిస్తుంది. ఈసంత బంగారు పతకాలను, డిప్లొమాలనూ యిందులో పాల్గొనేవారికి కొత్తదనాన్ని చూపినందుకు బహుమానంగా యిచ్చి నవ్యతను పెంపొందిస్తుంది. ఈసంవత్సరం జరిగే ఫెయిర్‌లో పాల్గొనటానికి పెక్కుదేశాలనుంచి అర్జీలు వచ్చాయి. అంతర్జాతీయ వ్యాపార సంబంధాల సుస్థిరతకు, ప్రపంచప్రజల సుహృద్భావ విస్తరణకు ఈ 'ఫేర్' యితోధికంగా తోడ్పడుతుందని ఆశించవచ్చు. ★






దాసీని కొన్నానని భర్తను దండించడానికి వచ్చిన కలహకంఠి, భర్త కళ్ళల్లోకి చూసి భక్తి పుట్టుకువచ్చి వెంటనే మారిపోయింది.
ఎందుకు? ఆ వచ్చింది కాలకౌశికుని రూపంలో సాక్షాత్తూ కాశీ విశ్వనాదుడే!

నిర్మాత - దర్శకత్వం:
K. V. రెడ్డి, B. Sc. Hon

విజయావారి అద్వితీయ పౌరాణిక చిత్రం "సత్య హరిశ్చంద్ర"


తప్పక చూడండి
భారత నారి వీరోచిత సాహస గాథ
డి.వి.ఎస్.ప్రొడక్షన్స్ వారి
మంగమ్మ శపథం
దర్శకత్వం:
బి.విఠలాచార్య
నిర్మాత:
డి.వి.ఎస్.రాజు
సంగీతం:
టి.వి.రాజు
రచన:
సముద్రాల
కో డైరక్టర్:
యస్.డి.లాల్
ఆంధ్ర: పూర్ణా పిక్చర్స్ నైజాం: ఉషా ఫిలింస్ సీడెడ్: ఎస్.ఎ.డి
మైసూరు: సుదర్శన్ మూవీస్ నార్త్ఇండియా: దొడ్డొ పిక్చర్స్



Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6&7 Thambuchetty Street Madras-1. Phone; 29766 & 23713. Chief Editor S. Sambhu Prasad.



కొత్తనటి చంద్రకళ



ఆషా మోహన్

అందమైన ముఖ వర్చస్సునకు
ఎక్కువ కాలం నిలిచే పరిమళమునకు

రెమి

టాల్కమ్ పౌడరు